ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
నిజామాబాద్ fb.com/vaartha

PUBLISHED FROM NIZAMABAD, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

27-1-2023 శుక్రవారం సంపుటి : 28 సంచిక : 357, పేజీలు : 10+4 వెల : 6.50

మేయర్ ఎన్నికపై సుప్రీంకోర్టుకు ఆప్
ఛత్తీస్‌గఢ్‌లో నిరుద్యోగులకు భృతి..
5లో

## కరోనాకు భారత్ బయోటెక్ చుక్కలమందు

### 18 యేళ్లు దాటిన వారికి 'ఇన్‌కొవాక్'



**న్యూఢిల్లీ, జనవరి 26:** కొవిడ్ నివారణకు భారత్ బయోటెక్ తయారు చేసిన నాసికా టీకా ఇన్‌కొవాక్‌ను కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్ సుఖ్ మాండవీయ, కేంద్ర శాస్త్రసాంకేతికశాఖ మంత్రి జితేంద్రసింగ్ గురువారం అధికారికంగా విడుదల చేశారు. ముక్కుద్వారా వేసే ఈ చుక్కల మందును వాషింగ్టన్ యూనివర్సిటీ సెయింట్ లూయిస్ సహకారంతో భారత్ బయోటెక్ అభివృద్ధి చేసింది. కరోనాకు ఇది ప్రపంచంలోనే తొలి నాసికా టీకా. 18 ఏళ్లు దాటిన వారికి దీన్ని రెండు ≫2

## గవర్నర్ తీరుపై రాష్ట్రపతికి లేఖ రాస్తాం

### -మంత్రి తలసాని

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 26:** గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌పై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నిప్పులు చెరిగారు. గణతంత్ర దినోత్సవంలో రాజకీయాలు మాట్లాడటం తగదు అని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పట్ల గవర్నర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తప్పుపట్టారు. రాజ్యాంగ స్ఫూర్తి దెబ్బతినేలా గవర్నర్ మాట్లాడారని తలసాని పేర్కొన్నారు. గవర్నర్ వైఖరిపై త్వరలోనే రాష్ట్రపతి ముర్ముకు లేఖ రాస్తామని చెప్పారు. గవర్నర్ విషయంలో రాష్ట్రపతి కల్పించుకోవాలని కోరారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉంటూ ఓ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం సరైంది కాదని పేర్కొన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజును రాజకీయాలకు ఉపయోగించడం తగదు అని ధ్వజమెత్తారు.



ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో గురువారం జరిగిన గణతంత్రవేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్‌ఫతా ఎల్‌సిసి, ప్రధాని మోడీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్

## కర్తవ్యపథ్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

### వేడుకల్లో పాల్గొన్న ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్‌ఫతా, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోడీ, పలువురు కేంద్ర మంత్రులు

**న్యూఢిల్లీ, జనవరి 26:** దేశ రాజధాని ఢిల్లీలో 74వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో మొదటిసారి నిర్వహించిన ఈ వేడుకల్లో జాతీయ పతాకాన్ని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆవిష్కరించారు. సైనిక దళాలనుంచి రాష్ట్రపతి గౌరవవందనం స్వీకరించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతాఎల్ సిసీ హాజరయ్యారు. ఈ ≫2

## పార్టీ ఫిరాయిస్తే సభ్యత్వం రద్దు చేయాలి: పిసిసి చీఫ్ రేవంత్ 2లో

# రాజ్యాంగమే దిక్సూచి

### కొందరికి ఫార్మ్‌హౌస్‌లు కాదు, అందరికీ ఫార్మ్‌లు కావాలి

### కొత్త భవనాల నిర్మాణమే అభివృద్ధి కాదు, అభివృద్ధి అంటే జాతి నిర్మాణం

### సిఎం కెసిఆర్ తీరుపై గవర్నర్ తమిళిసై పరోక్ష విమర్శలు

### రాజ్‌భవన్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు, పరేడ్ నిర్వహణ



గురువారం రాజ్‌భవన్‌లో జెండా ఆవిష్కరించి గౌరవవందనం స్వీకరిస్తున్న గవర్నర్ తమిళిసై

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి26:** తెలంగాణ రాజ్‌భవన్‌లో గణతంత్ర వేడుకలు గురువారం ఉదయం ఘనంగా జరిగాయి. పరేడ్ గ్రౌండ్‌లో అమర జవాన్ల స్థూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం... గవర్నర్ రాజ్‌భవన్‌లో నిర్వహించిన రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొన్నారు. సైనికుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రథమ పౌరురాలిగా రాష్ట్ర అభివృద్ధి,ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ప్రయత్నిస్తామని తెలిపారు. కొత్త భవనాల నిర్మాణాలు మాత్రమే అభివృద్ధి కాదని, అభివృద్ధి అంటే జాతి నిర్మాణమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రైతులు,పేదలందరికీ భూములు,ఇళ్లు కావాలని సిఎం కెసిఆర్ ≫2



ప్రగతిభవన్‌లో గురువారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి కెసిఆర్

## ప్రగతి భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సిఎం కెసిఆర్

### పెరేడ్ గ్రౌండ్స్‌లో అమర జవానులకు శ్రద్ధాంజలి ఘటించిన సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి26:** భారత 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గురువారంనాడు ప్రగతి భవన్‌లో జాతీయ పతాకావిష్కరణ చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ,రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి సిఎం పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి,నవీన్‌రావు,శంభీపూర్‌రాజు, మధుసూధనాచారి, సిఎస్ శాంతకుమారి,డిజిపి అంజనీకుమార్,సిఎంఒ ఉన్నతాధికారులు,సిబ్బంది పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లోని అమర జవానుల స్మారక స్థూపం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి అమర జవాన్లకు నివాళులు అర్పించడానికి బయలుదేరారు. అక్కడ అమర జవానులకు సిఎంకెసిఆర్ శ్రద్ధాంజలి ఘటించి, ఘన నివాళులు ≫2








గురువారం న్యూడిల్లీలోని కర్తవ్యపథ్‌లో బైక్ విన్యాసాలు







పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ శకటం



సాస్కృతిక కళాబృదాల ప్రదర్శనలు

# ఘనంగా గణతంత్ర వేడుకలు

≫ వేడుకల్లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోడీ, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత ఆర్మీకి చెందిన త్రివిధ దళాలు కవాతు నిర్వహించాయి. ఈజిప్ట్ నుంచి వచ్చిన 120మంది సైనికుల ప్రత్యేక బృందం కూడా కవాతులో పాల్గొన్నది. ఉదయం పదిన్నరకు విజయ్‌చౌక్ వద్ద మొదలైన కవాతు ఎర్రకోట వరకూ సాగింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగే కవాతుకు ముందు ప్రధాని మోడీ జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం డిజిటల్ విజిటర్స్ బుక్‌లో సందేశాన్ని నమోదు చేశారు. వేడుకల కోసం ప్రధాని ప్రత్యేక వస్త్రధారణతో వచ్చారు. తెల్లని కుర్తా, ప్యాంట్, నల్లని కోటు, తలపై రాజస్థానీ తలపాగా ధరించారు.

ఈసారి గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఓ ప్రత్యేకత ఉంది. ఆత్మనిర్భర్ కింద పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన యుద్ధ ట్యాంకులను ఈ వేడుకలో ప్రదర్శించారు. కర్తవ్యపథ్ పరేడ్‌లో భారత వైమానిక దళం, నౌకాదళం శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 861 బ్రహ్మోస్ రెజిమెంట్ ఈ కవాతులో పాల్గొన్నది. అర్జున్ ట్యాంకులు, నాగ్ క్షిపణులు, కె..9 వజ్ర టి ట్యాంకులు, 64 అసాల్ట్ ఇంజినీర్ రెజిమెంట్‌కు చెందిన 10 మీటర్ల షార్ట్ స్పాన్ బ్రిడ్జి వాహనాలు, అమృత్‌సర్ ఎయిర్ ఫీల్డ్‌కు చెందిన ఆకాశ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, బిఎంపి..2 వాహనాలను ఈ వేడుకల్లో ప్రదర్శించారు.



# వాతావరణ ప్రభావంతో జోడోయాత్రకు స్వల్పవిరామం

**శ్రీనగర్, జనవరి 26:** జమ్ముకాశ్మీర్‌లో కొనసాగుతున్న రాహుల్ జోడోయాత్ర వాతావరణం సహకరించకపోవడంతో ప్రస్తుతం నిలిపివేసింది. జమ్ముకాశ్మీర్‌లోని రంబన్‌జిల్లాలో వాతావరణం అత్యంత శీతలంగా మారడంతో జోడోయాత్రను తాత్కాలికంగా సస్పెండ్‌చేసినట్లు రాహుల్ టీమ్ ప్రకటించింది. ముందురోజు భారీ వర్షాలున్నప్పటికీ రాహుల్ తన యాత్రను ప్రారంబించారు. అయితే ఆ తర్వాత రంబన్ యాత్రను నిలిపివేసారు. తీవ్రస్థాయి వాతావరణ మార్పులు, తరచూ కొండచరియలు విరిగిపడుతుండటంతో రాంబన్‌లో జోడోయాత్రను నిలపివేసారు. అలాగే బనిహాల్‌లో కూడా యాత్రను రద్దుచేసినట్లుప్రకటించారు. శుక్రవారం విరామం సహజంగానే ప్రకటించారు. జోడోయాత్ర తిరిగి 27వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం అవుతుందని కాంగ్రెస్‌నేత జైరామ్‌రమేష్ ప్రకటించారు. కాశ్మీర్‌లోయలోకి ప్రవేశించేముందు రాహుల్ బనిహాల్‌లోనే రిపబ్లిక్‌డే పతాకావిష్కరణచేస్తారని భావించారు. అయితే వాతావరణం అందుకు సహకరించలేదు. కొండచరియలు,బురదతోకూడిన మట్టిరాళ్లు పడుతుండటంతో అనేకచోట్ల ట్రాఫిక్ అంతరాయాలు జరిగాయిన, బనిహాల్, ఛర్కోటేల్లో మరింతగా తీవ్రపరిస్థితులున్నాయని అందువల్లనే హైవేలోని అనేక మార్గాలు ఇపుడు అనుకూలంగా లేనందున సెక్యూరిటీ రీత్యా నిలిపివేసినట్లు తెలిపారు. ఇదిలా ఉంటే నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా,మాజీసిఎం ఓమర్ అబ్దుల్లాలు కూడా జోడోయాత్రలో పాల్గొంటారని సమాచారం అందింది. జోడోయాత్ర ముఖ్యోద్దేశ్యమే ఏకతాటిపైకి భారత్‌ను తీసు కురావడమని విద్వేషాన్ని నిర్మూలించడమని అందుకే తాము యాత్రలో పాల్గొనదలిచినట్లు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు పేర్కొనట్లు కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. స్వాతంత్ర్యంకోసం, మన స్వేఛ్ఛకోసం కృషిచేసిన ముందుతరం ప్రాణత్యాగాలను ఎవ్వరూ మరువకూడదని అందుకే భారత్ అన్నివర్గాలతో ఐకమత్యంగాముందుకు సాగాలని అదే జోడోయాత్ర స్ఫూర్తి అయినందున పాల్గొంటున్నట్లు అబ్దుల్లా పేర్కొన్నారు.

## చైనాలో భారీగా తగ్గిన కరోనా కేసులు, మరణాలు!

**బీజింగ్, జనవరి 26:** కరోనా గండం నుంచి చైనా మరోసారి గట్టెక్కింది. జనవరిలో మొదట్లో కొవిడ్ పీక్ స్టేజికి వెళ్లి భారీగా నమోదైన కేసులు, మరణాలు ఎట్టకేలకు దిగొచ్చాయి. మూడు వారాల క్రితంతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. జనవరి మొదటి వారంతో పోలిస్తే కరోనా కొత్త కేసులు 72 శాతం, మరణాలు 79 శాతం తగ్గినట్లు చైనా అంటువ్యాధుల నియంత్రణ కేంద్రం అధికారిక వెబ్‌సైట్లో వెల్లడించింది. చైనా జనాభాలో 80శాతం మంది కరోనా బారినపడ్డారని, మరో రెండు, మూడు నెలల్లో మరో వేవ్ వచ్చే ప్రమాదం ఉందని ప్రభుత్వ శాస్త్రవేత్త ఒకరు గత వారమే హెచ్చరించారు. దీంతో ప్రభుత్వం కరోనా లెక్కలను అధికారికంగా వెల్లడించింది. కేసులు తగ్గినట్లు పేర్కొంది. ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం జనవరి 4న 1,28,000 కరోనా రోగులు ఉండగా, జనవరి 23 నాటికి ఆ సంఖ్య 36వేలకు పడిపోయింది.

# రాజ్యాంగమే దిక్సూచి

≫ సర్కార్ తీరుపై పరోక్ష విమర్శలు చేశారు. తెలంగాణ గౌరవాన్ని నిలబెట్టుకుందామని, రాష్ట్ర అభ్యుదయంలో తన పాత్ర ఉంటుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకోవాలన్న గవర్నర్ తెలంగాణలో ప్రజాస్వామ్య హక్కును కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కొంతమందికి తాను నచ్చకపోవచ్చునని, కొందరికి నచ్చకపోయినా తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణలో ఆందోళకర పరిస్థితులు ఉన్నాయన్న గవర్నర్ రోజుకు 22 మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ యువత ధైర్యంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన సహకారాన్ని రాజ్‌భవన్ అందిస్తోందని, నాకు తెలంగాణ వాళ్లంటే ఇష్టం....అందుకే ఎంత కష్టమైన పనిచేస్తానని పేర్కొన్నారు.
ఎందరో వీరుల త్యాగ ఫలితం మన స్వాతంత్రమని, ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం కలిగిన మన దేశం నిజమైన ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం దిక్సూచి అని, మేధావులు,మహోన్నత వ్యక్తులు మన రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. రాజ్యాంగ రచనలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎంతో అంకిభావం కనబరిచారని తెలిపారు.ఆ రాజ్యాంగం ప్రకారమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిందని తెలిపారు. తెలంగాణకు ఘనమైన,విశిష్టమైన చరిత్ర ఉందని తెలిపారు. శతాబ్దాల చరిత్ర ఉన్న హైదరాబాద్ ఎన్నో రంగాల్లో దూసుకుపోతుందన్నారు. వైద్యం,ఐటీ రంగాల్లో భాగ్యనగరం ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందన్నారు. దేశంలోని అన్ని నగరాలకు హైదరాబాద్ అనుసంధానమై ఉందని, తెలంగాణలో పెద్ద ఎత్తున హైవేలు నిర్మించిన ప్రధానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు గవర్నర్ ప్రకటించారు. ఇటీవలే తెలుగు రాష్ట్రాలకు ప్రధాని మోడీ వందే భారత్ రైలును కేటాయించారని వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన సహకారాన్ని రాజ్‌భవన్ అందిస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో రాజ్‌భవన్ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని,వారిలో పోషకాహార సమస్య నివారణకు కృషి చేస్తున్నామన్నారు. సమ్మక్క,సారమ్మ,కొమురం భీమ్‌లను స్మరించుకున్నారు.

**ఆరుగురికి సన్మానం**

రాజ్‌భవన్‌లో గణతంత్ర వేడుకులకు ముందు సికింద్రాబాద్ సైనిక అమరవీరుల స్మారక స్థూపం వద్ద గవర్నర్‌నివాళులు అర్పించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. రాజ్‌భవన్‌లో గణతంత్ర వేడుకల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, డిజిపి అంజనీకుమార్,ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ, విశిష్ట సేవలందించిన ఆరుగురిని సన్మానించారు. సినీ ప్రముఖులు ఎం.ఎ.కీరవాణి,చంద్రబోస్‌తో పాటు సివిల్ శిక్షకురాలు బాలలతను సత్కరించారు. పారా అథ్లెట్ లోకేశ్వరి,టేబుల్ టెన్నీస్ క్రీడాకారిని ఆకుల శ్రీజ తరఫున వారి తల్లిదండ్రులు,ఎన్జీవో భగవాన్,మహవీర్ వికలాంగ సహాయతా సమితి ప్రతినిధులను సన్మానించారు.

**వారం - వర్జ్యం**

**27-1-2023 శుక్రవారం**

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయనం, మాఘ మాసం, శుక్ల పక్షం, కార్తి శ్రవణం
షష్ఠి మ.03-14; రేవతి రా.12-22
వర్జ్యం మ.12-42 ల 02-16
రా.కా.ఉ.10-30-12.00
యమగండం మ.3-00 ల 4-30 వ
దుర్ముహూర్తం ఉ.8-24 ల 9-12 వ
మ.12-24 ల 1-12 వ

**వార్తాఫలం**

**మేషం:** ఉత్సాహంగా గడుస్తుంది. క్రయ-విక్రయాలు లాభదాయకం.

**వృషభం:** ఆకస్మిక ప్రయాణం చేస్తారు. ఆర్థికంగా ఆశించిన ఫలితాలుంటాయి.

**మిథునం:** కుటుంబంలో మనస్పర్థలు. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది.

**కర్కాటకం:** అనుకోని సంఘటనలు జరుగుతాయి. ప్రయాణం లాభిస్తుంది.

**సింహం:** ముఖ్యమైన నిర్ణయం అమలు. ఆర్థిక ఇబ్బందులుంటాయి. గృహ యోగం.

**కన్య:** శుభ కార్యాలకు హాజరవుతారు. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది.

**తుల:** రుణాలు మంజూరు. సోదరుల మధ్య ఐకమత్యం లోపిస్తుంది. వాహన యోగం.

**వృశ్చికం:** ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మిత్రులను కలుసుకుంటారు.

**ధనుస్సు:** శత్రువులు మిత్రులవుతారు. తీర్థ యాత్రలు చేస్తారు. విద్యార్థులకు లాభం.

**మకరం:** ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. చర్చలు వాయిదా.

**కుంభం:** సామాన్యంగా ఉంటుంది. శుభ వర్తమానం అందుకుంటారు.

**మీనం:** విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. చిరు వ్యాపారులకు లాభం.

- పాలకుర్తి సంతోష శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్

# గణతంత్ర వేడుకలు జరగకుండా ప్లాన్ వేశారు

## తెలంగాణలో రాజ్యాంగాన్ని అగౌరవ పరిచిన తీరు చరిత్రలో నిలిచిపోతుంది

## కెసిఆర్ ప్రభుత్వంపై పుదుచ్చేరిలో గవర్నర్ తమిళిసై కీలక వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి26:** తెలంగాణలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్,ప్రభుత్వం మధ్య విమర్శలపర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మాటల దాడి మరింతగా పెరిగింది. గవర్నర్ తమిళిసై అటు పుదుచ్చేరిలో కూడా రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొన్నారు. పుదుచ్చేరిలో కూడా గవర్నర్ తమిళిసై తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.
తమిళిసై మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ఏం జరుగుతోందో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని అగౌరవపరిచిన తీరు చరిత్రలో నిలిచిపోతుందని వెల్లడించారు. తెలంగాణలో రాజ్యాంగ ఉల్లంఘనలు,కెసిఆర్ ప్రభుత్వంపై కేంద్రానికి నివేదిక ఇచ్చానని గవర్నర్ చెప్పారు. 5లక్షల మందితో కెసిఆర్ బహిరంగ సభ పెట్టారని,ఖమ్మం సభకు లేని కరోనా రిపబ్లిక్ డేకు గుర్తు వచ్చిందా? అని పుదుచ్చేరి గణతంత్ర వేడుకల్లో సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల నుంచి రాజ్‌భవనంపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని, ప్రభుత్వం రాజ్యాంగ విలువలు పాటించడం లేదని తమిళిసై ఆరోపించారు. ప్రజల మధ్య గణతంత్ర వేడుకలు జరగకుండా చేయాలని కొంత మంది యత్నించారని ఆరోపించారు.
ఓ శ్రేయోభిలాషి కోర్టుకు వెళ్లడంతో మళ్లీ వేడుకులకు అవకాశం వచ్చిందని తెలిపారు. గణతంత్ర వేడుకలు ఘనంగా జరపాలని 2 నెలల క్రితమే ప్రభుత్వానికి లేఖ రాశానని ఈ సందర్భంగా తెలిపారు. దాని పక్కనపెట్టి రాజ్‌భవన్‌లోనే జరుపుకోవాలని 2 రోజుల క్రితమే ప్రభుత్వం సమాచారం ఇచ్చిందని తెలిపినట్లు చెప్పారు. కేంద్ర మార్గదర్శకాలను రాష్ట్రం పట్టించుకోలేదని విమర్శించారు. కనీసం ప్రసంగ పాఠాన్ని కూడా ప్రభుత్వం పంపలేదని మండిపడ్డారు. గణతంత్ర వేడుకల సందర్భంగా కొందరిని సన్మానించామన్నారు. గణతంత్ర వేడుకలు ప్రజల మధ్య జరుపుకోవడం ఆనందాన్ని ఇచ్చిందని విమర్శించారు. ప్రజల మధ్య రిపబ్లిక్ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని, తెలంగాణలో ఏం జరుగుతుందో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని అగౌరవపరిచిన తీరు చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. ప్రజల మధ్య గణతంత్ర వేడుకలు జరగకుండా చేయాలని కొంతమంది యత్నించారన్నారు.

# రాజ్‌భవన్‌లో ఎట్ హోం.. దూరంగా కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి26:** భారత గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా రాజ్‌భవన్‌లో గురువారం సాయంత్రం ఎట్ హోం కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు,మంత్రులు దూరంగా ఉన్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, మంత్రులు,ఎంపీలు ఒక్కరు కూడా హాజరు కాలేదు. ఉదయం రాజ్‌భవన్‌లో జరిగిన గణతంత్ర వేడుకలకు సైతం సిఎం కెసిఆర్ దూరంగా ఉన్నారు. ఎట్ హోమ్ కార్యక్రమంలో మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు,రాష్ట్ర బిజెపి అధ్యక్షులు బండి సంజయ్, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి,మాజీ ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, బాబు మోహన్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్,డిజిపి అంజనీకుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సిఎం కెసిఆర్

≫ అర్పించారు.ముందుగా అమరవీరుల స్థూపం వద్ద జ్యోతి ప్రజ్వలనం చేశారు. పుష్పాంజలి ఘటించిన సందర్భంగా దేశం కోసం అమర జవానుల త్యాగాలను సిఎం కెసిఆర్ స్మరించుకున్నారు.

# కరోనాకు భారత్ బయోటెక్ చుక్కలమందు

≫ ప్రాథమిక డోసు లుగా, బూస్టర్ డోసుగాను వినియోగించవ చ్చు. ఈ కార్యక్రమంలో భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్ల, సంస్థ జాయింట్ ఎండి సుచిత్ర ఎల్ల, సంస్థ జాయింట్ ఎండి సుచిత్ర ఎల్ల తదితరులు పాల్గొ న్నారు. ఇన్‌కోవాక్ ఇప్పటికే కొవిన్ పోర్టల్‌లో అందుబాటులోకి వచ్చింది. ప్రైవేట్‌కు ఒక డోసు ధర రూ.800 కాగా, ప్రభుత్వాలకు రూ.325కు అందించనున్నట్లు భారత్ బయోటెక్ ఇటీవల వెల్లడించింది. ఈ వారం నుంచే ఈ టీకా మార్కెట్లో అందుబాటులోకి వస్తుందని తెలిపింది. ఇన్‌కొవాక్ వల్ల టీకా ఇవ్వడం, రవాణా, నిల్వ ఎంతో సులువవుతుంది. ఈ టీకాను అధికంగా ఉత్పత్తి చేసే అవకాశమూ ఉంటుంది.

# తెలంగాణ మోడల్ అభివృద్ధి పథకాలు మహారాష్ట్రలో కూడా అమలు చేయాలి



గురువారం ప్రగతిభవన్‌లో సిఎం కెసిఆర్‌తో భేటీ అయిన శంభాజీరాజే

## సిఎం కెసిఆర్‌తో ఛత్రపతి శివాజీ 13వ వారసుడు శంభాజీ రాజే భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి26:** మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ 13వ వారసుడు, సాహూ మహారాజ్ మనవడు, కొల్హాపూర్ సంస్థాన వారసుడు, స్వరాజ్ ఉద్యమ కారుడు,మాజీ ఎంపీ ఛత్రపతి శంభూజీ రాజె.... గురువారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుతో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రగతి భవన్‌కు చేరుకున్న శంభాజీ రాజెను శాలువాతో సత్కరించి,పుష్పగుచ్ఛంతో సిఎం కెసిఆర్ వారికి ఘనంగా ఆహ్వానం పలికారు. మధ్యాహ్నం భోజనంతో వారికి అతిథ్యం ఇచ్చారు. అనంతరం సిఎం కెసిఆర్‌తో సుదీర్ఘంగా పలు అంశాల మీద లోతైన చర్చలు జరిగాయి. దేశానికే ఆదర్శంగా,అనతికాలంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రజా సంక్షేమం,అభివృద్ధి గురించి ఆయన ఆరా తీశారు. రైతులు,ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ సహా అన్ని వర్గాల ప్రజలకు ఇంత గొప్పగా సంక్షేమాన్ని అందిచడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్యాచరణ విధి విధానాలను తెలుసుకోవడానికి శంభాజీ రాజె ఆసక్తిని కనబరిచారు. అందుకు సంబంధించిన అంశాలను సిఎం కెసిఆర్‌ను సవివరంగా అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ మోడల్ అభివృద్ధి సంక్షేమ పథకాలను మహారాష్ట్రలో కూడా అమలు చేస్తే బాగుంటుందని శంభాజీ తన ఆకాంక్షను వెల్లడించారు. అద్భుతమైన తెలంగాణ ప్రగతి నమూనా ఇక్కడికే పరిమితం కాకుండా మహారాష్ట్ర సహా మిగిలిన అన్ని రాష్ట్రాలకు దేశ వ్యాప్తంగా విస్తరించాల్సి వుందని రాజె అభిప్రాయపడ్డారు. అభివృద్ధి అంశాలతో పాటు,దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ఇరువురి నడుమ సుదీర్ఘ చర్చ సాగింది. దేశ ప్రజల అభ్యున్నతి కోసం, దేశ సమగ్రత కోసం,ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వినూత్న అజెండాను ప్రజల ముందుకు రావాల్సిన అవసరమున్నదని వారిరువురు అభిప్రాయపడ్డారు. అవసరమైతే సందర్భాన్ని బట్టి మళ్లీ వొకసారి కలుసుకుని అన్ని అంశాలపై చర్చిద్దామని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శంభాజీ రాజే పూర్వీకులు శివాజీ మహారాజ్ నుంచి సాహూ మహారాజ్ దాకా ఈ దేశానికి వారందించిన సేవలను ఇరువురు స్మరించుకున్నారు. సమానత్వం,ప్రజా సంక్షేమం దిశగా వారందించిన పాలన దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని సిఎం కెసిఆర్ అభిప్రాయపడ్డారు. వారి స్ఫూర్తితోనే కుల మత వివక్షకు తావు లేకుండా తెలంగాణలో ప్రజాపాలన కొనసాగుతుందని ఈ సందర్భంగా జరిగిన చర్చలో సిఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగో రాజర్షి సాహు ఛత్రుపతి' పుస్తకాన్ని సిఎం కెసిఆర్ రాజె అందించారు. మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు కవిత,మధుసూధనాచారి,పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు రాజేతో పాటు వచ్చిన ప్రతినిధులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# పార్టీ ఫిరాయిస్తే సభ్యత్వం రద్దు చేయాలి

## ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి ముందుకు తీసుకెళ్లాలి

## ఫిబ్రవరి 6 నుంచి 60రోజుల పాటు హాత్ సే హాత్ జోడో యాత్ర

## రిజర్వేషన్లు పేదలకు దూరం చేసేందుకు కుట్ర జరుగుతుంది

### టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 26 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి ముందుకు తీసుకునిపోవాలని టిపిసిసి అధ్య క్షులు రేవంత్‌రెడ్డి కోరారు. గురువారం భారత గణతంత్ర దినోత్సవ సందర్భంగా గాంధీభవన్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతిపిత మహాత్మగాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డితో పాటు ఏఐసిసి కార్యదర్శి నదీమ్ జావిద్, చిన్నారెడ్డి, ఏఐసిసి జాతీయ అధికార ప్రతినిధి పవర్ ఖేరా, టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి, నిరంజన్, కుమార్‌రావు, మాజీ మంత్రి నాగం జనార్థన్‌రెడ్డి, చామలకిరణ్‌రెడ్డి, కోదండరెడ్డి, అనిల్ యాదవ్, శివసేనారెడ్డి, సునీతరావు, నూతి శ్రీకాంత్, సేవాదల్ ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ దళిత గిరిజన రిజర్వేషన్లు, పేదలకు విద్య, గ్రామపంచాయతీ వ్యవస్తను రాజ్యాంగం ద్వారా అమలు చేశారన్నారు. దళిత, గిరిజన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ఎంతో కృషి చేసిందన్నారు. దేశ ప్రగతికి ఎన్నో ప్రాజెక్టులు, కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కాంగ్రెస్ తీసుకుని వచ్చి విద్యాహక్కును దూరం చేస్తున్నారన్నారు.మోడి అధికారంలోకి వచ్చిన తరువాత పబ్లిక్ సెక్టార్ కంపెనీలను ప్రైవేటకు అమ్ముతున్నాన్నారు. లక్షలాది కోట్ల విలువైన ఆస్తులను చిల్లర ధరకు అమ్ముతున్నారన్నారు. రిజర్వేషన్లు పేదలకు దూరం చేసే కుట్ర జరుగుతుందన్నారు. ఈ కుట్రను తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. తొమ్మిది ప్రభుత్వాలను కూలదోసి రాజ్యాంగాని బిజెపి అపహాస్యాం చేసిందన్నారు. ఎమ్మెల్యే పార్టీ ఫిరాయిస్తే వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు. అవసరమైతే ఉరితీసే విధానాన్ని తీసుకుని రావాలన్నారు. పార్టీ ఫిరాయింపుల పట్ల కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై రాజ్యాంగ సవరణ తీసుకురావాలని, ఈ విషయాన్ని మేధావులు ఆలోచించాలన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని ప్రగతిభవన్, రాజ్‌భవన్‌కు పరిమితం చేసి ప్రజాస్వామ్యాన్ని కెసిఆర్ అపహాస్యం చేశాడన్నారు. ఏళ్లు గడుస్తున్నా అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయకపోవడం సిగ్గు చేటు అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని జరపాలని హైకోర్టు చెప్పాల్సిన పరిస్థితి దాపురించిందంట్టే సిగ్గుచేటు అని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం భేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. జనవరి 30న రాహుల్‌గాంధీ కశ్మీర్‌లో జాతీయ జెండా ఆవిష్కరించి దేశ సార్వభౌమత్వాని చాటుతారని, ఆ రోజు అన్ని మతాల ప్రార్థన మందిరాల్లో పూజలు చేయాలన్నారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమం గురువారం ప్రారంభమైనప్పటికీ ఫిబ్రవరి 6వ తేది నుంచి 60 రోజుల పాటు కొనసాగుతుందన్నారు.



గాంధీభవన్‌లో గురువారం జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం ప్రసంగిస్తున్న రేవంత్



# కెసిఆర్‌కు దేశంలో ఉండే అర్హత లేదు

## ప్రమాణం చేసిన రాజ్యాంగాన్నే అవమానిస్తావా?

## మహిళలకు బిఆర్ఎస్ ఇచ్చే గౌరవం ఇదేనా?

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** రాజ్యాంగాన్ని, న్యాయస్థానాలను, జాతీయ పతాకాన్ని అవమానిస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ దేశంలో ఉండే అర్హత లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మువ్వెన్నల పతాకాన్ని ఎగురవేసి వేడుకలను నిర్వహించారు. ఈ క్యాక్రమంలో సీనియర్ నేతలు ఇంద్రసేనారెడ్డి, తమిళనాడు సహ ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు విజయశాంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మనోహార్‌రెడ్డి, చింతల రాంచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, మాజీ ఎంపి రవీంద్రనాయక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యున్నత ప్రజాస్వామ్య దేశం గురించి ప్రస్తావిస్తే గుర్తుకు వచ్చేది భారతదేశం అన్నారు. దళిత, గిరిజన, అణగారిన వర్గాలకు సైతం ఓటు హక్కు వచ్చిందంటే అంది అంబేద్కర్ ప్రసాదించిన రాజ్యాంగం వల్లే సాధ్యమైందన్నారు. దేశాన్ని ప్రపంచంలో నెంబర్‌వన్‌గా మార్చేందుకు ప్రధాని మోడి కృషి చేస్తున్నారని, కానీ తెలంగాణలో అందుకు భిన్నంగా కనిపిస్తుందన్నారు. ముఖ్యమంత్రి కోర్టులు అంటే, రాజ్యాంగం అంటే గౌరవం లేదన్నారు. గవర్నర్, మహిళలు అంటే అసలు గౌరవం లేదన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించుకోవడానికి కోర్టుకు వెళ్లి అనుమతి తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా దేశంలో పరేడ్ నిర్వహిస్తూ ప్రజల్లో దేశభక్తిని పెంపొదిస్తే తెలంగాణలో అందుకు భిన్నంగా ఉందన్నారు. గతంలో గవర్నర్‌కు సాష్టాంగా నమస్కారం చేసిన ముఖ్యమంత్రి కెసిఆర్, ఇప్పుడు ఉన్నత చదువు చదివిన మహిళను అవమానిస్తున్నారన్నారు. చివరకు కోర్టు తీర్పులను సైతం పట్టించుకోవడం లేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ మహిళలను గౌరవించడం అంటే ఇదేనా? గణతంత్ర దినోత్సవం రోజున సిఎంకు రాజకీయాలే కావాలన్నారు. బాబాసాహెబ్ అందించిన రాజ్యాంగంతో తలెత్తుకుని సగర్వంగా బతుకుదామా? కల్వకుంట్ల రాజ్యాంగంలో తలదించుకుని బానిసలాగా ఉందామా అన్నది ప్రజలు ఆలోచించాలన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో, మోడి స్ఫూర్తితో ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణం కోసం పోరాడదామని, తెలంగాణ ప్రజలు అండగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.



## ఎఫ్‌డిసి కాంప్లెక్స్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన ఐఅండ్‌పిఆర్ డైరెక్టర్ రాజమౌళి

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం మాసాబ్‌ట్యాంక్ ఎఫ్‌డిసి కాంప్లెక్స్‌లోని సమాచార భవన్‌లో సమాచార, పౌరసంబంధాల శాఖ డైరక్టర్ రాజమౌళి జాతీయ పతాకానిన ఆవిష్కరించారు. రాజ్యాంగ స్ఫూర్తితో ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ కుర్మాచలం, అదనపు సంచాలకులు నాగయ్య, సంయుక్త సంచాలకులు జగన్, శ్రీనివాస్, సిఐఈ రాధాకిషన్‌లు పాల్గొన్నారు.

## మార్చి 13 - 15 వరకు సెట్ పరీక్షలు

### అపరాధ రుసుంతో ఫిబ్రవరి 10వరకు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** ఆ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్(సెట్) పరీక్షలను మార్చి 13 నుంచి 15 వరకు నిర్వహించనున్నారు. టీఎస్ సెట్–2022 పరీక్షకు దరఖాస్తు చేసుకోవ డానికి గడువు బుధవారం(25)తో ముగిసింది. అపరాధ రుసుంతో ఫిబ్రవరి 10 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలోనే మార్చి 13 నుంచి 15 వరకు పరీక్షలను నిర్వహించనున్నట్టు టీఎస్ సెట్ మెంబర్ సెక్రటరీ సీనియర్ ప్రొఫెసర్ సి మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. టీఎస్ సెట్ నోటిఫికేషన్‌ను గత ఏడాది డిసెంబర్ 23న జారీ చేయగా.. డిసెంబర్ 30 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. రూ. 1500 అపరాధ రుసుంతో జనవరి 30 వరకు, రూ. 2000తో ఫిబ్రవరి 5 వరకు.. రూ. 3000 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 10 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తులో తప్పులను సరిచేసుకోవడానికి ఫిబ్రవరి 12, 13 తేదిల్లో ఎడిట్ ఆప్షన్‌ను కల్పించారు. ఫిబ్రవరి చివరి వారంలో అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

## రెండేళ్లు పూర్తయినవారే బదలీలకు అర్హులు

**నేటి నుంచి బదలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం**

**వెబ్‌కౌన్సిలింగ్ ద్వారా బదలీలు..**

**మాన్యువల్‌గా పదోన్నతుల ప్రక్రియ**

**షెడ్యూల్‌ను అధికారికంగా జారీ చేసిన పాఠశాల విద్యా శాఖ**

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులే బదలీలకు అర్హులుగా ప్రభుత్వం తేల్చింది. జీరో సర్వీస్‌తో ఉపాధ్యాయులకు బదలీలు చేపట్టాలని అన్ని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ అందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదు. బదలీల్లో ప్రధానంగా ఒకే పాఠశాలలో 5 సంవత్సరాల సర్వీసు పూర్తయిన గెజిటెడ్ హెడ్మాష్టర్లకు, అలాగే ఒకే పాఠశాలలో 8 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన ఉపాధ్యాయులకు తప్పనిసరి బదలీలు ఉంటాయి. వీరు బదలీల కోసం దరఖాస్తు చేసుకోవల్సిన అవసరం లేదు.. ఖాళీలను బట్టి నేరుగా వారికి బదలీలను చేపడతారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు సంబంధించిన బదలీలు, పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియ నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌తో పాటు.. బదలీలకు సంబంధించిన మార్గదర్శకాలు వెలువడ్డాయి. బదలీలకు సంబంధించిన మార్గదర్శకాలకు విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేయగా.. వాటికి అనుగుణంగా బదలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్య డైరక్టర్ శ్రీదేవసేన జారీ చేశారు. ఉపాధ్యాయులకు సంబంధించిన బదలీలు, పదోన్నతుల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుంది. మార్చి 4తో ప్రక్రియ ముగుస్తుంది. మొత్తంగా 37 రోజులపాటు బదలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్య డైరక్టర్ బుధవారం జారీ చేశారు. నేడు(జనవరి 27న) అన్ని కేటగిరీలకు చెందిన ఖాళీలు, సీనియారిటీ లిస్టు ప్రకటిస్తారు. జనవరి 28 నుంచి 30 వరకు బదలీల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు. ఇందుకు సంబంధించిన హార్డ్ కాపీలను జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 లోపు సంబంధిత అధికారులకు సమర్పించాలి. దరఖాస్తుల హార్డ్ కాఫీలను సంబంధిత అధికారులు(ఎంఈవోలు) పరిశీలించి ఫిబ్రవరి 3 నుంచి 6 వరకు డీఈవోలకు సమర్పిస్తారు. ఫిబ్రవరి 7న డీఈవో, ఆర్‌జేడీ అధికారిక వెబ్‌సైట్లలో బదలీ పాయింట్లతో ప్రొవిజనల్ సీనియారిటీ జాబితాలను మరియు పదోన్నతుల సీనియారిటీ లిస్టును ప్రకటిస్తారు. ఫిబ్రవరి 8 నుంచి 10 వరకు ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరిస్తారు. ఫిబ్రవరి 11, 12 తేదిల్లో తుది సీనియారిటీ జాబితాలను, ప్రధానోపాధ్యాయుల బదలీలకు వెబ్ ఆప్షన్ల నమోదకు అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 13న మల్టీజోన్‌లో ప్రధానోపాధ్యాయులు వెబ్ ఆప్షన్లకు ఎడిటింగ్‌కు అవకాశం కల్పిస్తారు. ఫిబ్రవరి 14న ఆర్‌జేడీలతో ప్రధానోపాధ్యాయుల బదలీల ఉత్తర్వులు విడుదల. ఫిబ్రవరి 15న బదలీల అనంతరం మిగిలిన ఖాళీల ప్రకటన. ఫిబ్రవరి 16 నుంచి 18 వరకు అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్స్‌కు ప్రభుత్వ జిల్లాపరిషత్ యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పదోన్నతుల కౌన్సెలింగ్. ఫిబ్రవరి 19, 20 తేదిల్లో సబ్జెక్ట్ వారీగా స్కూల్ అసిస్టెంట్స్ ఖాళీల ప్రకటన మరియు బదలీ ఆప్షన్స్ నమోదు. ఫిబ్రవరి 21న ఆప్షన్ల సవరణకు అవకాశం. ఫిబ్రవరి 22, 23 తేదిల్లో డీఈవోలచే స్కూల్ అసిస్టెంట్స్ బదలీల ఉత్తర్వులు. ఫిబ్రవరి 24న స్కూల్ అసిస్టెంట్స్ బదలీల అనతరం ఏర్పడిన ఖాళీల ప్రకటన. ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు ఎస్‌జీటీ తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులకు కోర్టు కేసులు లేని సబ్జెక్టులకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 1, 2 తేదిల్లో ఎస్‌జీటీ పోస్టుల ఖాళీల ప్రకటన మరియు వెబ్ ఆప్షన్ల నమోదు. మార్చి 3న ఆప్షన్ల సవరణకు అవకాశం. మార్చి 4న ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదలీ ఉత్తర్వులు విడుదల. మార్చి 5 నుంచి 19 వరకు డీఈవో ఇచ్చిన బదలీ ఉత్తర్వులపై అప్పీల్స్, అభ్యంతరాలను ఆర్‌జేడీకి.. ఆర్‌జేడీ ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీల్స్, అభ్యంతరాలను పాఠశాల విద్య డైరక్టర్‌కు పంపుకోవడానికి అవకాశం. ఉపాధ్యాయుల నుంచి వచ్చిన అప్పీల్స్, అభ్యంతరాలను సంబంధిత అధికారులు 15 రోజుల్లోగా పరిష్కరించాల్సి ఉంటుంది. ఇలా జనవరి 27న ప్రారంభమయ్యే ఉపాధ్యాయుల బదలీలు, పదోన్నతుల ప్రక్రియ మార్చి 4తో 37 రోజులపాటు కొనసాగనుంది.

## గవర్నర్‌తో వ్యక్తిగత విభేదాలున్నా.. రాజ్యాంగ బాధ్యతను ప్రభుత్వం నిర్వహించాలి

### టిజెఎస్ అధ్యక్షుడు ప్రొ.కోదండరాం

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌కి గవర్నర్‌కు వ్యక్తిగత విభేదాలు ఉన్నప్పటికీ రాజ్యాంగ పరమైన బాధ్యతను ప్రభుత్వ నిర్వహించాలని తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గురువారం నాంపల్లిలోని తెలంగాణ జనసమితి కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోదండ రాం మాట్లాడుతూ రిపబ్లిక్ డే వేడుకలపై కోర్టు ఆర్డర్ ఇస్తే తప్ప ప్రభుత్వానికి సోయి లేదన్నారు. ఇది అత్యంత దురదృష్టకరమైన విషయం అన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ రాకుండా ప్రభుత్వం జాగ్రత్త పడాలన్నారు. రాజ్యాంగం భారతదేశ చరిత్రను తిరగరాసిందని ముఖ్యమంత్రి గ్రహించలేదన్నారు. రాజ్యాంగం సమాజంలోని ఆర్థిక, సామాజిక అసమానతలను లేకుండా చేసిందన్నారు.

## 317 జిఒ ఉపాధ్యాయుల బదలీకి జీరో సర్వీస్‌ను పరిగణించాలి

### ప్రభుత్వానికి ఎస్‌టియు టిఎస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదలీల్లో భాగంగా 317 జీవో ఉపాధ్యాయుల బదలీకి జీరో సర్వీస్‌ను పరిగణించాలని ఎస్‌టీయూ టీఎస్ డిమాండ్ చేసింది. ఉన్నపళంగా స్థానికంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను 317 జీవో పేరుతో స్థానికేతర ప్రాంతాల జిల్లాలకు కేటాయించి ఏడాది పూర్తయిందని.. వారికి న్యాయం చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోలేదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం పర్వత్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి బి భుజంగరావు అన్నారు. అలాంటి వారికి ప్రస్తుతం జరగబోతున్న బదలీల్లో వారి జీరో సర్వీస్‌ను బదలీలకు అర్హతగా పరిగణించి.. వారికి సర్వీస్ పాయింట్లను కూడా లెక్కించాలన్నారు. అలా చేసి వారికి బదలీలకు అవకాశం కల్పిస్తే వారికి కొంతనైనా న్యాయం జరిగే అవకాశం ఉంటుందని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేకపోతే వారు పదవీ విరమణ పొందాక కూడా స్థానికేతర జిల్లాకు చెందిన వారుగా మిగిలిపోతారని ఆందోళన వ్యక్తం చేశారు.

## పశుగణాభివృద్ధి సంస్థ ఎడి ఆత్మహాత్య

### అనారోగ్యమే కారణమంటూ సూసైడ్ నోట్

**నిజామాబాద్, జనవరి 26, ప్రభాతవార్త** : నిజామాబాద్ జిల్లాలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరక్టర్ శ్రీశైలం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన జిల్లాలో కలకలం సృష్టించింది. శ్రీశైలం నగరంలోని సారంగాపూర్ డెయిరీ ఫామ్ వద్ద డిస్ట్రిక్ లైవ్ స్టాక్ డెయిరీ డెవలప్‌మెంట్ వాఖ కార్యాలయంలో బలవర్మణానికి పాల్పడ్డారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాశారు. గతేడాది ఆయన వరంగల్ నుంచి నిజామాబాద్‌కు బదిలీపై వచ్చారు. బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి అందరి యోగ క్షేమాలను తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. శ్రీశైలంపై మాట్లాడిన తీరుపై అనుమానంతో కొడుకులు ఆరోగ్య సమస్యలు తగ్గిపోతాయని దిగులు పెటుకోవద్దని తండ్రికి ధైర్యం చెప్పారు. అయితే తండ్రి గతంలో ఎన్నడూ లేని విధంగా బాధాతప్త హృదయంతో మాట్లాడటంతో అనుమానం వచ్చి కుమారుడు రవితేజతో పాటు కుటుంబీకులు నిజామాబాద్‌కు బయలుదేరి వచ్చారు. కార్యాలయం తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తన చావుకు ఎవరూ కారణం కాదని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. ఎడి శ్రీశైలంకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గవర్నర్ తమిళిసైపై మండిపడిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 26:** తెలంగాణ ప్రభుత్వం పట్ల గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ తమిళిసై ప్రసంగంపై కవిత వ్యంగ్రాస్త్రాలు సంధించారు. ఈ మేరకు గవర్నర్ ప్రసంగంలోని కొంత భాగాన్ని ఆమె ట్వీటర్‌లో షేర్ చేశారు. సిఎం కెసిఆర్ విజన్‌ను ప్రతిబింబించేలా ప్రసంగించినందుకు గవర్నర్‌కు ధన్యవాదాలు అంటూ ట్వీట్ చేశారు.' సిఎం కెసిఆర్ ప్రశ్నించిన వాటినే మళ్లీ అడిగినందుకు గవర్నర్‌కు థాంక్స్, దేశంలోని మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని గతంలోనే డిమాండ్ చేశాం. కరోనా క్లిష్ట సమయంలో సెంట్రల్‌విస్టా కంటే మౌలిక సదుపాయాలు ముఖ్యమని చెప్పాం. కొందరి సంపద పెంపుపై మాత్రమే దృష్టి పెట్టొద్దని, రైతులు.కూలీలు,నిరుద్యోగులను పట్టించుకోవాలని పోరాడాం' అని కవిత ట్వీట్ చేశారు. దేశంలో భిన్నత్వాన్ని రాజ్యాంగం ప్రతిబింబిస్తోందని మరో ట్వీట్‌లో కవిత పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ప్రతీ అంశాన్ని బలపరచడం భారతీయులందరి బాధ్యద అని పేర్కొన్నారు.

# కారుణ్యామృత మాతృమూర్తి జిల్లెళ్లమూడి అమ్మ

**ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**

**శతజయంతి సందర్భంగా తపాలా శాఖ పోస్టల్ కవర్ విడుదల**

**పద్మశ్రీ డా. గరికిపాటి నరసింహారావు ప్రధాన ప్రసంగం**

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జనవరి 26 ప్రభాతవార్త :** అందరికీ అమ్మ అమ్మే, అమ్మ అమృతమూర్తి అని, అలాంటి జిల్లెళ్ళమూడి అమ్మ కారుణ్యామృత మాతృమూర్తి అని, సరస్వతి అమ్మవారి పుట్టినరోజు శ్రీపంచమి/ వసంత పంచమి రోజున యజ్ఞతుల్యమైన కార్యక్రమంలో జిల్లెళ్లమూడి అమ్మ శతజయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని అమ్మ ప్రత్యేక తపాలా కవర్‌ను విడుదల చేసుకోవడం తెలుగుజాతికంతటికి సంతోషించదగ్గ సందర్భం, ఎంతో గర్వకారణమని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. అమృతతత్వం ఉండే, మానవతాస్ఫూర్తి అయిన జిల్లెళ్ళమూరి అమ్మవారి యొక్క ప్రభావం తెలుగువాళ్లందరి మీదనే కాదు, విశ్వవ్యాప్తంగా ఆమె చాలామంది భక్తులపై కూడా ఉందని, ఆమె శతజయంతి ప్రభావం ఎలావుంటుందో తెలుపడానికి హైదరాబాద్‌లోని జాతీయ కళామందిరం రవీంద్రభారతిలో ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని తలపెట్టి నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలుపుతూ అమ్మవారి ఆశీస్సులు మనందరికీ మెండుగా దొరకాలని ఆకాంక్షించారు. శ్రీ విశ్వజనీన పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జిల్లెళ్లమూడి అమ్మ శతజయంతి వేడుకలను పురస్కరించుకొని కేంద్రప్రభుత్వ తెలంగాణ పోస్టల్ డిపార్టుమెంట్ వారి పోస్టల్ కవర్ విడుదల, జిల్లెళ్ళమూడి అమ్మ శతజయంతి సందేశ సభ ఘనంగా జరిగాయి. శ్రీవిశ్వజనీన పరిషత్ ట్రస్ట్ చైర్మన్ కె.నరసింహామూర్తి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి, విశిష్ట అతిథి-ప్రధాన వక్తగా జ్ఞాననిధి, ప్రవచన కిరీటి, మహాసహస్రావధాని, పద్మశ్రీ డా. గరికిపాటి నరసింహారావు, హైదరాబాద్ పోస్ట్‌మాస్టర్ జనరల్ పి.విద్యాసాగర్ రెడ్డి, గౌరవ అతిథులుగా పిఎంఎస్.ప్రసాద్, బ్రహ్మాండం రవీంద్రరావు, ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, సంభాసంచాలకులుగా ఎంవిఆర్.శర్మ తదితరులతో కలిసి జిల్లెళ్లమూడి అమ్మ శతజయంతి తపాలా కవర్‌ను విడుదలచేసి మొదటి కవర్‌ను మహాసహస్రావధాని డా. గరికిపాటి నరసింహారావు అందజేసి ప్రసంగించారు. ముందుగా సభకు ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి స్వాగతం పలుకగా, చివరిగా ప్రవచన కిరీటి, మహాసహస్రావధాని, పద్మశ్రీ డా. గరికిపాటి నరసింహారావు జిల్లెళ్ళమూడి అమ్మ గొప్పదనాన్ని గురించి ప్రధాన ప్రసంగం కావించారు.




జిల్లెళ్లమూడి అమ్మ శతజయంతి తపాలా కవర్‌ను విడుదల చేస్తున్న రమణాచారి, విద్యాసాగర్‌రెడ్డి, గరికపాటి నరసింహారావు, నరసింహామూర్తి తదితరులు

# కేంద్ర నిధులు మళ్లిస్తే చర్యలు తప్పవు

**ఏ స్కీం నిధులు వాటికే ఖర్చు చేయాలి**

**లేదంటే ఆర్థిక సాయం నిలుపుదల**

**రాష్ట్రాలకు స్పష్టం చేసిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ**

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార:** రాష్ట్రాల్లో ప్రజల సంక్షేమం, అభివృద్ధి, ఆర్థిక పరిస్థితుల మెరుగుదల వంటి వాటికి కేంద్రం ఇస్తున్న నిధులను ఇతర పథకాలకు మళ్లిస్తే చర్యలు తప్పవని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఏ పథకానికి నిధులు విడుదల చేస్తే ఆ పథకం అమలుకే ఖర్చు చేయాలని స్పష్టం చేసింది. వివిధ రాష్ట్రాల్లో కేంద్ర ప్రాయోజిత పథకాలు తదితర వాటికి ఇస్తున్న నిధులను కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఇతర పనులకు వినియోగిండటంతో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వాటిపై దృష్టిసారించింది. కేంద్ర మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే నిధుల విడుదలను నిలిపివేస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు తాజాగా ఆర్థిక మంత్రిత్వ శాఖ రాష్ట్రాలకు కేంద్ర నిధులపై స్పష్టత ఇచ్చింది. కేంద్ర వాటా విడుదలయిన తదుపరి రాష్ట్రాలు కూడా వాటికి సంబంధించిన వాటా నిధులను మంజూరు చేయాలని తేల్చిచెప్పింది. అంతేకాకుండా కేంద్రం ఇచ్చే నిధులను సక్రమంగా వినియోగిస్తున్నాయా లేదా అనే విషయమై ఖజానాల్లో సైతం పరిశీలించేలా చర్యలు చేపట్టింది. దీని ప్రకారం వివిధ పథకాల నిమిత్తం విడుదల చేసిన నిధులు, వాటికి రాష్ట్రాల వాటా విడుదలతో పాటు, నిధుల ఖర్చు తీరును పర్యవేక్షించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది. కాగా తెలంగాణలో అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో గత జూన్ నెలలో కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటించింది. ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ పనులకు వినియోగించాల్సిన సొమ్మును ఇతర వాటికి వాడారు. మరికొన్ని పనులు అమలు, కేటాయింపులో పలు అవకతవకలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చింది. ప్రధానంగా రైతు వేదికలతో పాటుగా, చేపలు ఎండబెట్టే ఫ్లాట్‌ఫాంలు, అడవుల్లో ట్రెంచ్‌ల తవ్వకం వంటి అనుమతి లేని ఇతర వాటికి కూడా ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించడానికి కనుగొంది. కేంద్రం విడుదల చేసే మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో పాటుగా, రాష్ట్రం వాటాగా ఇవ్వాల్సిన మెటీరియల్ కోటా నిధులన్నింటినీ రైతు వేదికలకు ఖర్చు చేసినట్లు నిర్ధారణకు వచ్చింది. దీంతో పక్కదారి పట్టించిన నిధులను తిరిగి చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం నోటీసులు పంపించింది. దారి మళ్లించిన ఉపాధి హామీ పథకానికి సంబంధించి 152 కోట్ల రూపాయలను రెండు రోజుల్లోగా చెల్లించాలని స్పష్టం చేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోయినట్లయితే గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టంలోని సెక్షన్ 27 ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఇందులో భాగంగా తదుపరి వాయిదాలను నిలిపివేస్తామని హెచ్చరించింది. అదేవిధంగా పంచాయితీల కోసం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించింది. ఈ విధంగా దాదాపు 5 వేల కోట్ల రూపాయల మేర పంచాయితీల నిధులను పక్కదారి పట్టించినట్లు విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కేంద్ర నిధుల వినియోగం జరుగుతున్న తీరుతెన్నులపై పటిష్టమైన పర్యవేక్షణ పెట్టింది. రాష్ట్రాల్లో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించింది. ప్రతీ నెలా కేంద్ర మంత్రిత్వ శాఖలు వివిధ పథకాల కోసం రాష్ట్రాలకు విడుదల చేసిన నిధులు, వాటికి రాష్ట్ర ప్రభుత్వాల వాటా సొమ్ము విడుదల, మొత్తం నిధుల వినియోగం జరిగిన తీరుతెన్నులు, మిగిలిన నిధులు వంటివాటిని ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుగా మార్పులు తెచ్చినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు.

## స్వాతంత్ర్య ఫలాలు అట్టడుగువర్గాలకు చేరాలి

### మహనీయుల బాటలో అందరం నడవాలి: టిటిడిపి చీఫ్ కాసాని జ్ఞానేశ్వర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 26:** ఎన్టీఆర్‌భవన్‌లో గురువారంనాడు 74వ గణతంత్ర దనోత్సవ కార్యక్రమాన్ని తెలంగాణ తెలుగు దేశం పార్టీ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా తెలంగాణ టిడిపి అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తర్వాత టిడిపి జెండాను ఆవిష్కరించారు. మహాత్మాగాంధీ,బిఆర్ అంబేద్కర్,ఎన్టీఆర్ చిత్రపటాలకు పుష్పాంజలి అర్పించారు. కాసాని ప్రసంగిస్తూ 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో మంది మహానుభావులు కంకణ బద్దులై దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి కృషి చేశారని తెలిపారు. నిస్వార్థంగా స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులు బాటలో మనం నడవాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలని పిలుపునిచ్చారు. పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ,తిరిగే స్వేచ్ఛ వంటి హక్కులను మహనీయుడు అంబేద్కర్ రాజ్యాంగం మనకు కల్పించిందన్నారు. భారతదేశం జనాభా చైనాను దాటినందున అదేస్థాయిలో అభివృద్ధి చెందాల్సిన అవసరముందన్నారు. ఎన్టీఆర్ రాజ్యాంగాన్ని తు.చా. తప్పకుండా ఆచరించారని, అదే బాటలను చంద్రబాబు అనుసరించారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ జాతీయ ఆదాయం పెరుగుతున్నప్పటికీ అది అందవలసిన ప్రజలకు అందడం లేదని అన్నారు. కార్యక్రమంలో అట్లూరి సుబ్బారావు, ఆజ్మీరా రాజు నాయక్ ,గడ్డి పద్మావతి, జక్కలి ఐలయ్య యాదవ్, సతీశ్‌కుమార్, కాసాని వీరేశ్, జె.ఇందిర, షకీలారెడ్డి, వెంకటరాజంగౌడ్, అశోక్‌కుమార్‌గౌడ్, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

వార్త


సముద్రతీరాన్ని దాటిపోయేవారు భిన్న ప్రదేశాలను మారుస్తారే కానీ తమ అభిప్రాయాన్ని మాత్రం మార్చుకోరు.

-హోరేస్

# స్థానిక భాషల్లోనే తీర్పులు

భారతీయ భాషల్లోనే తీర్పులను అందుబాటులో ఉంచే సేవలకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై చంద్రచూడ్ గురువారం గణతంత్ర దినోత్సవం నాడు శ్రీకారం చుట్టడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఎలక్ట్రానిక్ సుప్రీంకోర్టు రిపోర్టులు (ఈఎస్‌సీఆర్) ప్రాజెక్టు గురువారం నుండి మొదలవుతుందని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం షెడ్యూల్ భాషల్లో తీర్పుల అనువాద ప్రతులను అందుబాటులో ఉంచినట్లు ఆయన వెల్లడించారు. భారత్‌లో గుర్తించిన అన్ని ప్రాంతీయ భాషల్లోనూ సుప్రీంకోర్టు తీర్పును అనువదించే కార్యక్రమం కొనసాగుతుందని కూడా ఆయన వెల్లడించారు. ఈఎస్‌సీఆర్ ప్రాజెక్టులో భాగంగా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ప్రస్తుతం ముప్పైనాలుగువేల తీర్పులు ఉన్నాయని ఇంగ్లీష్‌తోపాటు కోరుకున్నభాషలో అనువాద ప్రతులు కూడా లభించే విధంగా ఏర్పాటు చేసినట్లు సిజెఐ వివరించారు. అంతే కాదు కక్షిదారుల సౌకర్యార్థం అనువాద ప్రతులను అప్‌లోడ్ చేసే కార్యక్రమం కొనసాగుతుందని ఆయన ప్రకటించారు. స్థానిక భాషల్లోనే దేశ సర్వోన్నతన్యాయ స్థానం తీర్పులను అందుబాటులోకి తీసుకురావడం ఎంతో మేలు జరుగుతుందనే దాంట్లో సందేహం లేదు. ప్రస్తుతం న్యాయస్థానాలు వెలువరిస్తున్న తీర్పులు అన్నీ ఇంగ్లీష్‌లోనే ఉంటున్నాయి. ఆ తీర్పులు సామాన్యులు ముఖ్యంగా గ్రామీణులకు ఏమాత్రం అర్థమయ్యే అవకాశాలు లేకుండాపోతున్నాయి. ఎక్కడ లోపం జరిగింది? తీర్పు తమకు వ్యతిరేకంగా ఎందుకు వచ్చిందో తెలుసుకో లేని అయోమయ పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో వారు మధ్యవర్తులపై ఆధారపడాల్సి వస్తున్నది. స్థానిక భాషల్లో తీర్పులు వస్తే ఒకటి, రెండుసార్లు చదివి అవగాహన చేసుకునే అవకాశం ఉంటుంది. ఇక న్యాయస్థానాల నుంచి వెలువడే తీర్పులే కాదు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సంబంధించిన కార్యక్రమాలపై జరిగే ఉత్తరప్రత్యుత్తరాలన్నీ స్థానిక భాషల్లోనే జరగాలనే నిర్ణయం ఏనాడో జరిగినా అది కాగితాలకే పరిమితమైపోయింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి 1964 మే 14న తెలుగును అధికార భాషగా గుర్తించారు. అన్ని స్థాయిల్లోనూ తెలుగు అమలుకు శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు. ఐదు దశాబ్దాలు దాటినా నేటికీ తెలుగు అధికారభాషగా అమలు కావడంలేదు. తెలుగు భాషాభివృద్ధికి ఎంతో చేస్తున్నామని మరొకపక్క గొప్పలు చెప్పుకుంటున్నారు. తెలుగు భాష అమలుకు ఎన్నో చట్టాలు కూడా చేశారు. మరెన్నో నిబంధనలు విధించారు. తెలుగు రాష్ట్రాల్లో అధికారభాషా సంఘాలను కూడా ఏర్పాటు చేశారు. ఆ సంఘాలకు నామమాత్రపు అధికారాలు తప్ప కనీసం రాష్ట్ర పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకునే అధికారాలైనా కట్టబెట్టలేదు. తెలుగు భాష అమలులో జరుగుతున్న నిర్లక్ష్యం సామాన్యులను తీవ్ర ఇక్కట్లకు గురిచేస్తున్నది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీ నిర్వహించిన సర్వేలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రంలో జరిగే ప్రతి వంద హత్యల్లో అప్పట్లో ఆరున్నర శాతం కేసుల్లోనే శిక్షపడుతున్నది. ఇందుకు ప్రధాన కారణం అభియోగపత్రం (చార్జ్‌షీట్) పకడ్బందీగా దాఖలు చేయకపోవడమే అనే వాస్తవం ఆ సర్వేలో వెలుగుచూసింది. ఆ చార్జ్‌షీట్‌లలో అనేక పొరపాట్లు జరుగుతున్నట్లు గుర్తించారు. ఇందుకు అసలైన కారణాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన, అధ్యయనం 'అప్పా' చేసింది. దాదాపు నాలుగువేల మందికిపైగా కిందిస్థాయి ఉద్యోగులను కలుసుకొని సమాచారాన్ని సేకరించారు. దాదాపు యేటా లక్షాయాభైవేలకుపైగా ఎఫ్ఐఆర్ నమోదు అవుతున్న తరుణంలో ఆంగ్లభాష అంతగా రాని టైపిస్టులతో ఆ అభియోగపత్రాలు తయారు చేయిస్తున్నారు. బాధితులు చెప్తున్న విషయాలను ఆంగ్లంలో తర్జుమా చేయడంలో ముఖ్య అంశాలను సమగ్రంగా ప్రస్తావించలేకపోతున్నారు. బాధితుల్లో తొంభైశాతంపైగా ఆంగ్ల భాష పరిజ్ఞానం లేకపోవడంతో మధ్యవర్తులపై ఆధారపడక తప్పడం లేదు. దీంతో కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారులు టైపిస్టులు కూడా హత్య కేసులకు ఒక నమూనా, అత్యాచారాలకు ఒక నమూనా, దోపిడీలకు మరో నమూనా ఇలా ఒక్కో నమూనా తయారు చేసుకొని కేసులు వచ్చినప్పుడు పేర్లు మార్చి చార్జ్‌షీట్ తయారు చేస్తున్నారే తప్ప కేసుకు సంబంధించిన అన్ని వాస్తవాలు అందులో పొందుపర్చలేకపోతున్నారు. కోర్టు ముందుకు వచ్చినప్పుడు వాస్తవంగా జరిగిన దానికి, చార్జ్‌షీట్‌లో ఉన్నదానికి తేడా ఉండడంతో బాధితులు తడబడుతున్నారు. ఫలితంగా ఎన్నో కేసులు వీగిపోయాయి. ఇది కేవలం ఇంగ్లీష్‌లో అవసరం మేరకు ప్రావీణ్యం లేకపోవడం వల్ల జరుగుతున్న నష్టం. ఇప్పుడు కంప్యూటర్లు వచ్చిన తర్వాత ఈ పేర్లు మార్చే కార్యక్రమం మరింత సులువుగా మారిపోయింది. పొరుగునున్న మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో కిందిస్థాయి అధికారులందరూ తమ ఉత్తరప్రత్యుత్తరాలను స్థానిక భాషల్లోనే జరుపుతున్నారు. ఒక్క పోలీసు శాఖకే సంబంధించి కాదు. అన్నీ ప్రభుత్వ శాఖల్లో ఇలాంటి వైఫల్యాలు కోకొల్లలు. ప్రభుత్వ శాఖలన్నింటిలోనూ తెలుగు అమలుకు చిత్తశుద్ధితో కృషిచేస్తే సామాన్యులకు ఎంతో మేలు చేసినవారు అవుతారు. ఆంగ్లమే కాదు మరో భాష నేర్చుకోవడంలో తప్పు లేదు. కానీ తెలుగుకు అన్యాయం జరగకూడదు. త్రికరణశుద్ధిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగును అమలు చేయాలి. ఆ కోణంలో రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. మాతృభాషగా విశేష స్థానం కలిగిన తెలుగును బలిపెట్టి మరో భాషకు అగ్ర తాంబూలం ఇచ్చి ప్రజలను ఇబ్బందిపాలు చేయడం మాత్రం క్షమించరాని నేరం.

స్పష్టత లేకుండా దారితప్పి మాట్లాడటం కంటే మౌనం పాటించడం ఉత్తమం.



రమణమహర్షి

దేశం కోసం తమ జీవితాలను అర్పించగల, సర్వత్యాగాలు చేయగల, సర్వసన్నద్ధులైన యువకులు నేడు కావాలి.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### అర్హులకు మాత్రమే నిరుద్యోగ భృతి

తెలంగాణలో నిరుద్యోగులకు వరంలా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల ఖాళీలభర్తీ కోసం నోటిఫికేషన్లను వరుసగా విడుదల చేస్తున్నారు.మరిన్నినోటిఫికేషన్లు రాబోతున్నాయని ప్రకటనలు వస్తున్నాయి. ఇదే సందర్భంలో నిరుద్యోగ భృతిని కూడా నిరుద్యోగ అభ్యర్థులకు వెంటనే అందించే కార్యక్రమం ప్రారంభించాలి.టీఆర్ఎస్ ప్రభుత్వంగతఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామని వాగ్దానం చేసి నాలుగేళ్లు దాటింది. నిరుద్యోగులు భృతి కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారు. మరో పదినెలల్లో తెలంగాణలో శాసనసభ ఎన్నికలు జరగబోతున్నాయి. ఇకనైనా లక్షలాదిమంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్న భృతి అందించి వారినిఆర్థికంగా ఆదుకోవాలి. చాలా మంది నిరుద్యోగులుఅరకొర వేతనాలతో ప్రైవేట్‌విద్యాసంస్థల్లో పనిచేస్తున్నారు. కనుక ప్రస్తుతం ఉద్యోగాల ప్రకటనల రాత పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను మాత్రమే నిరుద్యోగ భృతికి అర్హులుగా నిర్ణయించి అమలు చేయాలి.

-జి.అశోక్, గోదూరు, జగిత్యాల

### సెల్‌ఫోన్‌తో ప్రమాదాలు

రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కాలంలో జరుగుతూ ఉన్న అనేక రోడ్డు ప్రమాదాలకు కారణం అధికంగా సెల్‌ఫోన్ వాడుతూ వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణాలుగా సర్వేలు చెబుతున్నాయి. సంబంధిత అధికారులు పెనాల్టీలు విధించకపోవడ, ట్రాఫికు సిగ్నల్ వద్ద కూడా ఫోన్ మాట్లాడినా జరిమాన విధించకపోవడం అలాగే రోడ్ల మీదనడిచే పాదచారులు కూడా సెల్ మాట్లాడుతూ కూడా ప్రమాదాలకు గురవుతూ ఉన్నారు. అధికారులు స్పందించి సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారి మీద చర్యలు తీసుకోవాలి.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### ఆస్పత్రుల నిర్వహణలో లోపాలు

ప్రభుత్వాలు మారినా, పథకాలు మారినా ప్రభుత్వ ఆస్పత్రుల తీరు మారడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత, మందుల కొరత, వైద్యపరికరాల కొరత, వైద్యుల్లో సమయ పాలన లేకపోవడంతో సర్కారీ ఆస్పత్రులనే నమ్ముకున్న పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు ప్రభుత్వ వైద్యం అందక ప్రైవేట్ చికిత్స చేసుకునే ఆర్థికస్తోమత లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇతర దేశాలు అవలంబిస్తున్న విధానాలపై అధ్యయనం చేసి ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణపై ఒక ప్రత్యేక విధానం తీసుకు రావాలి.

-ఎస్. రామారావు, శ్రీకాకుళం జిల్లా

### పకడ్బందీగా టీచర్ల పదోన్నతులు

తెలంగాణ ప్రభుత్వం ఏడున్నర ఏళ్ల తర్వాతనైనా టీచర్ల పదోన్నతులు చేపట్టడంసంతోషం. ఈసారి ప్రభుత్వంటీచర్ల పదోన్నతులను ఎలాంటి అవకతవకలు జరగకుండా పక్కాగా నిబంధనలురూపొందించి అమలు చేయాలి. ఇంతకుముందు ఎవరైతే ప్రమోషన్‌ను నిరాకరించారోవారిని ప్రమోషన్‌ల జాబితా నుంచి తొలగించాలి. గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పోస్టుల సీనియారిటీ జాబితాను మార్కులు,ర్యాంకులు కాకుండా జాయినింగ్ తేదీని ప్రామాణికంగా తీసుకొని రూపొందిస్తున్నారు. ఇది అశాస్త్రీయమే కాక ప్రతిభగల ఉపాధ్యాయులకు ప్రమోషన్‌ను నిరాకరించడమే అవుతుంది. ప్రభుత్వం నిర్దేశించిన గడవులో చేరిన డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ స్కూల్ అసిస్టెంట్‌లందరినీ మార్కులు, ర్యాంకులు, పుట్టినతేదీ, జాయినింగ్ తేదీ వీటి ప్రాధాన్యత క్రమంలో సీనియారిటీ జాబితాలు రూపొందించాలి. అప్పుడు అందరికీ న్యాయం జరుగుతుంది.

-శాగ శ్రీనివాస్, చిన్నపెండ్యాల, జనగామజిల్లా

### భారీ ప్రకటనలు అవసరమా?

రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖలో ఖాళీలభర్తీ వివరాలతో రాష్ట్ర ప్రభుత్వం దినపత్రికల్లో ఓ భారీ ప్రకటన ఇచ్చారు. ఇందుకో కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు అవుతుంది.ఇలా అనవసర ప్రకటనలకు గతమూడు సంవత్సరాల్లో వందల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టారు! అదే విషయం సమాచార శాఖ ద్వారా ప్రసార మాధ్యమాల తెలియపరిస్తే వాళ్లే వార్త రూపంలో ప్రచురిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ నిత్య ప్రక్రియ. అందుకు ప్రత్యేకంగా కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ప్రకటనలు ఇవ్వడం సమంజసం కాదు. వైద్యఆరోగ్యశాఖల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదు. ఆ వివరాలు మాత్రం గోప్యంగా ఉంచుతారు? మరి ఆ కుటుంబాలు ఎలా బతకాలి? ఇలా వృధాగా ఖర్చుపెట్టే డబ్బు వారి వేతనాల చెల్లింపులకు వినియోగించవచ్చు కదా?

-జి.రామకృష్ణ, కృష్ణాజిల్లా

### కాలుష్యాన్ని అరికట్టాలి

తీర ప్రాంతాల్లో ఇష్టానుసారం ఏర్పాటు చేస్తున్న పలు ఫార్మా కంపెనీలు రసాయన వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెడుతుండడం వల్ల మత్స్య సంపద నశించిపోతుంది. పట్టణాల్లో చెత్తాచెదారాన్ని,ప్లాస్టిక్ వ్యర్థాలను టన్నుల కొద్దీ ట్రాక్టర్ల ద్వారా తెచ్చి నిత్యం సముద్రాలలో పడివేయడంతో సముద్రజలాలు కాలుష్యం అవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సముద్రజలాల కాలుష్యం అరికట్టాలి.

-ఎన్.శివరాం, నెల్లూరు

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# వర్గ సిద్ధాంతం..కృష్ణార్పణం!

సమకాలీన జ్ఞానం సృజన, ఆవిష్కరణ గుణం,సానుకూల దృక్పథం, ఇవికదా ప్రజల జీవితాల్లో ఇప్పుడు విప్లవాన్ని తీసుకొస్తోంది?ఈ యుగ లక్షణాన్ని విస్మరించి, ఇది విప్లవాల యుగం,ఆయుధంగా విప్లవిస్తే విజయం మనదే అని ఊదరగొట్టడంలో అర్థమేమైన కనిపిస్తోందా? నిజంగా ప్రజల్ని ప్రేమించే, వారి పురోభివృద్ధిని ఆకాంక్షించే వారెవరైనా ఈ విషయాన్ని పట్టించుకుని తమతమ పరిధిలో సరైన మార్గదర్శనం చేసినప్పుడే ప్రజల్లో చైతన్యం మరింత వికసిస్తుంది. కొత్తతరాలు భ్రమల నుంచి బయటపడతాయి. అలా బయటపడిన నవతరం హైదరాబాద్ హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ తదితర ప్రాంతంలో దర్శనమిస్తోంది. అసలు ఈ ప్రాంతమంతా ఇప్పుడు అగ్రరాజ్యం అమెరికాను తలదన్నేలా కనిపిస్తుంది. అంతర్జాతీయ ఐటి కంపెనీలు తమ క్యాంపస్‌లు ఏర్పాటు చేసుకుని కొత్త పని సంస్కృతిని, సాంకేతికతను విస్తరిస్తున్నాయి. అటు బెంగళూరులోనూ దాదాపు ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో 'వర్గ సిద్ధాంతం' వాసనలు కనిపిస్తున్నాయా? సాంకేతిక సృజన శీలురు, సరికొత్త కలలతో కొత్త ప్రపంచంలో విహరించేవారే కనిపిస్తారు.



వుప్పల నరసింహం
సీనియర్ జర్నలిస్టు

ప్రపంచ ఆర్థిక వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రీయల్ రెవల్యూషన్ కేంద్రంఏర్పాటు చేయనున్నారు. ఆ వేదిక ఎండి జెర్గన్స్, తెలంగాణ జీవశాస్త్రాల శాఖ డైరెక్టర్ శక్తినాగప్ప ఇటీవల దావోస్‌లో తెలంగాణ ఐటి- పరిశ్రమల శాఖమంత్రి కెటిఆర్ సమక్షంలో ఈ మేరకు ఒక ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇలాంటి కేంద్రాలు ఇప్పటికే ప్రపంచంలో 17చోట్ల పనిచేస్తున్నాయి. ఆరోగ్య పరిరక్షణపై జీవశాస్త్రాల అధ్యయనాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆసరాతో పరిశోధనలు చేస్తున్నాయి. హైదరాబాద్‌లోని జినోమ్ వ్యాలీలో ఈ కేంద్రం అధ్యయనం-పరిశోధన శ్వాసగా పనిచేయనున్నది. ఇటు ఐటిరంగం, లాజిస్టిక్స్, అటు ఫార్మా రంగంలోనూ పెద్దఎత్తున పెట్టుబడుల వరద హైదరాబాద్‌ను ముంచెత్తుతోంది. దేశీయ-విదేశీ పెట్టుబడులు భారీ ఎత్తున రావడమంటే అది ఆర్థిక ప్రగతికి చిహ్నమని అందరికి తెలుసు. సరికొత్త టెక్నాలజీతో, కృత్రిమ మేథ ఆసరాతో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్న వర్తమానంలో మరోవైపు మావోయిస్టులు కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ మావోయిస్టు పార్టీస్ అండ్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ సౌత్ ఏసియా (కంపోసా)ను మళ్లీ తెరమీదకు తెచ్చారు. ఈసారి అమృత్ అనే కామ్రేడ్ పార్టీ తరపున సమన్వయ కర్తగా ఉంటారని కొంతకాలం క్రితం ఆ పార్టీ ప్రకటించింది. గతంలో ఈ పాత్రను కొంతకాలం కోబడ్‌గాంధీ, చెరుకూరి రాజకుమార్ అలియాస్ ఆజాద్, ముప్పాల లక్ష్మణరావు తదితరులు నిర్వహించారు. తాజాగా అమృత్ (అజ్ఞాత వ్యక్తి) రంగంలోకి వచ్చారు. ఒకప్పుడు ఫిలిప్పీన్స్, నేపాల్, మలేషియా మరికొన్ని దేశాల్లో మావోయిస్టులు క్రియాశీలంగా ఉన్నప్పుడు పరస్పర సహాయ-సహకారం సంఘీభావం కోసం ఈ వేదికకు శ్రీకారం చుట్టినా ఆశించినంత ఫలితమేమీ కనిపించలేదు. పొరుగున ఉన్న నేపాల్‌లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రచండ మావో మార్గం వీడి అధికార పీఠమెక్కారు. ఫిలిప్పీన్స్‌లో బలమైన నాయకుడిగా గుర్తింపు పొందిన జోస్ మేరియా సిసాన్ ఇటీవల మరణించాడు. అక్కడి పీపుల్స్ ఆర్మీ పూర్తిగా పలచబడింది. కాంబోడియా, కొలంబియా సంగతి సరేసరి. లాటిన్ అమెరికా, ఆగ్నేయాసియా ఎటుచూసినా మావోవాదులు పూర్తిగా చతికిలబడ్డారు. చేతులెత్తేశారు. ఆ దృశ్యం స్పష్టాతిస్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిస్థితుల్ని సిద్ధాంత మత్తులో పడి అంచనా వేయడంలో మావోయిస్టులు పూర్తిగా విఫలమయ్యారు. వారి వ్యూహం, ఎత్తుగడలు ఈ విషయాన్ని తెలియచేస్తోంది. ఇప్పటికీ పాత పారిభాషిక పదాలు (జార్గాన్) విశ్లేషణలు వారు వినిపించడం విడ్డూరం. నలభై ఏళ్లకుముందే కమ్యూనిస్టు చైనాలో అనూహ్యమైన మార్పుల్ని అప్పటి నాయకుడు డెంగ్ జియావో పింగ్ ప్రవేశపెట్టాక ఆర్థిక సంస్కరణలు





పెద్ద ఎత్తు చేపట్టాక, మరోపక్క సోవియట్ యూనియన్ కుప్పకూలినాక, భారత మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో మూడు దశాబ్దాల క్రితమే ఆర్థికసరళీకరణ, సంస్కరణలు ప్రారంభమయ్యాక, ఆ ఒరవడి బలంగా కొనసాగుతున్న నేపథ్యంలో మావో కాలం నాటి విశ్లేషణలు, సూక్తులు, సిద్ధాంతాలు, ఎత్తుగడలు ఎలా చెల్లుబాటవుతాయి? అన్న ప్రశ్న వేసుకోకుండానే భారత మావోయిస్టులు ఇంకా కంపోసా' పునరుద్ధరణ గూర్చి కలలుగనడం అందుకోసం అమృత్ పేరును ప్రకటించడం పసలేని వ్యవహారం తప్ప మరొకటి కాదు. ఒకప్పుడు 'కంపోసా'లో నామమాత్రంగానైనా ఉన్న పార్టీల సంస్థల,వ్యక్తుల ఇప్పుడున్న పరిస్థితి ఏమిటి? వారి దేశాలు ఆర్థిక సంక్షోభాలు, సమస్యలు సుడిగుండాల్లో చిక్కుకుని సతమతమవుతుంటే వీరెలా విప్లవశక్తులకు ఊపిరి లూదుతారు? ఇలాంటి ప్రయోగాలు గతంలో ఎన్నో జరిగినా అవి గొప్ప ఫలితాలనివ్వలేదు. మఖలో పుట్టి పుబ్బలో మాడిన చందంగానే అయ్యాయి. కాలయాప, ఉన్నకొద్దిపాటి వనరులు, శక్తి సామర్థ్యాలు నిర్వీర్యం కావడం తప్ప ఒరిగిందేమీలేదు. ఇది నగ్నసత్యం. అయినా ఇంకా ఇంకా ప్రయోగాలు చేస్తామంటే అదెలా ప్రజానుకూల ప్రయత్నమవుతుందని తమని తాము మావోలు ప్రశ్నించుకోవలసిన సందర్భమిది. ఇది బహుళ ధృవ ప్రపంచం. గతంలో మాదిరి ఏకధృవ ప్రపంచ కాన్సెప్ట్ కనుమరుగైంది. దాంతో ఇప్పుడు శత్రువు ఎవరో తేల్చుకోలేని, పోల్చుకోలేని పరిస్థితితో సాయుధ పోరాటం,గెరిల్లాదండు, లాంగ్‌మార్చ్, విముక్తి ప్రాంతాల ఏర్పాటు అన్న వ్యూహం, ఎత్తుగడ నిరర్థకం. ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్న సందర్భంలో అలాంటి ఆలోచనలు పూర్తిగా అపరిపక్వమైనవి. నాల్గవ పారిశ్రామిక విప్లవ ఫలితాలు శిఖరాయమానంగా ప్రపంచ ప్రజలకు సామాన్యులకు అందుతున్న విషయం కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నా ఇంకా ఇది అర్థవలస, అర్థ భూస్వామ్య, సామ్రాజ్యవాద ధోరణిగల దేశమని విశ్లేషించి, వాస్తవ దూరమైన అంశాలను ప్రజల ముందుపెడితే దానివల్ల జన చైతన్యం వెల్లివిరుస్తోందా? సమకాలీన జ్ఞానం వికసిస్తోందా? సాధికారత దిశగా అడుగులు పడుతున్నాయా? గొప్ప కాంతి పుంజం ఏదైనా దారి చూపుతుందా? లేదు. కళ్లెదుటి జీవనానికి, సిద్ధాంత కళ్లద్దాంతాలతో మావోలు చెబుతున్న దానికి పొంతన కుదరక ప్రజలు, కార్యకర్తలు, సానుభూతిపరులు గందరగోళపడుతున్నారు తప్ప అద్భుతమేదీ చోటు చేసుకోవడం లేదు. సమకాలీన జ్ఞానం సృజన, ఆవిష్కరణ గుణం,సానుకూల దృక్పథం, ఇవికదా ప్రజల జీవితాల్లో ఇప్పుడు విప్లవాన్ని తీసుకొస్తోంది?ఈ యుగ లక్షణాన్ని విస్మరించి, ఇది విప్లవాల యుగం,ఆయుధంగా విప్లవిస్తే విజయం మనదే అని ఊదరగొట్టడంలో అర్థమేమైన కనిపిస్తోందా? నిజంగా ప్రజల్ని ప్రేమించే, వారి పురోభివృద్ధిని ఆకాంక్షించే వారెవరైనా ఈ విషయాన్ని పట్టించుకుని తమతమ పరిధిలో సరైన మార్గదర్శనం చేసినప్పుడే ప్రజల్లో చైతన్యం మరింత వికసిస్తుంది. కొత్తతరాలు భ్రమల నుంచి బయటపడతాయి. అలా బయటపడిన నవతరం హైదరాబాద్ హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ తదితర ప్రాంతంలో దర్శనమిస్తోంది. అసలు ఈ ప్రాంతమంతా ఇప్పుడు అగ్రరాజ్యం అమెరికాను తలదన్నేలా కనిపిస్తుంది. అంతర్జాతీయ ఐటి కంపెనీలు తమ క్యాంపస్‌లు ఏర్పాటు చేసుకుని కొత్త పని సంస్కృతిని, సాంకేతికతను విస్తరిస్తున్నాయి. అటు బెంగళూరులోనూ దాదాపు ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో 'వర్గ సిద్ధాంతం' వాసనలు కనిపిస్తున్నాయా? సాంకేతిక సృజన శీలురు, సరికొత్త కలలతో కొత్త ప్రపంచంలో విహరించేవారే కనిపిస్తారు. వర్గసిద్ధాంతం అంతటా లుప్తమైన వైనం స్పష్టంగా అగుపిస్తోంది. కర్ణాటక నుంచి తెలంగాణలోకి ప్రవేశించే కృష్ణానదిలో ఆ సిద్ధాంత వాసనలు కొట్టుకుపోయాయి. కృష్ణార్పణం. ●

# ఎన్నికల చుట్టూ పార్టీల కూటములు!

బొల్లిముంత సాంబశివరావు

సాధారణ ఎన్నికలకు ఇంకా 15 నెలలు ఉండగానే పాలక రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల ఎత్తుగడలు, కలసివచ్చే పార్టీలతో కూటమి ఏర్పాటు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. పరస్పర విమర్శలు, వాదోపవాదాలు కొనసాగిస్తున్నాయి. జాతీయ స్థాయిలో,రాష్ట్రాల స్థాయిలో కూటముల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే ఎన్డీయే కూటమి, యూపిఏ కూటములు ఉండగా వీటికి వ్యతిరేకంగా కెసిఆర్,కేజ్రీవాల్, అఖిలేష్ యాదవ్‌లు కలిసి కూటమి ఏర్పాటు ప్రయత్నాలు తీవ్రతరం చేస్తున్నారు.సిపిఐ, సిపిఐ(యం) పార్టీలు ఇందులో చేరేందుకు సిద్ధమవుతూ, మరోవైపు యూపిఏ భాగస్వామ్య ప్రాంతీయ పార్టీలైన డియంకె, ఆర్‌జెడి, పార్టీలతో ఎన్నికల పొత్తులో కొనసాగుతున్నాయి. ఈ పార్టీల కూటముల రాజకీయ లక్ష్యంఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రావడం. అందుకు ఎన్‌డిఏ, యూనిఏ కూటములను ఓడించడం. అంటే అధికారమే వీరి ప్రధానలక్ష్యం. ఆర్థిక విధానాల అమలు గురించి సామ్రాజ్యవాదం, బడా పెట్టుబడిదారుల బహుళజాతి సంస్థల దోపిడీ గురించి దేశ వనరుల వినియోగం గురించి భూసంస్కరణల,పారిశ్రామిక విధానం గురించి ఈ పార్టీలకు ఒకే విధానం ఉంది. ఆచరణలో ఈ పార్టీలన్నీ సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల, భూస్వాముల అనుకూల విధానాలనే అనుసరిస్తున్నాయి. మోడీకి వ్యతిరేకంగా జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రస్థాయిలో ప్రాంతీయ పార్టీలై డిఎంకె, టియంసి. సమాజ్‌వాది, ఆర్‌జెడి తదితర పార్టీలు మోడీ విధానాలను వ్యతిరేకిస్తున్నాయి. రాష్ట్రాల హక్కులు హరించబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలైన ఆమ్‌ఆద్మీ, టి.ఆర్.ఎస్ పార్టీ ఇప్పుడు జాతీయ పార్టీలుగా పరిణామం చెందాయి. ఈ పార్టీలు రాష్ట్రంపై కేంద్రం పెత్తనాన్ని వ్యతిరేకిస్తున్నాయి. కెసిఆర్ నాయకత్వాన బిఆర్‌ఎస్‌పార్టీ రాజ్యాంగాన్ని తిరిగిరాయాలంటున్నది. పరిపాలనా విధానంలో మాత్రం ఈ పార్టీలన్నీ ప్రజావ్యతిరేక విధానాలే అనుసరిస్తున్నాయి. మోడీ విధానాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ జోడోయాత్ర ప్రారంభించారు. మోడీ విధానాలపై విమర్శలు గుప్పిస్తున్నారు.మోడీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలని పిలుపు ఇస్తున్నారు. రాహుల్‌గాంధీ ఈ సందర్భంగా ఒక ప్రశ్నకు సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ నాయకత్వాన ఉన్న యూపిఏ ప్రభుత్వం, మతాలను, కులాలను ఉపయోగించలేదా, ప్రజా ఉద్యమాలను, గిరిజన ఉద్యమాలను రక్తపుటేర్లలో ముంచలేదా? ఉద్యమకారులను నిర్బంధించే ప్రమాదకర చట్టాలు చేయలేదా? రాష్ట్రాలకు ఉన్న హక్కులను హరించే విధానాలు అమలు జరపలేదా? కాంగ్రెస్ పాలనలోనే బాబ్రీమసీద్ కూల్చివేయబడలేదా? ప్రభుత్వరంగ సంస్థల్లోకి ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానించలేదా? బహుళజాతి సంస్థలకు ద్వారాలు బార్లా తెరవలేదా?ప్రపంచ బ్యాంక్, ఐయంఎఫ్ విధానాలను అమలు జరపలేదా? సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు కాపాడలేదా? కాంగ్రెస్ అనుసరించిన విధానాలనే మోడీ ప్రభుత్వం మరింతదూకుడుగా అమలు జరుపుతున్నది. అందువలన రాహుల్‌గాంధీ జోడో యాత్ర ప్రజల ప్రయోజనాల కోసం కాదు, యూపిఏ కూటమిని తిరిగి అధికారంలోకి తీసుకురావడం కోసమే. బిజెపిని వ్యతిరేకించే అన్నిపార్టీల లక్ష్యం ఎన్డీయే కూటమిని రానున్న ఎన్నికల్లో ఓడించి, మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించడమైనప్పుడు ఈ పార్టీలన్నీ కలిసి ఎందుకు ఐక్యంగా కార్యాచరణ చేయడం లేదు. కాంగ్రెస్ పార్టీతో ఫ్రంట్ కట్టమని, దాన్ని ఓడిస్తామని బిఆర్‌ఎస్, ఆమ్‌ఆద్మీ, సమాజ్‌వాది పార్టీలు ఎందుకు చెబుతున్నాయి. మోడీ ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకే బిఆర్‌ఎస్ ఏర్పాటయిందని ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రచారం చేస్తున్నారు. ఆయన విధానాలు, మోడీ విధానాలకు భిన్నంగా ఉన్నాయా? ఈ అధికార కూటముల్లో సిపిఐ, సిపిఐ(యం) పార్టీలది విచిత్రమైన విధానం.జాతీయ స్థాయిలో ఎన్డీయేకు వ్యతిరేకంగా ఏర్పడే కూటమిలో కాంగ్రెస్ ఉండాలని సిపిఐ అంటుంది. రాహుల్ జోడోయాత్రకు మద్దతు తెలిపి ముగింపు సభలో పాల్గొంటున్నది. మరొకపక్క కాంగ్రెస్‌ను వ్యతిరేకించే బిఆర్‌యస్, ఆమ్‌ఆద్మీ, సమాజ్‌వాది పార్టీలతో కూటమి అంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీకి వ్యతిరేకంగా తాము వ్యతిరేకించే బిజెపితోపొత్తు కోసం ఆరాటపడుతున్న టిడిపి,జనసేనతో ఎన్నికల పొత్తుకు సిద్ధమైయ్యాయి. దీన్ని అవకాశవాద రాజకీయమనరా! దేశంలో ఇందిరాగాంధీ సంస్కరణలను సమర్థించడం, ఆంధ్రప్రదేశ్ 1985 టిడిపితో పొత్తు, ఇతర రాష్ట్రాల్లో పొత్తుల వలన సిపిఐ, సిపిఐయం పార్టీలు తమ శ్రేణులను ఎలా కోల్పోయి బలహీనపడింది, పేదలు పార్టీకి దూరమై పాలక పార్టీలవైపు వెళ్లింది చూశాం. అదే తప్పిదాన్ని నేడు కొనసాగిస్తున్నాయి. విశాల ప్రజా ఉద్యమ నిర్మాణం కోసం విప్లవ కమ్యూనిస్టు పార్టీలతో సిపిఐ, సిపిఎం పార్టీలు ముందుకు రావాలి. ●



# రైతు రాజ్యం బిఆర్‌ఎస్‌తో సాధ్యమేనా?

మోటె చిరంజీవి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న మాటను నిజం చేస్తూ తెలంగాణ ఉద్యమాన్ని భుజాలు ఎత్తుకొని తెలంగాణ స్వరాష్ట్రం సాధించిన తర్వాత 9ఏళ్ల పాలనలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ,సబ్బండ వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న టిఆర్‌ఎస్ పార్టీ బిఆర్‌ఎస్ పార్టీగా అవతరించి ఖమ్మంలో అనుకున్న దానికంటే ఎక్కువ మందితో సభ నిర్వహించి, దేశంలో అధికారంలోకి వస్తే ఏమి చేస్తాం అన్న భావనను దేశ ప్రజలందరికీ తెలిసేలా, దేశం గర్వించేలా చేశారు ముఖ్యమంత్రి కెసిఆర్. బిఆర్‌ఎస్ పార్టీ ఏకైక అజెండా సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం చేయడం కోసం ముందుకువస్తుంది అనే విషయాన్ని చెప్పకనేచెప్పారు. 'అప్ కి బార్ కిసాన్ సర్కార్' అనే రణ నినాదంతో కేంద్రంలో ఉన్న అధికార పార్టీపై కోరుకు శంఖారావడం పూరించారు.రైతును రాజు చేయాలన్న సంకల్పంతో, అనేక సంక్షేమ పథకాలను రైతుబంధు, రైతుబీమా వంటి అత్యద్భుతమైన పథకాలను ప్రవేశపెట్టి, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తూ, వాటిని దేశంలో అమలు చేయాలని, కేంద్రం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండకట్టి, రైతులకు, రైతుకుటుంబాలకు ఆపన్నహస్తం అందించారు. రైతు కేంద్రంగా అనేక చారిత్రక ఉద్యమాలు జరిగాయి. ఆంగ్లేయుల పాలనలోనే దేశంలో భూసంస్కరణల కోసం రైతులు ఉద్యమించారు. సిస్తులు చెల్లించని రైతుల నుంచి భూములను లాక్కున్న బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నినాదించారు. దున్నే వాడిదే భూమి అనే నినాదంతో రైతన్నలు 1768 నుంచి 1800 వరకు ఆంగ్లేయులతో పోరాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జై జవాన్, జైకిసాన్ లాంటి ఎన్నో నినాదాలు రాజకీయాల్లో రైతుల ప్రాధాన్యాన్ని చాటిచెప్పాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ విధానాలకు వ్యతిరేకంగా 1994లో దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు సాగాయి. అప్పటి నాయకులు నిరంతరం రైతు సమస్యలను పరిష్కరించడం కోసం అనేక రైతు ఉద్యమాలు చేశారు. మాజీ ఉప ప్రధాని దేవీలాల్ 60వేల కోట్ల పంట రుణాలను రద్దు చేయించడం జరిగింది. మొన్నటికి మొన్న ఇప్పుడున్న కేంద్రప్రభుత్వంపైన కేంద్రం తీసుకువచ్చిన వ్యవసాయ వ్యతిరేక చట్టాలను తొలగించడం కోసం రాకేష్ టికాయత్ లాంటి వారు, అనేక మంది రైతులను కలుపుకొని దేశ రాజధానిని వేదికగా చేసుకొని ఉద్యమాలు చేసి, అనేక పార్టీల మద్దతును కూడగట్టి, చట్టాలను తొలగించడం కోసం కేంద్రం వెనక్కి తీసుకునేలా చేసి విజయం సాధించాడు. అందులో కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారికి మద్దతు తెలిపింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తొమ్మిదేళ్ల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయి.ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు సంవత్సరానికి



ఒక్కపంటే తీసేవారు. కానీ ప్రాజెక్టులు నిర్మించి, భూగర్భజలాలు పెంచి సంవత్సరానికి మూడ పంటలు తీస్తున్నారు రైతులు. దిగుబడి పెరిగింది, రాబడి పెరిగింది. తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతుబంధు, రైతుబీమా,సబ్సిడీ ద్వారా అందించేటువంటి వివిధ రకాల పనిముట్లు, విత్తనాలు, మొక్కలు ఇలా చాలా రకాలుగా ఇస్తున్న ప్రభుత్వం గొప్పదని కితాబునిస్తున్నారు. అసలైన రైతు రాజ్యం తెలంగాణలో ఉందని అన్ని రాష్ట్రాల రైతులు చూస్తున్నారు. కారణం ఇక్కడ రైతే రాజు, రైతు సంక్షేమ ప్రభుత్వమే నడుస్తుంది. ఏటా కొన్ని వేలకోట్ల ఖర్చుతో వ్యవసాయ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, రైతు బాగుకోసం పరితపిస్తుంది బిఆర్‌ఎస్ ప్రభుత్వం. రాష్ట్రం ఏర్పడగానే రైతు సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయరంగంపైన దృష్టి కేంద్రీకరించిన ముఖ్యమంత్రి ఆలోచన దృక్పథంతో విద్యుత్ నుంచి సాగునీటి వరకు ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ సాధ్యంకానీ రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టు, ఎరువులు, విత్తనాల సరఫరా, రైతువేదికలు, కల్లాలు, చేపల పంపిణీ, గొర్రెల పంపిణీ, ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి రైతుల కళ్లల్లో ఆనందాన్ని నింపుతున్నారు. రైతుల కోసం ఇన్పుట్ సబ్సిడీతోపాటు, డ్రిప్పు పథకానికి సబ్సిడీ ఇస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారు. ఒకప్పుడు పంట పొలాల దగ్గరికి రైతులు వెళ్లి నీళ్లు కట్టాలంటే కరెంటు ఎప్పుడు పోతుందో తెలియదు. ఎప్పుడొస్తుందో తెలియదు.రాత్రిపూట బాయిల దగ్గరికి, పొలాల దగ్గరికి పోయిన రైతుకు కరెంటు కష్టాలు, దారినపోతుంటే ఏమైతదో తెలియదు. ఇంటికి క్షేమంగా వస్తాడో రాడో తెలియదు. మరి ఇప్పుడు 24గంటల కరెంట్‌తో, రోజు మొత్తంలో ఎప్పుడైనా బాయికాడికి పోయి నీళ్లు కట్టుకునే పరిస్థితి. బోర్లు ఎండిపోయి బీడుపడ్డ పొలాలు, నెర్రలు బారిన పొలాలు, ఇదివరకు కనబడేవి. ఇప్పుడు ఎటు చూసినా పచ్చటి తివాచీ పరిచినట్టు తెలంగాణ నేల కనబడుతుంది. కులవృత్తులు వారిని ప్రోత్సహించేందుకుగాను శ్వేతవిప్లవం, నీలి విప్లవంతో వినూత్న మార్పులు వచ్చాయి. మాంసాన్ని ఉత్పత్తి చేయడానికి కోళ్లపెంపకం, గొర్రెల,మేకల పెంపకాన్ని సైతం ప్రోత్సహిస్తుంది. వ్యవసాయం అంటే పంటలు పండించడమే కాకుండా, పెంపుడు జంతువుల పెంపకంతో పాటు ఆర్థికంగా ఎదగడానికి, అనేక నూతన సంస్కరణలు చేసి అన్ని రకాలుగా తోడ్పాటును అందిస్తున్నారు. అన్నదాతకు ఆసరాగా అన్నితానై పెట్టుబడి సహాయం నుంచి మొదలుకొని, పంట పెట్టడం కోసం విత్తనాలు ఇచ్చి, తక్కువ ధరలో ఎరువులు ఇచ్చి, పంట చేతికి వచ్చినాక రైతు వేదికల ద్వారా, ఐకెపిల ద్వారా పంటలను కొనుగోలు చేస్తూ రైతులకు బంధువు ఆసరా అవుతూ రైతుల కోసమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉందన్న మనోధైర్యాన్ని రైతు గుండెల్లో నింపింది ప్రభుత్వం. ●

# ఈరోడ్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థికి కమల్ మద్దతు



**చెన్నై, జనవరి 26:** వచ్చే నెల 27న తమిళనాడులోని ఈరోడ్ తూర్పు నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికలో డిఎంకెసారథ్యంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ అభ్యర్థిగా కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి ఇవికెఎస్ ఇళంగోవన్ బరిలోకి దిగారు. మక్కల్ నీది మయ్యం చీఫ్ కమలహాసన్ ఆయనకు బేషరతు మద్దతు ప్రకటించారు. ఇళంగోవన్ తనయుడు ఎవెరా తిరుమహాన్ మరణంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికల బరిలోకి దిగుతున్న ఇళంగోవన్ ఇటీవల కమల్‌ను కలిసి మద్దతు కోరారు.

# ప్రపంచదేశాల్లో పెరుగుతున్న మహమ్మారి ప్రభావం

## 67.41కోట్లకు పెరిగిన కేసులు - 67.52 లక్షలకు చేరుకున్న మృతులు

**జెనీవా, జనవరి 26:** ప్రపంచదేశాల్లో కరోనా కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఒక్కరోజులోనే 1.26 లక్షలకు పైగా కొత్తగా కరోనాబారిన పడినట్లు తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా చిన్న దేశాల్లోనే ఈ తాకిడి మరింత ఎక్కువగా ఉంది. గురువారం నాటికి ప్రపంచదేశాల్లో 67.41 కోట్లమందికి కరోనాసోకి 67.52 లక్షలమందిచనిపోయారు. మరో 43,755 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలో 64.61 కోట్లమందికిపైగా నమోదు కాగా మరో 2.12 కోట్లమంది ఇప్పటికీ మృత్యువుతో పోరాటం చేస్తున్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 24.45కోట్లమందికికరోనాసోకి వారిలో 20.02 లక్షలమందిచనిపోయారు. మరో 66 15 మందిపరిస్థితి విషమించింది. రికవరీలు 24కోట్లకుపైగా నమోదుకాగా మరో 24.35 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతో పోరాటంచేస్తున్నారు. ఉత్తర అమెరికా దేశాల్లో 12.31కోట్లమంది కరోనా బారినపడితే వారిలో 15.94 లక్షల మంది చనిపోయారు. మరో 9004 మంది పరిస్థితి ఆందోళనకరంగా మారింది. రికవరీలు 11.79 కోట్లకుపైబడితే మరో 35.63 లక్షలమంది ఇప్పటికీ ఆసుపత్రుల్లోనే కొనసాగుతున్నారు. ఆసియా దేశాల్లో మొత్తం 21.22కోట్లకు పైగా కరోనా బాధితులుండగా వారిలో 15.26 లక్షలమందిచనిపోయారు. మరో 17,216 మందిపరిస్థితి ఆందోళనకరంగా మారింది. రికవరీలు 19.67కోట్లకుపైగా నమోదు కాగా మరో 1.40 కోట్లమంది ఇప్పటికీ మృత్యువుతో పోరాటం చేస్తున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం 6.76 కోట్లకుపైగా కరోనా బాధితులుంటే వారిలో 13.46 లక్షల మంది చనిపోయారు. మరో 10,265 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది.రికవరీలు 6.65 కోట్లకుపైగా నమోదుకాగా మరో 6,27,863 మంది ఇప్పటికీ మృత్యువుతో పోరాడుతున్నారు. ఆఫ్రికా దేశాల్లో మొత్తం 1.27 కోట్లకుపైగా కరోనా బాధితులుంటే వారిలో 2,58,481 మంది చనిపోయారు. రికవరీలు 1.20 కోట్లకుపైగా నమోదుకాగా మరో 4.54,234 మందిపరిస్థితి ఆందోళన కరంగా ఉన్నట్లు తేలింది. 19 ద్వీపకల్ప దేశాలపరంగాచూస్తే మొత్తం 1.38 కోట్ల కుపైగా కరోనా బాధితులుంటే వారిలో 24,682 మంది చనిపోయారు. రికవరీలు 1.36 కోట్లకు పైగా నమోదు కాగా 1,64,329 మంది మృత్యువుతో పోరాటం చేస్తున్నట్లు ఆరోగ్య సంస్థ నివేదికలందాయి.

# మేయర్ ఎన్నికపై సుప్రీంను ఆశ్రయించిన ఆప్!

## తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని పిటిషన్



**న్యూఢిల్లీ, జనవరి 26:** ఢిల్లీమేయర్‌పదవిపై నెలకొన్న రాజకీయ వివాదంపై ఆప్ మేయర్ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్, నేత ముకేష్ గోయల్‌లు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌చేశారు. నామినేటెడ్ కౌన్సిలర్లకు ఎలాంటి ఓటుహక్కు ఉండదని వారుప్రకటించారు. అంతేకాకుండా ఆప్ మేయర్ ఎన్నికపై సుప్రీంకోర్టుకు కూడా వెళ్లాలని నిర్ణయించింది. ఆప్ అభ్యర్థి గురువారమే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మేయర్‌పదవికి నిర్ణీత గడువులోపే ఎన్నికలునిర్వహించాలని ఆదేశించాలనికోరుతూ ఆమె పిటిషన్ దాఖలుచేశారు. శుక్రవారం ఆమెపిటిషన్‌పై విచారణచేస్తారని తేలింది. అంతేకాకుండా ఆమ్ ఆద్మీపార్టీ పది మంది నామినేటెడ్ కౌన్సిలర్లను ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోకుండా చూడాలని కోరింది. మేయర్ ఎన్నికలు రెండోసారి ఈనెలలోనే స్తంభించిపోయాయి. కొత్తగా ఎన్నికైన మున్సిపల్ కార్పొరేషన్‌వరగా నామినేటెడ్ సభ్యుల ఓటింగ్‌పైనే వివాదం నడుస్తోంది. ఆప్ ఖచ్చితమైన మెజార్టీతో గెలిచింది. అయితే ప్రిసైడింగ్ అధికారి వైఖరిని దుయ్యబడుతోంది. బిజెపి అక్రమ విధానాలను అవలంబించి మేయర్ ఎన్నికల్లో గెలవాలనిచూస్తోందని ఇదొక పెద్ద కుట్రగా బిజెపి అమలుచేస్తోందని ఆప్ ప్రభుత్వం ఆరోపించింది. లెఫ్టినెంట్ గవర్నర్ నియమించిన ప్రిసైడింగ్ అధికారి బిజెపి ప్రతినిధి అని ఆప్ ప్రభుత్వం ఆరోపించింది. 15 ఏళ్ల తర్వాత ఢిల్లీమున్సిపాలిటీలో బిజెపి ఘోరపరాజయం చవిచూసింది. మంగళవారం రెండోసారి వాయిదాపడటంతో బిజెపి కౌన్సిలర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులుచేతబట్టి ఆప్ పార్టీపై దుమ్మెత్తిపోశారు. మేయర్ ఎన్నికల్లో పోటీకి ఆప్ పరావృతంటూ ఎద్దేవాచేశారు. వాయిదా పడిన తర్వాతకూడా ఆప్ సభ్యులు సీట్లలోనే కూర్చుండిపోయారు. పార్టీ వెంటనే హాజరైన వారి సంఖ్యను లెక్కించింది. అంతకుముందు జనవరి 6వ తేదీ కూడా వాయిదాపడింది. ఆప్, బిజెపి అభ్యర్థుల నిరసనలతో వాయిదా అనివార్యం అయింది. 250 వార్డుల్లో ఆప్ 134 వార్డులను గెలుచుకుంది. బిజెపి 104 స్థానాలు గెలిచింది. దేశరాజధాని ఢిల్లీలో బిజెపి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఉన్న అధికారాలతో పాలన కొనసాగిస్తోందన్న ఆరోపణలున్నాయి. రాష్ట్రప్రభుత్వం తన అధికారాలను తాను చూపిస్తోంది. పౌర సమస్యలన్నీ కూడా రాష్ట్రానికే ఉండాలని, కోరిన ఆప్ ఇటీవలే బిజెపినుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంది. అంతేకాకుండా బిజెపినుంచి ఢిల్లీ కౌన్సిల్‌ను సాధించింది. ప్రతి ఏడాది ఒకరు చొప్పున రొటేషన్ పద్ధతి ఉంటుంది. మొదటి సంవత్సరాన్ని మహిళలకు కేటాయించారు. పదేళ్లలో నగరానికి ఒక మహిళామేయర్ కావడం ఇదే మొదటిసారి అని ఆప్ వాదిస్తోంది. గత ఏడాది ఢిల్లీపరిధిలోని మూడు మున్సిపల్‌కార్పొరేషన్‌లను రాష్ట్రప్రభుత్వం ఒకే మున్సిపాలిటీగా విలీనంచేసింది.



# మైక్‌టైసన్‌పై అత్యాచార ఆరోపణలు

**వాషింగ్టన్, జనవరి 26:** ప్రపంచ మాజీ హెవీ వెయిట్ ఛాంపియన్ మైక్ టైసన్‌పై మరోసారి అత్యాచారం ఆరోపణలు వచ్చాయి. 1990ల్లో తనపై టైసన్ అత్యాచారం చేశారంటూ ఆరోపిస్తూ ఓ మహిళ న్యూయార్క్ న్యాయస్థానంలో దావా వేశారు. న్యూయార్క్ ఆల్బనీలోని ఓ నైట్ క్లబ్‌లో మైక్ టైసన్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని అప్పటి నుంచి కొన్నేళ్లపాటు తాను శారీరకంగా, మానసికంగా ఎంతగానో వేదనకు గురైనట్లు తెలిపారు. ఇందుకుగాను 5 మిలియన్ డాలర్లు చెల్లించాలని దావాలో పేర్కొన్నారు. అయితే 1990 మొదట్లో తనపై లైంగిక దాడి జరిగిన ఆ మహిళ పేర్కొన్నప్పటికీ ఖచ్చితంగా ఏ రోజు ఆ ఘటన జరిగిందనే విషయాన్ని మాత్రం ఆమె వెల్లడించలేదు. ప్రపంచ హెవీ వెయిట్ ఛాంపియన్‌గా 1987 నుంచి 1990 వరకు కొనసాగిన మైక్ టైసన్ జీవితం రింగు బయట మాత్రం అల్లకల్లోలంగా ఉండేది.

1980 చివర్లో నటి రాబిన్ గీవెన్స్‌ను పెళ్లాడిన ఆయన కొద్దికాలానికే విడాకులు తీసుకున్నాడు. ఆ సమ యంలో టైసన్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన గీవెన్స్ వారి దాంపత్యం హింస, వినాశనంతో కొన సాగిందంటూ విడాకుల పత్రాల్లో పేర్కొ న్నారు. అనంతరం కొద్దికాలానికి ఇండియానా పొలిస్‌లో దేసిరీ వాషింగ్టన్ అనే మోడల్ మైక్ టైసన్ తనపై అత్యాచారానికి పాల్పడినట్లు ఫిర్యాదు చేసింది.

# పేదలకు రూ.20తో వైద్యం

## ఆదర్శంగా నిలుస్తున్న విశ్రాంత సైనిక వైద్యుడు

**భోపాల్, జనవరి 26:** పేదలకు సేవ చేయాలన్న సంకల్పం వెనకడుగు వేయనివ్వలేదు. కుటుంబ సభ్యులు వారిస్తున్నా వినకుండా రూ.2కే వైద్యసేవలు అందించడం మొదలు పెట్టారు. ఇప్పటికీ రూ.20కే వైద్యం చేస్తున్న అతడిని భారత ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. ఆయనే మధ్యప్రదేశ్‌కు చెందిన విశ్రాంత సైనిక వైద్యుడు మునీశ్వర్ చందర్ దావర్. పేద ప్రజలపై ఆయనకున్న ప్రేమ, సేవ చేయాలనే ప్రగాఢ వాంఛ, జీవనయానం ఎందరికో ఆదర్శప్రాయం.



దావర్ 1946, జనవరి 16న పాకిస్థాన్‌లోని పంజాబ్‌లో జన్మించారు. స్వాతంత్ర్యం అనంతరం భారత్ నుంచి పాక్ విడిపోయిన తర్వాత ఆయన కూడా ఇండియాకు వచ్చేశారు. 1967లో జబల్‌పూర్‌లో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. ఆ తర్వాత 1971లో భారత్, పాక్ యుద్ధ సమయంలో యేడాదిపాటు సైనిక వైద్యుడిగా సేవలందించారు. ఆయన సర్వీసులో ఉన్నప్పుడే సెలవుల్లో వచ్చి చుట్టుపక్కల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించే వారు. పదవీ విరమణ చేసిన తర్వాత జబల్‌పూర్‌లో ఉంటున్న పేదలకు కేవలం రూ.2 నామమాత్రపు ఫీజుతో వైద్య సేవలు అందించడం మొదలు పెట్టారు. అప్పటి నుంచి నిరంతరాయంగా వేద్య సేవలు అందిస్తూనే ఉన్నారు. ఇప్పుడు కూడా కేవలం రూ.20 మాత్రమే ఫీజు తీసుకోవడం గమనార్హం. ఇంత తక్కువ ఫీజుతో సేవలు అందించడం ఆయన బంధువులు కొందరికి నచ్చలేదు. ఇంకొందరు వద్దని వారించారు. అయినప్పటికీ వారి వాదనను సున్నితంగా తిరస్కరించిన దావర్ తన మనసు చెప్పిన విధంగా ముందుకెళ్లారు. పేద ప్రజలకు తక్కువ ఫీజుతోనే వైద్య సేవలు అందిస్తూ వారి మనసుల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నాడు. పేదవారి పట్ల ఆయనకున్న అభిమానాన్ని, ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం తాజాగా ఆయన్ను పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. భారత ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించిన తర్వాత ఆయన తన అనుభవాన్ని మీడియాతో పంచుకున్నారు. కష్టపడి పని చేస్తే ఖచ్చితంగా గుర్తింపు వస్తుందన్నారు. అయితే కొన్నిసార్లు అది ఆలస్యం కావొచ్చన్న ఆయన ప్రజల ఆశీస్సుల వల్లే ఈ పురస్కారం వరించిందన్నారు. తక్కువ ఫీజు తీసుకుంటుండంపై మా ఇంట్లో చాలా సార్లు చర్చ జరిగింది. కానీ పేద ప్రజలకు సేవ చేయాలన్న నా కోరికను కుటుంబసభ్యులంతా అర్థం చేసుకున్నారు. పేద ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యం. అందుకే ఫీజును పెంచలేదు. ఓపికతో కష్టపడి పని చేస్తే విజయం సాధించడం పక్కా. దీని వల్ల ఎంతో గౌరవం దక్కుతుంది అని అంటున్నారు.


# సీతారాముల విగ్రహాలకోసం నేపాల్ నుంచి ప్రత్యేక శిలలు

**అయోధ్య, జనవరి 26:** అయోధ్యలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రామమందిరంలో విగ్రహాల రూపకల్పనకు శిలలను నేపాల్ నుంచి రప్పిస్తున్నారు. రాముడు సీత విగ్రహాలను పవిత్ర రామమందిరంలో ఏర్పాటుచేసేందుకు వాటిని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతున్నారు. నేపాల్‌లోని గండకి నదివద్ద లభించే ప్రత్యేక ఏక శిలను రప్పించినట్లు అయోధ్య ట్రస్టు వెల్లడించింది. గండకినదిసమీపంలోని ముక్తినాథ్‌ప్రాంతంనుంచి రెండు భారీ ఏకశిలలను అయోధ్యకు పంపించారు. విష్ణుమూర్తిప్రతిరూపాలుగా భావించే ఈ సాలిగ్రామ్ శిలలను పంపించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ విగ్రహాలను వచ్చే ఏడాది మకర సంక్రాంతినాటికి పూర్తిచేస్తారని అయోధ్య ట్రస్టు వెల్లడించింది. నేపాల్‌రాజు జనకమహారాజు తనయగా అయోధ్య రాముడిని వివాహం ఆడినందున రెండు దేశాలమధ్య పరస్పర ఆధ్యాత్మికత, హిందూత్వం కొనసాగుతున్నదని ట్రస్టు నిర్వాహకులు తెలిపారు.నేపాల్‌లోని జనక్‌పూర్‌లో కూడా రామనవమి రోజున భక్తులు వేడుకగా నిర్వహిస్తారు. అలాగే సీతారాముల వివాహాన్ని శుక్లపక్షంలోని ఐదో రోజున నిర్వహిస్తారు. ఈ తేదీ సుమారుగా నవంబరు, డిసెంబరు మాసాల్లోనే ఉంటుందని అంచనా. రామ జన్మ భూమి రామమందిర్‌ట్రస్టు ఇన్‌ఛార్జి ప్రకాష్ గుప్తా మాట్లాడుతూ విఎస్‌ఎస్ జాతీయ కార్యదర్శి రాజేంద్ర సింగ్ పంకజ్ నేపాల్‌లోని ముస్తాంగ్‌జిల్లానుంచి బయలుదేరారని ఈ రెండు పవిత్ర శిలలను తీసుకుని వస్తున్నట్లు తెలిపారు. శుక్రవారానికి అయోధ్యకు చేరుకుంటారని తెలిపారు. ఈ రెండుశిలలు ఐదునుంచి ఆరు అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడలుప్పతో ఉంటాయని ఈ రెండింటినుంచే రామ్‌లాల విగ్రహాన్ని తీర్చిదిద్ది ప్రధాన మందిరంలో ఉంచుతారు. రామునితోపాటు సీతాదేవి విగ్రహాన్ని కూడా వెంటవెంటనే ఏర్పాటుచేస్తారు. ఈ రెండు శిలలు 18 టన్నులు ఒకటి మరోటి 12 టన్నుల బరువుతో ఉన్నాయి.

# గర్ల్‌ఫ్రెండ్ కోసం 13 ఖరీదైన బైకుల చోరీ!

**ముంబయి, జనవరి 26:** గర్ల్‌ఫ్రెండ్‌కు దగ్గర కావడం కోసం 19 యేళ్ల ఓ యువకుడు దొంగగా మారిన ఘటన మహారాష్ట్రలో జరిగింది. మొత్తం 13 ఖరీదైన బైకుల్ని తస్కరించిన ఆ యువకుడు థానే జిల్లాలోని కల్యాణ్ ప్రాంతంలో పోలీసులకు చిక్కాడు. బైకులు దొంగిలించిన యువకుడి పేరు శుభంభాస్కర్ పవార్. తాను ఈ దొంగతనాలకు పాల్పడింది తన ప్రేయసిని సంతోష పెట్టడానికేనని పోలీసుల దర్యాప్తులో ఈ యువకుడు చెప్పాడు. ఆ 13 బైకుల విలువ రూ.16 లక్షలకుపైగా ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. లాతూర్, సోలాపూర్, పూణెల్లో ఈ బైకుల్ని చోరీ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో ఆ యువకుడు వెల్లడించాడు.

# మోడీకి షాకిచ్చిన అమెరికా బిబిసి డాక్యుమెంటరీపై యూటర్న్!




**వాషింగ్టన్, జనవరి 26:** ప్రధాని నరేంద్రమోడీ 2002లో గుజరాత్ సిఎంగా ఉన్నప్పుడు జరిగిన అల్లర్లపై బిబిసి రెండు విడియోల డాక్యుమెంటరీ రూపొందించిన విషయం విదితమే. ఇది దురుద్దేశపూర్వకంగా ఉందని కేంద్రం ఈ విడియోలను బ్యాన్ చేసింది. గతవారమే ట్విట్టర్, యూట్యూబ్‌లో ఈ విడియో లింక్స్‌ను బ్లాక్ చేసింది. అయితే అమెరికా విదేశాంగ శాఖ అధికారి ప్రతినిధి తాజాగా దీనిపై స్పందించారు. ప్రపంచవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛకు తాము మద్దతు ఇస్తామని, ప్రజాస్వామ్య విలువలను భావప్రకటనా స్వేచ్ఛ, మతం మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. భారత్‌కు కూడా ఇది వర్తిస్తుందని స్పష్టం చేశ్వారు. సోమవారం ఇదే విషయంపై మాట్లాడిన ప్రైస్, మోడీపై బిబిసి రూపొందిచిన డాక్యుమెంటరీ గురించి తనకు తెలియదని, భారత్-అమెరికా బంధం ప్రత్యేకమన్నారు. రెండు దేశాల ప్రజాస్వామ్య విలువలు ఒకేలా ఉంటాయని వ్యాఖ్యానించారు. భారత్‌లో జరిగిన విషయాల గురించి గతంలోనూ తాము మాట్లాడినట్లు పేర్కొన్నారు. కానీ ఒక్క రోజులోనే యూ టర్న్ తీసుకుని బిబిసి డాక్యుమెంటరీని భారత్‌లో నిషేధించడాన్ని పరోక్షంగా తప్పుబట్టారు. 2022లో మోడీ సిఎంగా ఉన్నప్పుడు గుజరాత్‌లో మతపరమైన ఘర్షణలు చెలరేగాయి. కరసేవకులు ప్రయాణించిన రైలుకు దుండగుడు నిప్పుపెట్టిన ఘటనలో 50 మందికిపైగా చనిపోయిన తర్వాత ఈ హింస మొదలైంది. ఈ ఘర్షణల్లో 1000 మందికిపైగా చనిపోయారు. బిజెపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే ఈ వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం మోడీకి 2012లో క్లీన్‌చిట్ ఇచ్చింది. కానీ బిబిసి గుజరాత్ అల్లర్లపై ఇన్వెస్టిగేషన్ చేసి రెండు వీడియోల రూపంలో డాక్యుమెంటరీ రూపొందించి ఇటీవల విడుదల చేసింది. ఇందులో విషయమేమీ లేదని, పూర్తిగా దురుద్దేశపూర్వకంగా ఉందని కేంద్రం ఈ విడియోలను బ్యాన్ చేసింది.

# చైనాను ఇండో పసిఫిక్‌లో అడ్డుకునేందుకే

## క్వాడ్‌లో భారత్ చేరింది : అమెరికా మాజీ విదేశాంగమంత్రి మైక్ పాంపియో

**వాషింగ్టన్, జనవరి 26:** చైనా దురహంకార చర్యల్ని కట్టడి చేయడానికే క్వాడ్ కూటమిలో భారత్ చేరిందని అమెరికా మాజీ విదేశాంగమంత్రి మైక్ పాంపియో అన్నారు. స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించే భారత్..చైనా దుందుడుకు చర్యల కారణంగా తన వైఖరి మార్చుకోవాల్సి వచ్చిందని తన తాజా పుస్తకయినెవర్ గివ్ యాన్ ఇంచ్: ఫైటింగ్ ఫర్ ది అమెరికా ఐ లవ్‌లో పాంపియో పేర్కొన్నారు. ఈ పుస్తకంలో భారత్ గురించి విశ్లేషిస్తూ..సామ్యవాద పునాదులపై ఏర్పడిన దేశంగా పాంపియో అభివర్ణించారు. ప్రచ్ఛన్న యుద్ధ(కోల్డ్ వార్) సమయంలో ఇటు అమెరికా..అటు రష్యా.. ఏ కూటమిలోనూ చేర కుండా భారత్ స్వతంత్ర వైఖరి అవలంబించిందని పాంపి యో పేర్కొన్నారు. ఇప్పటికీ దాదాపు అదే విధానాన్ని భారత్ అనుసరిస్తోందని ఆయన తెలిపారు. ఇండో.. పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడును అడ్డుకోవడానికే 2017లో క్వాడ్ కూటమి ఏర్పడింది. ఈ కూటమిలో అమెరికా, జపాన్, భారత్, ఆస్ట్రేలియా సభ్య దేశాలుగా ఉన్నాయి. రిపబ్లికన్ పార్టీకి చెందిన పాంపియో 2024 అధ్యక్ష ఎన్నికల్లో బరిలో ఉండే అవకాశమున్నదని అమెరికాలో జోరుగా ప్రచారం సాగుతోంది. భారత్‌ను క్వాడ్‌లోకి తీసుకు రావడంలో ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం విజయవంతమైందని పాంపియో గుర్తు చేశారు. గల్వాన్ ఘర్షణ తర్వాత చైనాకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు భారత్‌లో ఊపందుకున్నాయని పాంపియో తన పుస్తకంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో టిక్‌టాక్‌సహా పలు యాప్‌లను భారత్‌లో నిషేధించినట్లు పాంపియో గుర్తు చేశారు.







# ఫేస్‌బుక్‌లోకి ట్రంప్ రీఎంట్రీ

**వాషింగ్టన్, జనవరి 26:** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను పునరుద్ధరించినట్లు వాటి మాతృసంస్థ మెటా ప్రకటించింది. ఈ మేరకు బుధవారం తన బ్లాగ్‌లో ఓ పోస్ట్ పెట్టింది. రెండేళ్ల నిషేధం తర్వాత అమెరికా మాజీ అధ్యక్షుడి ఖాతాను యాక్టివేట్ చేసినట్లు వెల్లడించింది. భవిష్యత్తులో వివాదాస్పద పోస్టులు పెడితే మళ్లీ నిషేధం తప్పదని స్పష్టం చేసింది. రెండేళ్ల క్రితం అమెరికా అధ్యక్ష భవనంతో పాటు వాషింగ్టన్ డిసిలోని పలు ప్రభుత్వ భవనాలపై దాడులు జరిగిన విషయం విదితమే. ప్రెసిడెంట్ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో పెద్ద సంఖ్యలో నిరసనకారులు ఆందోళనలు చేశారు. ఈ సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి ఈ దాడులకు పాల్పడిన వారికి మద్దతుగా డొనాల్డ్ ట్రంప్ పోస్టులు పెట్టడంతో ఆయనపై మెటా కంపెనీ చర్యలు తీసుకుంది. ట్రంప్‌కు చెందిన ఫేస్‌బుక్, ఇన్‌స్టా ఖాతాలను రెండేళ్లపాటు సస్పెండ్ చేసింది. తాజాగా ఈ గడువు పూర్తవడంతో ట్రంప్ ఖాతాలను పునరుద్ధరించింది. ట్విట్టర్ కూడా ట్రంప్‌పై నిషేధం విధించగా, ఆ కంపెనీ ఎలాన్ మస్క్ చేతుల్లోకి వచ్చాక నిషేధం ఎత్తివేసింది. అధ్యక్ష ఎన్నికల ఖర్చుల కోసం నిధుల సమీకరణకు గతంలో ట్రంప్ ఫేస్‌బుక్‌పైనే ఎక్కువగా ఆధారపడ్డారు. పెద్ద మొత్తంలో నిధులు కూడా ఫేస్‌బుక్ ద్వారానే సమీకరించారు. 2016 నుంచి 2020 మధ్య కాలంలో మిలియన్ల కొద్ది డాలర్లను ఫేస్‌బుక్ ప్రకటనల ద్వారా ట్రంప్ పోగేశారు. ఫేస్‌బుక్‌లోని 34 మిలియన్ల ఫాలోవర్లతో ట్రంప్ నేరుగా మాట్లాడే అవకాశం ఉంది.

రాబోయే ప్రెసిడెంట్ ఎన్నికల్లో మూడోసారి పోటీపడాలని నిర్ణయించుకున్న ట్రంప్‌కు మెటా నిర్ణయం ఉపశమనమేనని రాజకీయ వర్గాల అభిప్రాయం. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్లు తనపై నిషేధం విధించడంతో డొనాల్డ్ ట్రంప్ తనే సొంతంగా ఓ సోషల్ మీడియా యాప్‌ను తయారుచేసుకున్నారు. ట్రూత్ సోషల్ పేరుతో తీసుకొచ్చిన ఈ యాప్ ద్వారా తన అభిమానులు, మద్దతుదారులతో టచ్‌లో ఉంటూ వస్తున్నారు. ట్విట్టర్‌లో తనపై నిషేధాన్ని మస్క్ తొలగించి చాలా రోజులు అవుతున్నా, ఇప్పటి వరకు ట్రంప్ ఒక్క ట్వీట్ కూడా చేయలేదు.

# ఒక్కరోజులో కరోనా కేసులు 131 దేశంలో మొత్తం కరోనా బాధితులు 4,46,82,338

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి26:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది.గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 131 కేసులు నమోదయ్యాయి. మృతి నమోదు కాలేదు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,46,82,338కి చేరిందని కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది.మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,41,49,694మంది కోలుకోగా 1906మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,30,738కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.81 శాతంగా ఉంది.దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.19శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,37,088కి చేరగా,79,88,566 మంది వరకు కోలుకున్నారు. 1,48,420మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 68,29,534కి చేరింది.అందులో 67,56,773మంది కోలుకున్నారు. 71,574మంది మరణించారు. కర్ణాటకలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 40,72,778 చేరింది.అందులో 40,32,305మంది కోలుకున్నారు.4 0,309మంది మరణించారు. తమిళనాడులో కరోనా బాధి తుల సంఖ్య35,94,629కి చేరింది.అందులో 35,56,535 మంది కోలుకున్నారు. 38,049 మంది మరణించారు.



# జపాన్ సమీపంలో మునిగిన నౌక 8మంది మృతి, 14మందిని కాపాడిన సహాయక సిబ్బంది

టోక్యో, జనవరి 26: దక్షిణకొరియా..జపాన్ మధ్య జిన్ టియాన్ అనే సరుకు రవాణా నౌక సముద్ర జలాల్లో మునిగిపోయింది. ఈ దుర్ఘటనలో మొత్తం 8మంది చనిపోయినట్లు తెలుస్తోంది. మొదట ఇద్దరు చనిపోగా, ఆరుగురు గల్లంతయ్యారని జపాన్ కోస్ట్‌గార్డ్ తెలిపారు. అయితే, గల్లంతయ్యారని భావించిన ఆరుగురు కూడా చనిపోయారని అధికారులు ఆ తర్వాత వెల్లడించారు. బుధవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. దుర్ఘటన సమయంలో చైనా, మయన్మార్‌లకు చెందిన 22మంది సిబ్బంది నౌకలో ఉన్నారు. వారిలో 14మందిని తీర రక్షక దళాలు కాపాడాయి. ఒడ్డుకు చేరిన వారిలో 9మంది అపస్మారక స్థితిలో ఉండగా..విమానాల్లో జపాన్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. గల్లంతైనవారి కోసం తీర రక్షక నౌకలతోపాటు వాణిజ్య నౌకలు, విమానాలతో గాలిస్తున్నారు. అయితే, సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. 6551 టన్నుల బరువున్న ఈ నౌక కలప దుంగలతో వెళ్తుండగా ప్రమాదవశాత్తు మునిగిపోయింది. ప్రమాదంలో చిక్కుకున్నామంటూ మంగళవారం రాత్రి 11..15 సమయంలో నౌక నుంచి కాల్ వచ్చిందని, ఆ తర్వాత మూడున్నర గంటల అనంతరం నౌక మునిగిపోయి ఉంటుందని తీర రక్షక దళం అధికారి ఒకరు పేర్కొన్నారు.

# చత్తీస్‌గఢ్‌లో నిరుద్యోగులకు భృతి

## సిఎం భూపేశ్ భాగెల్

రాయ్‌పూర్, జనవరి 26: నిరుదోయగులకు చత్తీస్‌గఢ్ సిఎం భూపేశ్ భాగెల్ గుడ్‌న్యూస్ చెప్పారు. తమ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ప్రతి నెల భృతి ఇస్తామని ప్రకటించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచే దీన్ని అమలు చేస్తామని వెల్లడించారు. అంటే ఏప్రిల్ నుంచి యువతకు నిరుద్యోగ బృతి అందనుంది. అయితే నిరుద్యోగులకు అందాల్సిన అర్హతలేంటీ? ప్రతి నెల ఎంత ఇస్తారు? ఇలా ఎంత మందికి, ఎన్ని నెలలు ఇస్తారు? అనే విషయాలపై మాత్రం ఆయన స్పష్టత ఇవ్వలేదు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా బస్తర్ జిల్లా జగ్దాల్ పూర్‌లో గురువారం జాతీయ జెండాలను భూపేశ్ భాగెల్ ఆవిష్కరించారు. తర్వాత ఆయన పలు ప్రకటనలు చేశారు. రాయ్‌పూర్ ఎయిర్‌పోర్టు దగ్గరల్లో ఏరోసిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సౌకర్యాలను మెరుగుపరిచేందుకు, విమానాశ్రమ ప్రాంత అభివృద్ధి కోసం, ఉపాధికల్పన కోసం ఏరోసిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్మికులకు గృహ నిర్మాణ సాయం చేస్తామని, మూడేళ్లపాటు రూ.50వేల గ్రాంట్ అందచేస్తామని వివరించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెడెస్ ఇచ్చిన ముఖ్య హామీల్లో నిరుద్యోగ భృతిఒకటి. ఈ యేడాది చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలనేపథ్యంలో నిరుద్యోగ భృతిపై ప్రకటన చేసినట్లు తెలుస్తోంది.



# మోడీపై బిబిసి డాక్యుమెంటరీ ప్రదర్శించిన కేరళ కాంగ్రెస్

**తిరువనంతపురం, జనవరి 26:** దేశవ్యాప్తంగా సోషల్‌మీడియా సంస్థలను హెచ్చరించి ప్రధానిమోడీపై బిబిసి నిర్మించిన డాక్యుమెంటరీని ప్రదర్శించనీయకుండా చేస్తున్నారంటూ విపక్షాలు పెద్ద ఎత్తున చేస్తున్న గగ్గోలుతోపాటు అవసరమైన ప్రాంతాల్లో విపక్షాలు బిబిసి డాక్యుమెంటరీని ప్రదర్శిస్తున్నారు. ఇందులోభాగంగానే కేరళ కాంగ్రెస్ యూనిట్ బిబిసి డాక్యుమెంటరీని భారీ ఎత్తున వీక్షకులమధ్య ప్రదర్శించింది. కేంద్ర ప్రభుత్వం ఈ డాక్యుమెంటరీని ఒకవిధంగా అభూతకల్పనలని నిషేధించినా విపక్ష కాంగ్రెస్ మాత్రం ప్రసారంచేస్తోంది. రెండు భాగాలుగా రూపొందిన ఈ మోడీ సీరియల్‌ను కేరళ కాంగ్రెస్ కార్యకర్తలందరికీ ప్రసారంచేసారు. మోడీ హయాంలోనే గుజరాత్‌లో 2002లో భారీ ఎత్తున హింస, అల్లర్లు జరిగాయి. భావప్రకటనా స్వేచ్ఛ కోరుకునే కార్యకర్తలు, విపక్ష పార్టీలుకూడా ఈ అరాచకాలను ప్రజలకు తెలియజేయాల్సిందేనని గొంతెత్తి తమ నిరసనను వినిపిస్తున్నారు. కేరళలో కాంగ్రెస్ విపక్షంలో ఉంది. అయితే అధికారంలోని సిపిఎం మాత్రం డాక్యుమెంటరీని నిషేధించడాన్ని వ్యతిరేకించింది. వృద్ధనాయకుడు ఎకె ఆంటోని కుమారుడు అనిల్‌కె ఆంటోని ఇటీవలే పార్టీని వీడారు. బిబిసి డాక్యుమెంటరీ ఒక ప్రమాదకర అంశమని ఆయన పేర్కొన్నారు. అనిల్‌కె ఆంటోని వ్యాఖ్యలను ఎంపి శశిథరూర్ తీవ్రంగా ఖండిస్తూ పరిణతిలేని రాజకీయ వ్యాఖ్యలని కొట్టిపారేసారు. మన జాతీయ భద్రత, సార్వభౌమత్వం ఒక సీరియల్‌తో చెడిపోతాయా అని ఆయన పేర్కొన్నారు. కేరళ రాజధాని తిరువనంతపురంషన్ముంగం బీచ్‌లో ఈ రెండు ఎపిసోడ్‌లను స్క్రీనింగ్‌చేసారు.

# హిందూ ఆలయాలపై దాడులకు పాల్పడ్డ దుండగులను శిక్షించాలి

## ఆస్ట్రేలియాలోని భారత హైకమిషన్

**మెల్‌బోర్న్, జనవరి 26:** ఇటీవల ఆస్ట్రేలియాలో మూడు హిందూ ఆలయాలపై జరిగిన దాడుల విషయంలో భారత్ తీవ్రంగా స్పందించింది. హిందూ ఆలయాలపై జరిగిన దాడులు, ఆ దాడులకు పాల్పడిన దుండగులను కీర్తిస్తూ గీసిన గ్రాఫిటీలు ఆందోళన కలిగిస్తున్నాయని కాన్‌బెర్రాలోని భారత రాయబార కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఘటనలు జరిగి రోజులు గడుస్తున్నా దుండగులను పట్టుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దాడికి పాల్పడినవారిని గుర్తించి కఠిన శిక్షలు విధించాలని. తద్వారా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించింది. జనవరి 12న మెల్‌బోర్న్‌లోని స్వామినారాయణ్ మందిర్, 17న మెల్‌బోర్న్‌లోని కర్రమ్ డౌన్స్‌లోని శ్రీశివ విష్ణు ఆలయం, జనవరి 23న మెల్‌బోర్న్‌లోని ఆల్బర్ట్ పార్క్‌లోని హరే కృష్ణ ఆలయంపై(ఇస్కాన్ టెంపుల్)పై దాడులు జరిగాయి. ఖలిస్థానీ అనుకూల సంస్థలు ఈ దాడులకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఇస్కాన్ టెంపుల్‌పై ఖలిస్తాన్ జిందాబాద్, హిందూయిజమ్ ముర్దాబాద్ అంటూ విద్వేషపూరిత రాతలు రాశారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను బర్తరఫ్ చేయాలి

### గవర్నర్‌పై వ్యాఖ్యలకు డికె అరుణ ఖండన



**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** మహిళా అని చూడకుండా బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత గవర్నర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ అన్నారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర గవర్నర్ అని చూడకుండా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఖమ్మంలో బిఆర్ఎస్ సభకు లేని కరోనా నిబంధనలు జనవరి 26గణతంత్ర దినోత్స వాలకు వచ్చిందా అంటూ ప్రశ్నించారు. రాజకీయాలు ఓనమాలు తెలియని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ గవర్నర్‌పై నోటికి వచ్చిన కూతలు కూయడం ఆ పార్టీ నాయకుల అహంకారానికి నిదర్శనం అన్నారు. గణతంత్ర వేడుకలు జరపని ఏకైక రాష్ట్ర తెలంగాణ అన్నారు. రాజ్యాంగ నిర్మాత డా.బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం తెలంగాణ ప్రభుత్వానికి వర్తించేలా లేదన్నారు. భారతదేశంలో తెలంగాణ రాష్ట్రం అంతర్భాగం కానట్లు తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు.

# హైకోర్టు తీర్పు మేరకు మాకు ఉద్యోగాలిప్పించండి

### బండి సంజయ్‌కు డిఎస్సీ 2008 అభ్యర్థుల వినతి

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** డిఎస్సి-2008 మెరిట్ అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పిస్తూ నియామకాలు జరపాలని రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చినా సిఎం కెసిఆర్ పట్టించుకోవడం లేదని డిఎస్సి-2008 అభ్యర్థులు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ఎదుట వాపోయారు. పలువురు అభ్యర్థు బిజెపి రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. ఈ మేరకు బండి సంజయ్‌కు వినతిపత్రం అందించారు. తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మెరిట్ అభ్యర్తులకు ఉద్యోగాలు ఇస్తామని ముఖ్యమంత్రి 2016లో హామి ఇచ్చారని, ఆరు సంవత్సరాలు దాటినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంలో సానుకూలంగా స్పందించిన బండి సంజయ్ మెరిట్ అభ్యర్థుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా ఒత్తిడి తీసుకుని వస్తానని హామి ఇచ్చారు.

# జనావాసాల నుంచి ప్రమాదకర కంపెనీలను తరలించాలి

### కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో జనావాసాల మద్య ప్రాణా లతో చెలగాటం ఆడే కంపెనీలను తరలించాలని కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి అన్నారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టిపిసిసి ఉపాధ్యక్షులు కొమురయ్య, మరో నేత చెరుకు సుధాకర్‌లతో కలిసి మీడియా సమవేశం నిర్వహించారు. హైదరాబాద్ నగరంలో ఇటీవల అగ్నిప్రమాదాలు పెరిగిపోతున్నాయన్నారు. ఆస్తినష్టంతో పాటు ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. హెచ్ఎండిఎతోపాటు ఫైర్ అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారన్నారు. సంబంధిత మంత్రి కెటిఆర్, ప్రభుత్వం ఏ మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తుందన్నారు. అధికారుల, ప్రభుత్వం బాధ్యతలను విస్మరిస్తున్నారన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. నిబంధనలు పాటించని కంపెనీలపై చర్యలు తీసుకోవాలన్నారు.



# మాకు న్యాయం చేయండి మహాప్రభో!

### ఆ భూమిని మేము కొనుగోలు చేశాం..

### తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రైతు కుటుంబం ఆత్మహత్యాయత్నం

**మోటకొండూరు ప్రభాతవార్త:** గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ వేడుకల్లో అందరూ నిమగ్నమై ఉన్నారు. ఇంతలో ఒక్కసారిగా ఒక కుటుంబం మాకు న్యాయం చేయండి అంటూ తమపై కిరోసిన్ పోసుకుని ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన మోటకొండూరులో గురువారం చోటుచేసుకుంది. గమనించిన పోలీసులు హుటాహుటిన వారి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. బాధితులు మాట్లాడుతూ.. 30 సంవత్సరాల క్రితం సాదా బైనామా ద్వారా భూమిని కొనుగోలు చేసి కబ్జాలో ఉంటూ సాగు చేసుకుని జీవిస్తున్న తమకు ధరణి పోర్టల్ పుణ్యమా అని మాకు పట్టా కాకపోవడంతో 30 సంవత్సరాల క్రితం భూమికి డబ్బులు తీసుకుని అమ్మి పోయిన వ్యక్తి మనుమరాలు భూమి తనదే అంటూ, తనే వారసురాలిగా రెవెన్యూ కార్యాలయంలో సర్టిఫికెట్ తీసుకుని పౌతి రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ప్రయత్నించగా తాము కొనుగోలు చేసిన భూమి తమకే దక్కాలని, రెవెన్యూ అధికారులు సహకరించాలని, స్థానికంగా లేనివారికి వారసుల సర్టిఫికెట్ ఇవ్వద్దని కోరుతూ రైతు కుటుంబం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. వివరాలలోకి వెలితే మోటకొండూర్ గ్రామానికి చెందిన భూమండ్ల వెంకటేష్ భువనగిరి రెవెన్యూ పరిధిలోని చీమలకొండూర్ శివారులోని సర్వే నెంబర్ 54/బిలో 2,26 గుంటల భూమిని నర్సంశెట్టి వెంకటస్వామి దగ్గర సుమారు 30 సంవత్సరాల క్రితం సాద బైనామాతో కొనుగోలు చేసి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ధరణీ పోర్టల్‌లో కాస్తుకాలం లేకపోవడంతో 30 ఏండ్లుగా కాస్తు చేస్తూ జీవిస్తున్నప్పటికీ భూమిపై పట్టా పాసుబుక్కు రాకపోవడంతో వెంకటేష్ కుటుంబం చింతిస్తుండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెనాలికి చెందిన నాగరత్నమ్మ వెంకటస్వామి మనుమరాలునని వారసురాలుగా మోటకొండూర్ తహసీల్దార్ కార్యాలయం నుండి సర్టిఫికెట్ ఇవ్వడంతో అట్టి భూమిని పౌతి రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ప్రయత్నించగా పసిగట్టి వెంకటేష్ కుటుంబసభ్యులు శోభ, శ్రీకాంత్‌లు తమకు న్యాయం చేయాలని మోటకొండూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడగా గణతంత్ర దినోత్సవ వేడుకల బందోబస్తుకు వచ్చిన పోలీసులు అడ్డుకుని నివారించారు.

**తహసీల్దార్ వివరణ**

మోటకొండూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో రైతుకుటుంబం ఆత్మహత్య చేసుకున్న విషయమై తహసీల్దార్ జ్యోతిని ప్రభాతవార్త వివరణ కోరగా వెంకటస్వామి కుటుంబం గతంలో మోటకొండూర్ మండల కేంద్రంలో జీవించారని, వారికి గతంలో డెత్ సర్టిఫికేట్ కూడా మోటకొండూర్ నుండి తీసుకున్నారని వాటి ఆధారంగా వారసుల సర్టిఫికేట్ ఇచ్చినట్లు తెలిపారు.

## కెసిఆర్‌ను గద్దె దించాలన్న లక్ష్యం కోసం

# బిజెపి ఎమ్మెల్యే ఈటల ప్రత్యామ్నాయం వెతుక్కోవాలి

### ● మీడియా చిట్‌చాట్‌లో పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏ లక్ష్యం కోసం రాజేందర్ బిజెపిలోకి వెళ్లాడో ఆ లక్ష్యం నెరవేరడం లేదని మాటల్లో స్పష్టమైందన్నారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియాతో చిట్‌చాట్ చేశారు. కెసిఆర్‌ను గద్దె దించాలన్న లక్ష్యంతో రాజేందర్ బిజెపిలో చేరారని, కానీ బిజెపిలోకి వెళ్లిన తరువాత అక్కడ కూడా కెసిఆర్ కోవర్టులు ఉన్నారని అర్థమైం దన్నారు. రాజేందర్ లక్ష్య సాధన కోసం ప్రత్యామ్యాయ మార్గం వెతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కెసిఆర్ నియంతృత్వ ధోరణిని గద్దె దించాలనే లక్ష్యంతో బిజెపిలో చేరిన నాయకులు ఇప్పుడు ఆ పార్టీలో సంతృప్తిగా లేరని అన్నారు. బిజెపి, కెసిఆర్ ఒక్కటేనని ఈటల రాజేందర్ మాటల్లో స్పష్టమైందని, ఈ విషయంలో ప్రజలు ఆలోచిం చాలన్నారు. కెసిఆర్‌కు అంబేద్కర్ మీద మొదటి నుంచే కక్షే అన్నారు. కెసిఆర్ జన్మదినం కాదు, అంబేద్కర్ జన్మదినం రోజుల సచివాలయం ప్రారంభిస్తే గౌరవం ఉండేదన్నారు. ఈటల, వివేక్, విశ్వేశ్వర్‌రెడ్డిలు బిజెపి సిద్ధాం తాలను విశ్వసించరని, కేవలం కెసిఆర్‌ను మాత్రం వ్యతిరేకిస్తారన్నారు. బిజెపి ఐడియాలతో ఆ ముగ్గురికి సంబంధం లేదని, బిజెపిలో కోవర్టులు ఉన్నారని, ఈటల అన్నారంటే ఏదో అసంతృప్తి కారణం అన్నారు. ఈటల ముందుకు రాలేక, వెనక్కి వెళ్లలేకపోతున్నారన్నారు. హుజురాబాద్, మునుగోడు సందర్భానుసారమే బిజెపికి ఓట్లు పడ్డాయన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విషయంలో సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క మాట్లాడుతున్నారని, పార్టీ హైకమాండ్ భట్టికి బాధ్యతలు అప్పగింఇందన్నారు.

కేంద్రంలో మా ప్రభుత్వం వచ్చిన తరువాత పార్టీఫిరాయింపుల చట్టాన్ని కఠినతరం చేస్తామన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేయడానికి 25 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాలకు తగ్గిస్తామన్నారు. కలెక్టర్‌గా 21 సంవత్సరాల అధికారి బాధ్యతలు నిర్వహించగా, 21 సంవత్సరాల వ్యక్తి ఎమ్మెల్యేగా ఎందుకు పోటీ చేయకూడదన్నారు. కెసిఆర్ విషయ ప్రయోగంలో ఈటల కూడా పాత్రాదారి అవుతున్నాడన్నారు. రాజేందర్‌కు ఇష్టం లేని పనులను కెసిఆర్ చేపిస్తున్నారన్నారు. ఈటలకు ఎన్నికల్లో డబ్బులు పంచడం ఇష్టం లేదు, కానీ హుజురాబాద్‌లో ఎన్నికల్లో ఖర్చు పెట్టించాడని, కెసిఆర్ అనుకున్నదే రాజేందర్‌తో చేయిస్తున్నాడన్నారు.

# విద్యుత్ పనితీరు మెరుగుదలపై దృష్టి

### ● జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి ప్రభాకర్‌రావు



**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగ వ్యవస్థల పనితీరును మరింత మెరుగుపరచడంపై దృష్టి సారించాలిన తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి డి ప్రభాకర్‌రావు సూచించారు. హైదరాబాద్ విద్యుత్ సౌధలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ 38 వేల 70 కోట్ల రూపాయలతో విద్యుత్ ఉత్పత్తి, పంపిణీకి సంబంధించిన నెట్ వర్క్‌ను బలోపేతం చేశామన్నారు. రాష్ట్ర తలసరి వినియోగం 2126 యూనిట్లకు పెరిగిందని, ఇది జాతీయ సగటు 1255 యూనిట్ల కంటే 70 శాతం ఎక్కువని చెప్పారు. తలసరి విద్యుత్ వినియోగం సమగ్ర ప్రగతిని ప్రతిబింబించే సూచిక అని తెలిపారు. ఎటువంటి కోతలు లేకుండా అన్ని వర్గాల వారికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ రంగం విజయవంతం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని వెల్లడించారు. విద్యుత్ ఉత్పత్తి 7778 మెగావాట్ల నుండి 18453 మెగావాట్ల సామర్థ్యానికి చేరుకుందని, ఇంకా 8085 మెగావాట్ల ప్రాజెక్టుల నిర్మాణం పనులు వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెఎండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**ఎస్పీడిసిఎల్‌లో..**

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్)లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎస్పీడీసీఎల్ సిఎండి జి రఘుమారెడ్డి జెండా ఎగురవేసిన అనంతరం మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ వ్యవస్థ పటిష్టం కోసం ఈ ఎనిమిదేళ్లలో 13,563 కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. విద్యుత్ సరఫరా నష్టాలను 12.92 శాతం నుండి 8.16 శాతానికి తగ్గించామని తెలిపారు. అలాగే 2.79 శాతంగా ఉన్న పిటిఆర్ ఫెయిల్యూర్స్ రేటును 1.29 శాతానికి, 13.01 శాతంగా ఉన్న డిటిఆర్ ఫెయిల్యూర్స్ రేటును 6.47 శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. వినియోగదారులకు సమర్థవంతమైన సేవలను అందించేందుకు ఎస్ఎఎస్ఎ, ఐ పాస్, మొబైల్ యాప్, సిఎస్సీ, ఐసీఎస్సీ వంటి అత్యాధునిక సాంకేతికను అమలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఇంటర్ సర్కిల్ విమెన్ గేమ్స్, కల్చరల్ కాంపిటేషన్, మెన్స్ చెస్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన పలువురికి హుమతులు ప్రదానం చేశారు.

**సింగరేణిలో..**

సింగరేణి రూ.34 వేల కోట్ల టర్నోవర్ దిశగా ప్రగతి పథంలో నడుస్తోందని ఆ సంస్థ సిఎండి ఎన్ శ్రీధర్ అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో మాట్లాడుతూ మరో ఐదేళ్లలో 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేస్తామని చెప్పారు. దేశాభివృద్ధికి తన వంతుగా బొగ్గు, థర్మల్



విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. బొగ్గు డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రానున్న కాలంలో 10 కొత్త ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మరో మూడు సంవత్సరాల్లో విదేశీ బొగ్గు దిగుమతులకు స్వస్తి పలికే యోచనతో స్వదేశీ బొగ్గు ఉత్పత్తిపై దృష్టిసారిస్తున్నట్లు వెల్లడించారు.

**మిషన్ భగీరథ కార్యాలయంలో..**

74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఎర్రమంజిల్‌లోని పంచాయతీరాజ్, మిషన్ భగీరథ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మిషన్ భగీరథ ఈఎన్‌సి కృపాకర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని అందింపుచ్చుకుని ప్రజలకు మేలు కలిగేలా పనిచేయాలని ఇంజనీర్లకు దిశానిర్దేశనం చేశారు. ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పం సాకారం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎస్‌సి సంజీవరావు, మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్లు విజయప్రకాష్, లలితాదేవి, శ్రీనివాస్, జ్ఞానకుమార్‌లు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యా సంస్థల కార్యాలయాల్లో ఘనంగా గణతంత్ర వేడుకలు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా 74వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థల కార్యాలయాల్లో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్‌సీ) కార్యాలయంలో కమిషన్ ఛైర్మన్ డాక్టర్ బి జనార్థన్‌రెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ కార్యదర్శి అనితా రాజేంద్రన్‌తోపాటు కమిషన్ సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. గణతంత్ర వేడుకల్లో ఉన్నత విద్యా మండలి కార్యదర్శి డాక్టర్ ఎన్ శ్రీనివాసరావు, టీఏఎఫ్ఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ స్వరూప్‌రెడ్డి పాల్గొన్నారు. వందేళ్లపైగా చరిత్ర ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో జాతీయ జెండాను యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రవీందర్ ఎగురవేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ సీతారామారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎవిఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**లోటస్‌పాండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన షర్మిల**

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కెసిఆర్ రిపబ్లిక్ డే వేడుకలు జరపకుండా రాజ్యాంగాన్ని అవమానపరుస్తున్నాడని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. గురువారం లోటస్ పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అన్ని దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. రాజ్యాంగాన్ని రూపొందించిన అంబద్కర్ నేతృత్వంలో పనిచేసిన మేధావులను స్మరించుకుంటున్నామన్నారు. కెసిఆర్ సర్కార్ రాజ్యాంగాన్ని గౌరవిస్తుందా అంటూ ప్రశ్నించారు. కెసిఆర్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడానికి రాజ్యంగం అడ్డు వచ్చిందా అంటూ ప్రశ్నించారు. మహిళా అని చూడకుండా గవర్నర్ పదవికి కూడా గౌరవం ఇవ్వకుండా అగౌరపరుస్తుదన్నాడని, ఈ విషయాన్ని ప్రజలు ఆలోచించాలన్నారు. కెసిఆర్‌కు ముఖ్యమంత్రి పదవిలో ఉండే అర్హత లేదని, పదవికి రాజీనామా చేసి దళితుడిని ముఖ్యమంత్రి చేయాలని, లేకపోతే ఎన్నికలకు పోవాలని డిమాండ్ చేశారు.

# సమష్టి బాధ్యతతో హెచ్ఎండిఎ ముందంజ

### హెచ్‌జిసిఎల్ ఎండి సంతోష్

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన ఏ ఒక్క కార్యక్రమాన్ని అయినా దిగ్విజయంగా పూర్తిచేయడంలో హెచ్ఎండిఎ సమిష్టి బాధ్యత ఉందని హెచ్‌జిసిఎల్ ఎండి సంతోష్ అన్నారు. గురువారం హెచ్ఎండిఎ ప్రధాన కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఎండిఏలో పనిచేయడం ఉద్యోగులు అదృష్టంగా భావిస్తున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంతో రాష్ట్ర ప్రభుత్వం హరిత విప్లవానికి నాంది పలికిందన్నారు. మంత్రి కెటిఆర్, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవిందకుమార్ పర్యవేక్షణలో హెచ్ఎండిఏ పెంచిన గ్రీనరి వల్ల వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డుతో ప్రపంచ ఖ్యాతి దక్కిందన్నారు. వచ్చే ఫిబ్రవరిలో జరిగే ఫార్ములా-ఈ ఈవెంట్, ఎయిర్ పోర్టు వరకు మెట్రోరైల్, అతి పెద్ద సైకిల్ ట్రాక్ వంటి వాటితో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ట, హెచ్ఎండిఏ ప్రాధాన్యత మరింత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ అర్బన్ ఫారెస్టు డైరక్టర్ ప్రభాకర్, సెక్రటరీ చంద్రయ్య, ఎస్టేట్ అధికారి గంగాధర్, ప్లానింగ్ డైరక్టర్ శిశశరణప్ప, బిపిపి ఓఎస్‌డి చంద్రారెడ్డి, ఓఎస్‌డి రాంకిషన్‌రావు, రమణగౌడ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఈసారి వచ్చేది మన ప్రభుత్వమే

### మహిళల సమస్యలపై జనంలోకి వెళ్లాలి

### బిజెపి మహిళా మోర్చా నేతలకు బండి సంజయ్ ఆదేశం



**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** తెలంగాణలో బిజెపి అధికారంలోకి రాబోతుం దని, రాష్ట్రంలో మహిళలు ఏం కోరుకుం టున్నారు? వాళ్ల ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి? కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం చేస్తున్న పథకాలపై మహిళలకు అవగాహన ఉందా లేదా అన్న అంశాలపై దృష్టి సారించాలని మహిళా మోర్చా నేతలకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ సూచించారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ మహిళా విధానాలు, పరిశోధన విభాగం ఇన్‌చార్జి కరుణ గోపాల్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తితో పాటు పలువురు నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఇతర పార్టీల మాదిరిగా నాలుగు గోడల మద్య ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించడం లేదని, ప్రజల్లోకి వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించడంతో పాటు వారు ఏం కోరుకుంటున్నారో అధ్యయనం చేసి మేనిఫెస్టోను రూపొందించాలన్నారు. పాదయాత్రలో ప్రధానంగా ఎదురైన సమస్యలు, ప్రజల అభీష్టాన్ని అర్థం చేసుకున్న తరువాత రాబోయే ఎన్నికల మేనిఫెస్టోలో అర్హులైన పేదలందరికి ఉచిత విద్య, వైద్యం అందిస్తామన్నారు. అదేవిధంగా గ్యాస్ కనెక్షన్‌లు, రేషన్ బియ్యం, ఎరువుల సబ్సిడీ వాటిని కేంద్రమే భరిస్తున్నప్పటికీ కెసిఆర్ తానే చేసినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఈ విషయంపై ప్రజల్లోకి వెళ్లి వాస్తవాలు చెబుతూ అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలకు గుజరాత్‌తో సహా పలు రాష్ట్రాల్లో ఎన్నో మంచి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. వెంటనే ఆయా రాష్ట్రాల్లో పర్యటించి మంచి పథకాలు ఉంటే అధ్యయనం చేయాలన్నారు.



# మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా ఇవ్వాలి

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి.ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** సమాజంలో నిరాధారణకు గురవుతున్న బలహీనవర్గాలకు చెందిన మహిళలకు రాజ్యాధికారంలో అకవాశం కల్పించినప్పుడే మహిళా సాధికారత ఏర్పడుతుందని బిసి.సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి. ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈమేరకు గురువారం అంబర్‌పేట్‌లో బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుండ్రాతి శారదగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా సంఘం నూతన కార్యాలయాన్ని జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ మహిళా బిల్లులో సవరణలు చేసి బిసిమహిళలకు సబ్‌కోటా ఇవ్వాలన్నారు. అలాగే సమాజంలోని అన్నివర్గాల మహిళలకు న్యాయం చేకూరేవిధంగా మహిళా బిల్లు పరిధిని పెంచాలన్నారు. అందుకోసం జాతీయ స్థాయిలో ప్రజాసంఘాలు, మహిళా సంఘాలతో చర్చలు, జాతీయ స్థాయిలో సదస్సులు,రౌండ్‌టేబుల్ సమావేశాలు ఏర్పరిచి విస్తృతమైన చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సంఘం అధ్యక్షురాలు శారదగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని బిసి మహిళలను ఏకం చేసి అణచివేతకు గురవుతున్న బిసివర్గాల తరపున పోరాటం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు భూపేష్‌సాగర్, తిరుపతి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ వ్యవస్థలను విధ్వంసం చేస్తోన్న బిజెపి

### ప్రజాస్వామ్యంలో గవర్నర్ వ్యవస్థ చీడపురుగు వంటిది

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగ వ్యవస్థలను ఒక్కొక్క ద్దాన్ని విధ్వంసం చేస్తూ వస్తోందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. తాము కమ్యూనిస్టు పార్టీగా రాజ్యాంగ రక్షణకు, దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు కృషి చేస్తామని తెలిపారు. 74వ గణతంత్ర వేడుకల్లో భాగంగా గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయమైన ముగ్దూమ్ భవన్‌లో జాతీయ జెండాను కూనంనేని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్ బోస్, ఈటీ నర్సింహా, సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, కె శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగంలోని మొదటి పీఠికలో పొందపర్చిన ఉద్దేశ్యాలను, లక్ష్యాలను, ఒక్కొక్కటిగా విధ్వంసం చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని కూనంనేని సాంబశివరావు విమర్శిం చారు. రాజ్యాంగానికి పెనుప్రమాదం ముంచుకొస్తోందన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి, పరిరక్షిస్తామని చెబుతూనే, పెద్ద పెద్ద అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తూ.. మరోవైపు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాలరేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. పీఠిక రాజ్యాంగానికి దేశానికి ఆత్మలాంటిదని.. అలాంటి ఆత్మను పిసికేస్తే.. దేశమే చితికిపోతుందని.. తద్వారా దేశం నిర్జీవంగా మారుతోందని కూనంనేని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1976లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ సెక్యులర్, సోషలిస్టు పదాలను రాజ్యాంగంలో చేరిస్తే.. ప్రస్తుతం ఆ రెండు పదాలను తీసేయాలని బీజేపీ పాలకులు, ఆర్ఎస్ఎస్ శక్తులు విస్తృత ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గవర్నర్ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి పట్టిన చీడపురుగులాంటిదన్నారు. గవర్నర్ వ్యవస్థనే రద్దు చేయాలని పోరాటం చేస్తున్న నేపథ్యంలో గవర్నర్ ఆహ్వానించిన ఎట్‌హోమ్ కార్యక్రమాన్ని తాము బహిష్కరిస్తున్నట్టు తెలి పారు. తమకు ఇష్టంలేని రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి గవర్నర్ వ్యవస్థ ఒక సాధనంగా ఉపయోగపడుతుందని విమర్శించారు.

# వ్యవసాయ క్షేత్రాలను, కొత్త భవనాలను విమర్శించడం తగదు



## రాష్ట్ర అభివృద్ధి కొందరికి కనపడకపోతే చేసేదేం లేదు:

## మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

### అసెంబ్లీ, మండలి ఆవరణల్లో గణతంత్ర వేడుకలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 26:** గణతంత్ర దినోత్సవ వేడుకలను అసెంబ్లీలో ఘనంగా నిర్వహించారు. శాసనమండలి ఆవరణలో, అసెంబ్లీ ఆవరణలో జాతీయ జెండాలను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎగురవేశారు. శాసనసభ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. అనంతరం సుఖేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ప్రజాస్వామ్యం అమలవుతుందని పేర్కొన్నారు. ఉన్నత బాధ్యతల్లో ఉన్నవాళ్లు తెలంగాణ అభివృద్ధిని గమనించకపోవడం బాధాకరమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించేవారు కేంద్రం ఏం చేసిందో కూడా చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కేంద్రం ఏం చేసిందని అడిగితే... జాతీయ రహదారుల గురించి మాత్రమే మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణలో అందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు.

రాష్ట్ర అభివృద్ధి కొందికి కనపడకపోతే చేసేదేం లేదని చెప్పారు. వ్యవసాయ క్షేత్రాలను,కొత్త భవనాలను విమర్శించడం తగదన్నారు. స్వాతంత్ర్యం,రాజ్యాంగం ఏ ఒక్కరి సొత్తు కాదని పోచారం పేర్కొన్నారు దేశాన్ని పాలించే వ్యక్తులు రాజ్యాంగ స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. రాజ్యాంగం కులం,మతాలది కాదు... ఒక గ్రంథం లాంటిదని చెప్పారు. రాజకీయ పార్టీలు విమర్శలకే పరిమిత కావొద్దని హితవు పలికారు. రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నప్పుడు బాధ్యతగా ఉండాలని,మైకులు అందగానే ఆరోపణలు చేయొద్దని సూచించారు. స్పీకర్ అయినా,ప్రధాని అయినా రాజ్యాంగం పరిధిలోనే పదవులు వచ్చాయని, కొంతమంది కళ్లలో సంతోషం కోసం పరిపాలన చేయొద్దని వెల్లడించారు. అది రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు.

దేశ సంపద కొద్దమంది చేతుల్లోనే ఉందని, పేదలకు పెద్ద పీట వేయాలన్నారు. 74 ఏండ్ల తర్వాత కూడా పేదలు ఉన్నారని,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సిఎం కెసిఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందుతున్నదని స్పీకర్ పోచారం చెప్పారు.

## తెలంగాణ గొప్ప సంస్కృతి, ఔన్నత్యానికి నిదర్శనం

### ఎస్‌బిఐ జోనల్ సిజిఎం ఝింగ్రాన్



**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** తెలంగాణ గొప్ప సంస్కృతి, నిర్మాణ ఔన్నత్యానికి నిదర్శనమని ఎస్‌బిఐ హైదరాబాద్ రీజియన్ సిజిఎం అమిత్ ఝింగ్రాన్ అన్నారు. హైదరాబాద్‌లో గణతంత్ర వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులందరి కృషిని స్మరించుకోవాల్సిన సమయమన్నారు. గోల్కొండ కోట నుండి కాకతీయ రాజవంశం, రామప్ప దేవాలయం వరకూ ఇవన్నీ దేశం గొప్పతనాన్ని చూపుతాయని తెలిపారు. దేశ జిడిపి పెంచడం, ఆర్థిక వ్యవస్థ పెరుగదలలో బ్యాకింగ్ రంగం దూసుకుపోతోందన్నారు. గత సెప్టెంబరు త్రైమాసికంలో ఎస్‌బిఐ రికార్డు స్థాయిలో అత్యధిక లాభాన్ని ప్రకటించిందని చెప్పారు. అందరూ కష్టపడి పనిచేయడం వల్లే ఇది సాధ్యపడిందని వెల్లడించారు. ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించడంలో ఉద్యోగులు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.


**ఎల్‌ఐసిలో ..**

ఎల్‌ఐసి జోనల్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ ఎం జగన్నాధం మాట్లాడుతూ వినూత్న




సాంకేతికతతో పాలసీదారులకు ఉత్కృత్తమ సేవలు అందిస్తోందన్నారు. పాలసీదారులకు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. రాబోయే మార్పులకు అనుగుణంగా పాలసీదారులకు సాధ్యమైనంత కనీస సమయంలో సేవలు అందించనున్నట్లు చెప్పారు.

## 'మిస్టర్ ట్వీట్'గా పేరు మార్చుకున్న ఎలాన్ మస్క్



**శాన్‌ఫ్రాన్సిస్కో, జనవరి 26:** ట్విట్టర్‌ను కొనుగోలు చేసిన ఎలాన్ మస్క్ తన మైక్రోబ్లాగింగ్ సైట్‌లో పలు మార్పులు చేస్తున్న విషయం తెలిసిందే. యూజర్ల అభిప్రాయాలను తెలుసుకునేందుకు పోల్ చేపట్టారు. బ్లూటిక్‌కు రుసుం వసూలు చేస్తానని ప్రకటించారు. తన ట్విట్టర్ ఖాతాలో తన పేరును 'మిస్టర్ ట్వీట్'గా మార్చుకున్నారు. తిరిగి తన పేరును పూర్వస్థితికి మార్చుకునేందుకు ట్విట్టర్ అనుమతించడంలేదంటూ ట్వీట్ చేయడం యూజర్లను తికమెక పెడుతోంది. స్మైలీ ఎమోజీతో పెట్టిన ఈ ట్వీట్‌పై పలువురు యూజర్లు ఘాటుగా స్పందించారు. మిస్టర్ ట్వీట్..ఈ వేదికను కామెడీ ఛానల్‌గా మారుస్తున్నారా..? అంటూ ఓ యూజర్ ప్రశ్నించారు. ఇది నిజంగా హాస్యాస్పదం అంటూ మరో యూజర్ అసహనం వ్యక్తం చేశారు. ఇంకో యూజర్ తన పేరును ఎలాన్ మస్క్‌గా మార్చుకుంటానంటూ కౌంటరిచ్చారు. ట్విట్టర్‌లో మరికొన్ని మార్పులు రానున్నట్లు మస్క్ ఇటీవల ప్రకటించారు. యూజర్ ఇంటర్‌స్పేస్‌లో మార్పులు, ట్వీట్ వివరాల కోసం బుక్ మార్క్ బటన్, ట్వీట్లలో అక్షరాల సంఖ్యను పెంచడంలాంటి సౌకర్యాలు కల్పిస్తానని ప్రకటించారు.

# అమృతకాల్‌లో గణతంత్ర వేడుకలు

● ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, జనవరి 26:** 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల వేళ దేశప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలియచేశారు. దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. ఈ సారి ఈ వేడుకలు మరింత ప్రత్యేకం. ఎందుకంటే ఆజాదీ కా అమృత్ మహోత్సవం వేళ, వీటిని నిర్వహిస్తున్నాం. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నెరవేర్చే విధంగా కలిసకట్టుగా ముందుకు సాగుదాం అని ప్రధాని మోడీ ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం ప్రధాన కార్యక్రమానికి ముందు జాతీయ యుద్ధ స్మారకం వద్దకు చేరుకున్న ప్రధాని నరేంద్రమోడీ, ఇక్కడ దేశంలోని అమరవీరులకు నివాళులర్పించారు. తర్వాత, ప్రధాని మోడీ ఇక్కడ డిజిటల్ విజిటర్స్ బుక్‌లో తన మన్‌కీ బాత్‌ను రికార్డ్ చేశారు. దేశం మొత్తం ఈ రోజు గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటోంది. అయితే గణతంత్ర దినోత్సవంతో పాటు వసంత పంచమి కావడంతో ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక బసంతి తలపాగాలో దర్శనమిచ్చారు. జాతీయ యుద్ధ స్మారకం వద్ద అమరవీరులను స్మరించుకున్న ప్రధాని మోడీ, వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా త్రివిధ దళాధిపతులు ప్రధాని మోడీ వెంట డిండి అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం గణతంత్ర దినోత్సవ పరేడ్ చేరుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలిసారిగా రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడం విశేషం. దేశంలో రాష్ట్రపతి అయితే రెండో మహిళ ద్రౌపది ముర్ము. గతంలో ప్రతిభా పాటిల్ దేశానికి తొలి మహిళా రాష్ట్రపతి అయ్యారు. గత యేడాది జులై నెలలోనే ద్రౌపది ముర్ము రాష్ట్రపతి పదవిని చేపట్టారు.

# ఈ యేడాది నుంచే ఇంటర్ జవాబుపత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం

● లాంగ్వేజెస్, హ్యూమానిటీస్, ఒకేషనల్ సబ్జెక్టులతో ప్రారంభం

● టెండర్లకు ఇంటర్ బోర్డు నోటిఫికేషన్ జారీ ● ఫిబ్రవరి 1 ప్రీబిడ్ కాన్ఫరెన్స్

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ విద్యార్థుల వార్షిక పరీక్షల జవాబుపత్రాలను ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేయనున్నారు. ఈ ఏడాది 2022-23 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరంతోపాటు.. ద్వితీయ సంవత్సరం విద్యార్థుల జవాబు పత్రాలను ఆన్‌లైన్ ద్వారా మూల్యాంకనంను ప్రారంభించనున్నారు. ఈ ఏడాదిలో లాంగ్వేజెస్, హ్యూమానిటీస్, ఒకేషనల్ విద్యార్థుల జవాబుపత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేస్తారు. తరువాత ఏడాది 2023-24లో వీటితోపాటు సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన 50 శాతం జవాబు పత్రాలను.. ఆ తరువాత ఏడాది 2024-25 విదాన్య సంవత్సరంలో వీటితోపాటుగా మిగిలిన సైన్స్ సబ్జెక్టుల్లోని 50 శాతం జవాబు పత్రాలను కూడా ఆన్‌లైన్ ద్వారా మూల్యాంనం చేయనున్నారు. ఆన్‌లైన్ మూల్యాంకనం ద్వారా ఫలితాలను నెల రోజుల్లోనే వెలువడే అవకాశం ఉంది. అలాగే ఆన్‌లైన్ మూల్యాంకనం ద్వారా గతంలో జరిగినట్టు పాసైన వారు ఫెయిల్ కావడం.. ఫెయిల్ అయిన వారు పాస్ కావడం జరగే అవకాశం ఉండదు.

ఇంటర్ జవాబు పత్రాలను ఆన్‌లైన్ ద్వారా మూల్యాంకనం చేయడానికి టెండర్ నోటీస్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ బుధవారం జారీ చేశారు. బుధవారం నుంచే ఏజెన్సీల నుంచి టెండర్లను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఫిబ్రవరి 9 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఫిబ్రవరి 1న ప్రి బిడ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించనున్నారు. అయితే ఈ ఏడాది అన్ని సబ్జెక్టులను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేయరు. ఈ ఏడాది లాంగ్వేజెస్‌కు సంబంధించిన 20 లక్షల జవాబు పత్రాలను.. హ్యూమానిటీస్(ఆర్ట్స్ అండ్ కామర్స్)కు సంబంధించిన 10 లక్షల జవాబు పత్రాలను .. అలాగే ఒకేషనల్ విద్యార్థులకు సంబంధించిన 5 లక్షల జవాబు పత్రాలను కలిపి మొత్తంగా 35 లక్షల జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేస్తారు.

మే, జూన్-2023లో జరిగే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి సంబంధించి 12 లక్షల జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేస్తారు. వీటి ఫలితాల్లో ఎటువంటి తప్పులు లేకుండా.. అంతా సవ్యంగా జరిగితే వచ్చే ఏడాది అంటే 2023-24 విద్యా సంవత్సరంలో వీటితోపాటు సైన్స్ సబ్జెక్టుల్లో 50 శాతం జవాబు పత్రాలను కూడా కలిపి 45 లక్షల జవాబుపత్రాలను ఆన్‌లైన్ మూల్యాంకనం చేస్తారు. వాటిలోనూ సక్సెస్ అయితే.. అప్పుడు 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్, ఒకేషనల్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సంబంధించిన మొత్తం 55 లక్షల జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేపట్టనున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 35 లక్షల జవాబు పత్రాలతోపాటు అదనంగా సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన 50 శాతం జవాబు పత్రాలు 10 లక్షలు కలిపి 45 లక్షల జవాబు పత్రాలు ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేస్తారు. తరువాత సంవత్సరం 2024-25లో 45 లక్షల జవాబు పత్రాలతోపాటు అదనంగా సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన 50 శాతం జవాబుపత్రాలు 10 లక్షలు కలిపి మొత్తం 55 లక్షల జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేయనున్నారు.

**ఆన్‌లైన్ డిజిటలైజేషన్ ఇలా..**

విద్యార్థుల పరీక్షలు ముగిశాక జవాబు పత్రాలను స్కానింగ్ సెంటర్లకు పంపిస్తారు. వాటిలో పరీక్షకు హాజరైన వారు.. గైర్హాజరు అయిన వారు.. మాల్ ప్రాక్టీస్ కేసులు వేరు చేసి స్కానింగ్ చేస్తారు. వాటిని మెయిన్ సర్వర్‌కు అప్‌లోడ్ చేస్తారు. ఆన్‌లైన్ మూల్యాంకనం చేసే వారికి (ఎవాల్యూటర్) మరియు సూపర్ వైజర్‌కు యూనిక్ ఐడా, పాస్‌వర్డ్‌ను కేటాయిస్తారు.

**ఆన్‌లైన్ మూల్యాంకనానికి మార్గదర్శకాలు..**

జవాబు పత్రాలను ఆన్‌లైన్ మూల్యాంకనం చేయడానికి ఎగ్జామినర్(ఎవల్యూటర్ల)కు ప్రశ్నాపత్రాలను ఇవ్వడం.. ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలకు ఏ ప్రశ్నకు ఎలాంటి జవాబు ఉండాలి.. ఎన్ని మార్కులు ఇవ్వాలి.. అనేవి మోడల్‌గా ఇంటర్ బోర్డు ఇవ్వనుంది. వాటి ఆధారంగా ఎగ్జామినర్స్ జవాబుపత్రాలను మూల్యాంకనం చేస్తూ.. మార్కులను వేయాల్సి ఉంటుంది. ఎగ్జామినర్స్ కోరుకుంటూ వారు ఇంటి దగ్గర గానీ, కాలేజీలో గానీ ఎక్కడా సీక్రసీగా ఉంటుందని బోర్డు భావిస్తే.. వారికి అక్కడ వాల్యూయేషన్ చేయడానికి అవకాశం ఇస్తారు. గతంలో మూల్యాంకన కేంద్రాలు కొనసాగిన విధంగానే మూల్యాంకన కేంద్రాలు కొనసాగుతాయి.. అయితే గతంలో మాదిరిగా ఎగ్జామినర్లకు జవాబుపత్రాలను ఇవ్వకుండా కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లను ఇవ్వనున్నారు. వాటిలో అప్‌లోడ్ చేసిన జవాబుపత్రాలను ఎగ్జామినర్స్ మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది.

**ఏజెన్సీ చేయాల్సింది..**

ఏజెన్సీ వారు ఆన్‌లైన్ మూల్యాంకనం కోసం జవాబుపత్రాల కోసం బార్ కోడ్‌ను కేటాయించాల్సి ఉంటుంది. పరీక్షకు హాజరైన వారికి సంబంధించిన పూర్తి జవాబుపత్రాలను స్కానింగ్ చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇందుకు అవసరైన యంత్ర సామాగ్రి, టెక్నాలజీ, ఇతర సౌకర్యాలను ఏజెన్సీలే ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

## రథసప్తమికి ఆర్టీసి ప్రత్యేక బస్సులు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** రథసప్తమిని పురస్కరించుకుని ఈ నెల 28వ తేదీన భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలకు 80 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఎండి సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో హైదరాబాద్‌తో సహా జిల్లా కేంద్రాల నుండి వేములవాడ, ధర్మ పురి, యాదగిరిగుట్ట, మన్నెంకొడ, గూడెంకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు చెప్పారు. అలాగే జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మతల్లి, చిలుకూరు బాలజీ, సికింద్రాబాద్ మహంకాళి, హిమాయత్‌నగర్ బాలాజీ ఆలయాలకు ప్రధాన ప్రాంతాల నుండి 20 ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని వివరించారు. భక్తుల రద్దీ మేరకు అవసరమైతే మరిన్ని బసుసలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## టీచర్‌పై కాల్పులు జరిపిన ఆరేళ్ల బాలుడు



### పాఠశాల యాజమాన్యంపై దావాకు సిద్ధమైన బాధితురాలు

**వాషింగ్టన్, జనవరి 26:** అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో ఓ టీచర్‌పై ఆరేళ్ల బాలుడు తుపాకీతో కాల్పులు జరిపాడు. రిచ్‌నెక్ ఎలిమెంటరీ స్కూల్‌లో పని చేసే 25 యేళ్ల అబిగెయిల్ జ్వెర్నర్‌పై కాల్పులు జరపడంతో ఆమె ఛాతీలో తీవ్ర గాయమైంది. ఆ బాలుడి వల్ల ప్రమాదం ఉన్నదని టీచర్లు, విద్యార్థులు గతంలో మొరపెట్టుకున్నా పాఠ శాల యాజ మాన్యం చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. దాంతో, ఆ పాఠశాల యాజ మాన్యంపై దావా వేయాలని బాధితురాలు నిర్ణయించుకున్నారు. కాల్పుల ఘటనకు ముందు ఆరేళ్ల ఆ బాలుడు తన తోటి విద్యార్థికి తుపాకీని చూపించాడు. ఆ బాలుడి గురించి విద్యార్థి తన టీచర్లకు విషయం తెలిపాడు. ఆ విద్యార్థి తన దగ్గరున్న తుపాకీతో తోటి విద్యార్థులతోపాటు టీచర్లను బెదిరించాడు. దాంతో, వారు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. యాజమాన్యం ఈ అంశాన్ని తేలిగ్గా తీసుకుంది. దాంతో, కాల్పుల ఘటన జరిగిందని బాధితురాలి తరఫు న్యాయవాది డియానే టోస్కానో తెలిపారు. జనవరి 6న ఈ సంఘటన జరిగింది. బాధితురాలి ఛాతీలోకి తూటాలు వెళ్లడంతో ఆమెకు శస్త్ర చికిత్స చేసి బుల్లెట్లు తొలగించారు. ఆమె ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఈ సంఘటనతో పాఠశాల సూపరింటెండెంట్ జార్జి పార్కర్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. కేసు వేస్తామని న్యాయవాది చెప్పిన కొన్ని గంటల వ్యవధిలోనే పార్కర్‌ను తొలగించడం గమనార్హం. నిందితుడు మైనర్ కావడంతో అతనిపై కేసు నమోదయ్యే అవకాశం లేదు. తుపాకీని అందుబాటులో ఉంచినందుకు అతని తల్లిదండ్రులపై కేసు నమోదుకు అవకాశమున్నట్లు తెలుస్తోంది.

## ఫ్యూచర్ రిటైల్ చైర్మన్ పదవికి కిశోర్ బియానీ రాజీనామా

**ముంబయి, జనవరి 26:** కిశోర్ బియానీ అంటే అందరూ గుర్తుపట్టలేకపోవచ్చు. కానీ బిగ్‌బజార్ పేరు చెబితే చాలామంది తెలుసని తలూపుతారు. బిగ్‌బజార్ పేరుతో పట్టణాల్లో బడా షాపింగ్ మాల్స్ పెట్టి, ప్రత్యేక దినాల్లో భారీ డిస్కౌంట్ అమ్మకాలతో రిటైల్ రంగంలో ఓ సంచలనం సృష్టించిన వ్యాపారవేత్త కిశోర్ బియానీ. 1987లో మంజ్ వేర్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించిన బియానీ, పాంటలూన్ బ్రాండ్‌ను సైతం ఆవిష్కరించారు. 1991లో పాంటలూన్ ఫ్యాషన్స్ లిమిటెడ్‌గా కంపెనీ పేరు మార్చారు. 1992లో ఐపిఓ పూర్తి చేసుకున్న అనంతరం 2001లో హైదరాబాద్, కోల్‌కతా, బెంగళూరులో 22 బిగ్ బజార్ స్టోర్లు తెరిచారు. ఇక అక్కడి నుంచి ఆయన వెనుదిరిగి



చూసుకోలేదు. డిస్కౌంట్ అమ్మకాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో వినియోగదారులు బిగ్ బజార్ స్టోర్లకు పోటెత్తారు. భారీ ఆదాయాలు కళ్లచూసిన బియానీ, మన వ్యాపారానికి బ్రహ్మాండమైన ఆదరణ లభిస్తోంది. మన ప్రణాళికకు తిరుగులేదు అనుకున్నారు. స్టోర్లలో అమ్మకాల ద్వారా వస్తున్న ఆదాయం అండగా భారీగా రుణాలు తీసుకుని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున బిగ్ బజార్, ఫ్యాషన్ బజార్, బ్రాండ్ ఫ్యాక్టరీ, సెంట్రల్, ఈజీడే, ఫ్యూచర్ లైఫ్ స్టయిల్, హోమ్‌టౌన్ ఇలా గొలుసుకట్టు రిటైల్ మాల్స్ ఏర్పాటు చేసుకుంటూ సాగిపోయారు. ఇదంతా అప్పులతో చేసిన విస్తరణ. చివరికి చంద్రబాబునాయుడు కుటుంబానికి చెందిన హెరిటేజ్ రిటైల్ మాల్స్‌ను కూడా బియానీ సొంతం చేసుకున్నారు. పాత అప్పులను కొత్త అప్పులతో తీరుస్తూ, వ్యాపార విస్తరణ చేసుకుంటూ వెళ్లారు. రిటైల్ రంగానికి ఐకాన్‌గా కిశోర్ బియానీని చెబుతారు. కానీ 2018లో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ గ్రూపు కుప్పకూలిపోవడం చాలా వ్యాపారాలను దెబ్బతీసింది. మార్కెట్లో అప్పులు లభించడం కష్టంగా మారింది. తర్వాత డిహెచ్ఎఫ్ఎల్ కూడా సంక్షోభంలో పడిపోవడం, 2020లో కరోనా మహమ్మారి పడగ విప్పి, రిటైల్ దుకాణాలను మూసివేయించడం ఫ్యూచర్ రిటైల్‌కు మరణశాసనం లిఃంచాయి. ఫ్యూచర్ గ్రూపు అప్పులు రూ.24వేల కోట్లకు పెరిగిపోవడంతో చివరికి ఆయన రిలయన్స్ రిటైల్‌కు ఆస్తులు అమ్మి, గట్టెక్కాలని చూశారు. ఫ్యూచర్ రిటైల్‌లో వాటాలున్న అమెజాన్ అడ్డం తిరగడంతో ఇది సాధ్యం కాలేదు. చివరికి దివాలా పరిష్కారం కిందకు ఫ్యూచర్ కేసు వెళ్లింది. వాస్తవాన్ని అంగీకరించాల్సిందే కిశోర్ బియానీ తాజాగా చేసిన ప్రకటన ఇది. ఫ్యూచర్ రిటైల్ చైర్మన్ పదవికి ఆయన రాజీనామా చేస్తూ అన్న మాటలు. ఫ్యూచర్ రిటైల్ అనేది ఎప్పుడూ కూడా నా అభిరుచి. దీని వృద్ధికి నా వంతు పాటు పడ్డాను. నిజాన్ని అంగీకరించి ముందుకు సాగాల్సిందే అని బియానీ తన రాజీనామా పత్రాన్ని ఫ్యూచర్ రిటైల్ దివాలా పరిష్కార నిపుణుడికి పంపించారు. రాజీనామా చేసినా, అవసరమయితే ఏ సమస్య పరిష్కారానికి అయినా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటానని ప్రకటించారు.

# గాజువాకలో 45వ లలిత జ్యుయెలరీ మార్ట్ ప్రారంభం



## స్వర్ణాభరణాల సేల్స్‌లో దిగ్గజం

### టిటిడి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఎపి మంత్రి అమర్నాథ్


**విశాఖపట్నం, జనవరి 26, ప్రభాతవార్త :** పారిశ్రామికవాడ గాజువాకలో స్వర్ణాభరణాల విక్రయ దిగ్గజ సంస్థ లలితా జ్యూయలరీ మార్ట్ తన 45వ షోరూం ప్రారంభించి రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాధ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాజువాక మెయిన్‌రోడ్డులో విశాల బహుళంతస్థుల ప్రాంగణంలో ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిలుగా టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్నాధ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో లలితా జ్యూయలరీ అధిపతి కిరణ్‌కుమార్ పాల్గొని, తొలుత అతిధులకు కిరణ్‌కుమార్ ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా మంత్రి అమర్నాధ్ తొలి అంతస్థును, మేయర్ హరివెంకటకుమారి రెండో అంతస్థును ప్రారంభించారు. అనేక డిజైన్లతో రాశులు పోసిన స్వర్ణ, రజిత ఆభరణాలు కౌంటర్లను మంత్రి అమర్నాధ్, మేయర్ కలిసి ప్రారంభించారు. పారిశ్రామికవాడ గాజువాకలో స్వర్ణాభరణాల విక్రయ దిగ్గజ సంస్థ లలితా జ్యూయలరీ మార్ట్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.

ఈ నేపథ్యంలో టీటీడీ చైర్మన్, మూడు జిల్లాల ఇంచార్జ్ వై.వి.సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడుతూ హైందవ సాంప్రదాయంలో ప్రతి శుభకార్యానికి స్వర్ణం, బంగారు, అభరణాలు అవసరమన్నారు. అన్ని వర్గాల అశాలకనుగుణంగా స్వర్ణాభరణాలు విక్రయిస్తున్నందున రాష్ట్రంలోనే అగ్రగామి సంస్థగా లలితా జ్యూయలరీ నిలుస్తుందన్నారు. అనేక సంస్థలు సెలబ్రిటీలను బ్రాండ్ అంబాసిడర్‌గా పెట్టుకుంటున్న తరుణంలో కిరణ్‌కుమార్ తనదైన శైలిలో తన సంస్థకు తాను బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కించారన్నారు. కిరణ్ వాడిన డబ్బులు ఊరికే రావు అన్న నినాదం అన్ని వర్గాలకు చేరువైందన్నారు. నిజమే మరి డబ్బులు ఊరికే రావు అన్నది నగ్న సత్యంగా అందరికీ చేరువైందన్నారు. ఈ నినాదాన్ని కిరణ్‌కుమార్ తన దైన శైలిలో విలేకరుల సమావేశంలో చెప్పారు. బంగారం, వెండి ధరలను తెలిపే డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేశారు. తొలిరోజు కొనుగోలు దారులు అధిక సంఖ్యలో కొనుగోళ్లు జరిపారు. అనంతరం లలితా జ్యూయలరీ సంస్థ అధిపతి కిరణ్‌కుమార్ విచ్చేసిన అతిధులను ఘనంగా సత్కరించారు. ఈ నేపథ్యంలో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తన 50వ షోరూంను సొంతూరు నెల్లూర్లో ఏర్పాటు చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. అనంతరం 45వ షోరూం ప్రారంభోత్సవాన్ని పూర్తి చేసుకున్న తరుణంలో 46వ షోరూంను చిత్తూరులో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. దక్షిణ భారత స్వర్ణాభరణాల ప్రేమికులు చూపుతున్న ఆదరణ తన అంకితభావం కలిసి లలితను 50వ షోరూంకు చేరువు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ లలితా జ్యూలరీ అన్ని వర్గాల ప్రజలకు చేరువైందని, ప్రతి ఒక్కరి విశ్వసాన్ని లలితా జ్యూయలరీ చూరగొందన్నారు. అనంతరం గాజువాక బంగారు వర్తకుల సంఘం అధ్యక్షుడు సీతారాం (మణికంఠ జ్యూయలరీస్) కె రాంబాబు, (అంబికా జ్యూయలరీస్)తో పాటు ప్రముఖ వ్యాపార వేత్త కె దివాకర్, భీమా రావు, లక్ష్మణరావు, దామోదర్‌లు తదితరులు పాల్గొన్నారు.

# శర్వానంద్ నిశ్చితార్థ వేడుక



టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ తాజాగా ఒకేఒక జీవితం మూవీ ద్వారా ఆడియెన్స్‌ను అలరించి మంచి సక్సెస్ అందుకున్నారు. త్వరలో శ్రీరామ్ ఆదిత్యతో మరో మూవీ చేయనున్నారు. ఇదిలా ఉండగా శర్వానంద్ త్వరలో పెళ్లిపీటలు ఎక్కనున్న సంగతి తెలిసిందే. తాజాగా గురువారం హైదరా బాద్‌లో శర్వానంద్, రక్షితరెడ్డిల ఎంగేజ్మెంట్ ఎంతో గ్రాండ్‌గా జరిగింది.. పలువురు సినీ ప్రముఖులు హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. మెగాస్టార్ చిరంజీవి, సురేఖ దంపతులు పాల్గొన్నారు. త్వరలో శర్వానంద్ వివాహ వేడుక తేదీని



ప్రకటించనున్నారు.. తమ అభిమాన హీరో పెళ్లిపీటలు ఎక్కబోతుండటంతో ఫ్యాన్స్ ఆయనకు సోషల్‌మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు పెడుతున్నారు. కాగా ఈ ఈవెంట్‌కు సంబంధించి హాజరైన సెలబ్రిటీల ఫొటోలు ఇపుడు అంతర్జాలంలో వైరల్ అవుతున్నాయి.

# హీరో రక్షిత్ 'ఆపరేషన్ రావణ్'

పలాస 1978 లాంటి పీరియడ్ యాక్షన్ థ్రిల్లర్‌తో అఖండ విజయం సాధించటమే కాకుండా పలువురు చిత్ర ప్రముఖులు, విమ ర్శకుల ప్రశంసలు అందుకున్నారు. న్యూఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా కొత్త చిత్రం 'ఆపరేషన్ రావణ్'లో యువనటుడు రక్షిత్ అట్లూరి హీరోగా, సంగీర్తన విపిన్ హీరోయిన్‌గా నటిం చారు.. ఈచిత్రంలో సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్, నటుడు చరణ్‌రాజ్, తమిళ నటుడు విద్యాసాగర్ నటిస్తున్నారు.. ఈచిత్రం తో వెంకట సత్యదర్శకుడిగా పరిచయం





అవుతున్నారు.. నీ ఆలోచనలే నీ శత్రువులు అనే క్యాప్షన్‌తో రక్షిత ఉన్నఈ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేఘా అండ్ ఒమేఘా విద్యా సంస్థల వైస్‌చైర్‌పర్సన్ మాలతిరెడ్డి లాంచ్ చేశారు.. ఈ టైటిల్ పోస్టర్‌లో ఉత్కంఠంగా హైవే, సిటీ, ఇతర విజువల్స్ ఉండటం చిత్రంపై అంచనాలు కల్గిస్తోంది.. ద్యాన్ అట్లూరి నిర్మాణంలో షూటింగ్ పూర్తిచేసుకుని నిర్మాణానంతర కార్యక్రమాల్లో నిమగ్నమైన ఈచిత్రం యూనిట్ నుంచి మరిన్ని వివరాలు త్వరలో వెలువడనున్నాయి.

# ఫ్యామిలీ డ్రామా 'సోదర సోదరీమణులారా'


నూతన దర్శకుడు రఘుపతి రెడ్డి రచన, దర్శకత్వంలో కమల్ కామరాజు, అపర్ణాదేవి ప్రధాన పాత్రల్లో 9 ఇఎం ఎంటర్‌టైన్‌మెంట్స్, ఐఆర్ మూవీస్ బ్యానర్లు సంయుక్తంగా విజయ్ కుమార్ పైండ్ల నిర్మిస్తున్న చిత్రం సోదర సోదరీమణులారా.. ఆకట్టుకునే టైటిల్‌తో రూపొందిన ఈచిత్రం ఇటీవల చిత్రీకరణ పూర్తిచేసుకుంది. పక్కా స్క్రిప్టుతో పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో 35రోజుల్లో



తెరకెక్కిన ఈచిత్రం హార్ట్ టచింగ్ ఫ్యామిలీ డ్రామాగా ప్రేక్షకులను అలరించనుంది.. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలుతెలుపుతూ యూనిట్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది.. సిస్టర్స్ అండ్ బ్రదర్స్ టాగ్‌లైన్‌తో కమల్ కామరాజు, అపర్ణాదేవి ఎమోషనల్ లుక్‌తో ఉన్న ఈచిత్రం ఫస్ట్‌లుక్ చూడాగానే ఆకట్టుకుంది.. టైటిల్ పోస్టర్‌తోనే అందరూ అన్వయించుకునే పాత్రలతో రియాలిస్టిక్ డ్రామాగా ఈసినిమా ఉండనుంది అనే ఫీలింగ్ కల్గిస్తోంది.. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈచిత్రాన్ని సమ్మర్‌లో విడుదల చేయనున్నారు. సిట్యువేషన్ పరంగా వచ్చే 3 పాటలున్న ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.

# 'విక్టరీ' వెంకటేష్ 'సైంధవ్' ప్రారంభం

విక్టరీ వెంకటేష్ 75వ ల్యాండ్ మార్క్‌మూవీ 'సైంధవ్'. గురువారం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో ప్రముఖుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది.. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి ప్రతిష్టా త్మకంగా నిర్మిస్తున్నారు. ఈచిత్రానికి శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు.. హీరో నాని, రానా దగ్గుబాటి, నాగ





చైతన్య, నిర్మాత సురేష్‌బాబు, దిల్ రాజు, కె.రాఘవేంద్ర రావు, నిర్మాతలు మైత్రీ నవీన్, శిరీష్, వైరా మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్‌రెడ్డి, ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ అనిల్ సుంకర, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల, 14రీల్స్ ప్లస్ గోపీ ఆచంట, దర్శకుడు విమల్‌కృష్ణ, షైన్‌స్క్రీన్ నిర్మాత సాహు గారపాటి, ఎస్‌ఎల్‌వి సినిమాస్ సుధాకర్ చెరుకూరి, బండ్ల గణేష్, సితార నాగవంశీ, డైరెక్టర్ బి.గోపాల్, ఎంఎస్ రాజు, నిర్మాత బెల్లంకొండ సురేష్, జెమినీ కిరణ్, జీసినిమాస్ ప్రసాద్ నిమ్మకాయల, రంజిత్ మూవీస్ దామోదర్ ప్రసాద్, క్లాసిక్ సుధీర్, నిజాం శశి ఈచిత్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. రానా దగ్గుబాటి, నాగచైతన్య, సురేష్‌బాబు స్క్రిప్టును మేకర్స్‌కు అందించారు. కె.రాఘవేంద్రరావు క్లాప్ బోర్డ్ ఇవ్వగా, దిల్‌రాజు కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి సన్నివేశానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. సైంధవ రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.. తాజాగా విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు మంచి స్పందన వచ్చింది.. యూట్యూబ్‌లో టాప్ ట్రెండింగ్‌లో ఉన్న వీడియో భారీ అంచనాలను నెలకొల్పిం ది..సైంధవ భారీ స్థాయిలో రూపొందనుంది.. ఇది వెంకటేష్ కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్ చిత్రంగా నిలవనుంది, ఇతర నటీనటుల వివరాలను త్వరలో మేకర్స్ ప్రకటించనున్నారు. అన్ని దక్షిణాది భాషలతో పాటు హిందీలోను విడుదల కానుంది.

vaartha.com





న్యూ ఈవెంట్ లుక్ రకుల్‌ప్రీత్‌సింగ్, సోనాల్ చౌహాన్

**టాలెంటెడ్ యాక్టర్ సుహాస్ హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రైటర్ పద్మభూషణ్.. నూతన దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వం వహించిన ఈచిత్రంలో టీనా శిల్పరాజ్ హీరోయిన్.. ఛాయ్‌బిస్కెట్ ఫిల్మ్స్, లహరి ఫిల్మ్స్ బ్యానర్లపై అనురాగ్‌రెడ్డి, శరత్‌చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించిన ఈచిత్రాన్ని జి.మనోహర్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన రైటర్‌పద్మభూషణ్ ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. ఫిబ్రవరి 3న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈనేపథ్యంలో సుహాస్‌తో ఇంటర్వ్యూ విశేషాలు..**

# 'రైటర్ పద్మభూషణ్' అందరికీ కనెక్ట్ అవుతాడు



**ఈచిత్రం ప్రయాణం ఎలా మొదలైంది?**

ప్రశాంత్ కలర్ ఫొటో సినిమాకు సహాయ దర్శకుడు.. తర్వా త ఫ్యామిలీ డ్రామా అనే సినిమా చేశాను.. దానికి ప్రశాంత్ రైటర్.. తను అలా పరిచయం.. కలర్‌ఫొటో తర్వాత ఈ కథ చెప్పాడు.. చాలా ఎక్సయిట్ అయ్యాను.. నిర్మాతలు అనురాగ్, శరత్‌కి చెప్పాం..వారు ఎక్సయిట్ అయి వెంటనే తెరకెక్కించారు.

**అంత ఎక్సయిట్ అయిన పాయింట్ ఏంటి?**

సినిమా అంతా చాలా ఎక్సయిటింగ్‌గా ఉంటుంది. ముఖ్యం గా క్లైమాక్స్‌కు అందరూ కనెక్ట్ అవుతారు.. రైటర్ పద్మభూషణ్ కచ్చితంగా ఎంటర్‌టైన్ చేస్తాడు. ఇందులో అనుమానమే లేదు.

**ఈచిత్రంలో సస్పెన్స్ ట్విస్ట్ ఎలిమెంట్స్ ఉంటాయా?**

ఉంటాయి.. ఫస్టహాఫ్‌లో రెండు, సెకండాఫ్‌లో మూడు ట్విస్టులు వస్తాయి. క్లైమాక్స్‌లో ఇంకా మంచి ట్విస్ట్ ఉంటుంది. ప్రతి మలుపుని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు.

**కొత్త దర్శకులతో పనిచేయటం రిస్క్ కదా?**

నేను కొత్తవాడినే కదండీ.. ఛాయ్‌బిస్కెట్‌లో కొత్తవాళ్లు రాసిన స్క్రిప్టులతోనే నాకు పేరు, అవకాశాలు వచ్చాయి.. వాళ్ల కథలు బావుంటాయి.. ప్రేక్షకులకు నచ్చుతాయనే నమ్మకం ఆశతో మేం అంతా ఒక టీంగా ప్రయాణం చేస్తున్నాం.

**చెప్పిన టైం కంటే ముందే సెట్స్‌లో ఉంటారట కదా?**

కొంచెం ముందే వెళ్లిపోతే పనులు సరైన సమయంలో జరుగుతాయి.. హను రాఘవపూడి, శివ నిర్వాణ లాంటి దర్శకులతో పనిచేస్తున్నపుడు అది అలవాటైంది.. వాళ్లు ఉదయం 5 గంటలకే సెట్‌లో ఉంటారు. అలా ఉండటం వలన పనులు ఫాస్ట్‌గా నడుస్తాయి.. ఈసినిమాకు 60 రోజులు అనుకున్నాం.. కానీ 43రోజుల్లోనే పూర్తిచేశామంటే దానికి కారణం ఇదే..

**ఇది మీ మొదటి థియేటర్ రిలీజ్ మూవీ... ఇంకా విడుదల కాకముందే చాలా సినిమాలు లైన్‌లో పెట్టినట్టు ఉన్నారు?**

తర్వాత సినిమా గీతా ఆర్ట్స్ 2లో వస్తోంది. షూటింగ్ పూర్తయింది.. తర్వాత ఆనందరావు అడ్వంచర్స్ అనే మరో సినిమా చేస్తున్నాను.. అన్ని మంచి కథలు.. త్వరగా పర్తిచేసి ప్రేక్షకులకు చూపించాలనే ఎక్సయిట్‌మెంట్ ఉంది.

**ఈ కథకునిర్మాతలను మీరు ఒప్పించారా? లేదా దర్శకుడా?**

కంటెంట్ తనదే కాబట్టి ఆ బాధ్యత తనపైనేఉంటుంది.. అయితే నేను ఒక సోర్స్‌గా మాత్రమే ఉన్నాను.. మా హోం బ్యానర్ కాబట్టి ఒకసారి కథ వినండని చెప్పాను.. ఈ కంటెంట్‌కి ఎవరైనా ఎక్సయిట్ అవుతారు.. చాలా మంచి కంటెంట్.. ట్రైలర్‌లో చెప్పనిది ఒకటి సినిమాలో వస్తుంది. సినిమా చూసిన తర్వాత అది అర్థమవుతుంది.

**మీ కథలను ఎలా జడ్జ్ చేస్తారు?**

దీని కోసం పెద్ద ఆలోచించి లెక్కలు వేసుకోవటం ఉండదు.. కథ వింటున్నపుడు నేను ఎలా ఎంజాయ్ , ఎక్సయిట్ అవుతున్నానో చూస్తాను. డబ్బులు పెట్టే నిర్మాతలకు కూడ అదే ఎక్సయిట్‌మెంట్ ఉందో లేదో చూసుకుంటాను.. ఇలా అందరూ ఉత్సాహంగా ఉంటేనే చేయొచ్చనే నమ్మకం వస్తుంది..

**మీరు చేసిన చిత్రాల్లో బాగా నచ్చిన చిత్రాలు?**

కలర్‌ఫొటో, నా కెరీర్‌కి ఒక టర్నింగ్ పాయింట్.ఆ సినిమా చాలా ఇష్టం. అలాగే తెరపై నన్ను నేను చూసుకున్న చిత్రం మిజిలీ.. అలా తెరపై చూసుకోవటంలో ఆ ఆనందమే వేరు

**ఈచిత్రం గురించి ప్రేక్షకులకు ఏం చెబుతారు?**

ప్రేక్షకులు కచ్చితంగా ఎంటర్‌టైన్ అవుతారు. హెవీ హార్ట్ ఫీలింగ్‌తో మంచి చిరునవ్వుతో బయటకు వస్తారు.. మంచి సినిమా చేశారని అభినందిస్తారు. ఇందులో ఎలాంటి అనుమానం లేదు.

# 'దర్శకేంద్రుడు' నిర్మాణంలో 'సర్కారు నౌకరి'

దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు నిర్మాతగా ఆర్‌కె టెలీషో ప్రై.లి. బ్యానర్‌పై గంగనమోని శేఖర్ దర్శకత్వంలో సర్కారు నౌకరి.. అనే నూతన చిత్రం ప్రారంభోత్సవ కార్యక్రమం సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా నూతన నటి భావనా వళపండల్ హీరోయిన్‌గా ఈచిత్రం ద్వారా వెండితెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్ నిర్మాత ప్రసాద్ నిమ్మకాయల, కెమెరా స్విచ్చాన్ చేశారు. మ్యాంగో మీడియా అధినేత,



గాయని సునీత భర్త రామ్ వీరపనేని గౌరవదర్శకత్వం వహించారు.. దర్శకేంద్రుడు కె.రాఘవేంద్ర రావు దేవుడిపటాలపై క్లాప్ ఇచ్చారు. అనంతరం హీరో, హీరోయిన్లపై తీసిన తొలిషాట్‌కు కె.రాఘ వేంద్రరావు దర్శకత్వం వహించగా, గాయని సునీత కెమెరా స్విచ్చాన్ చేశారు.. ఫిబ్రవరి 6 నుంచి నిరవధికంగా షూటింగ్ జరుపుకోనున్న ఈచిత్రంలో ఆకాష్, భావనా వళపండల్ , తనికెళ్లభరణి, సూర్య సాయి శ్రీనివాస్ వడ్లమాని, మణిచందన, రాజేశ్వరరి ముళ్లపూడి, రమ్య పొందూరి , త్రినాధ్ తదతరులు నటిస్తున్నారు.

# సత్యదేవ్ పాన్‌ఇండియా మూవీ 'జీబ్రా'



వెర్సటైల్ హీరో సత్యదేవ్, కన్నడ స్టార్ డాలీ ధనంజయ కలిసి ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చేస్తున్నారు.. సత్యదేవ్, డాలీ ధనంజయ ఇద్దరికీ ఇది 26వ ప్రాజెక్టు.. కాగా రిపబ్లిక్ డే సందర్భంగా గురువారం ఈచిత్రం టైటిల్‌ను మేకర్స్ ప్రకటించారు.. ఈచిత్రానికి జీబ్రా అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారుచేశారు. టైటిల్ లోగోకు స్పీడోమీటర్ అమర్చబడి ఉంది.. దీనిలో చెస్ ఫీనస్ వైట్ నైట్, బ్లాక్ నైట్ లని కూడ గమనించవచ్చు.. చెస్ ఆటలో నైట్ ఒక తెలివైన మూవ్.. టైటిల్ మాదిరిగానే టైటిల్ పోస్టర్ కూడ ఆకట్టుకునేలా ఉంది.. ఇది తప్పకుండా సినిమాపై ఆసక్తిని కల్గిస్తోంది.. పద్మజ ఫిలింస్ ప్రై.లి. ఓల్డ్ టౌన్ పిక్చర్స్ పతాకాలపై ఎస్‌ఎన్‌రెడ్డి , బాల సుందరం, దినేషన్ సుందరం నిర్మిస్తున్న ఈచిత్రంలో ప్రియా భవానీశంకర్, జెనిఫర్ పిచనెటో హీరోయిన్లుగా నటిస్తున్నారు. వెటరన్ యాక్టర్ సత్యరాజ్ ఈసినిమాలో కీలకపాత్రలో నటిస్తున్నారు.. సత్య ఆకల, సునీల్ ఇతర ముఖ్యపాత్రల్లో కన్పించనున్నారు. టీం 50 రోజుల మొదటి షెడ్యూల్‌ను పూర్తిచేసింది.. మిగిలిన షూటింగ్ హైదరాబాద్, కోల్‌కతా, ముంబై ప్రాంతాల్లో ప్లాన్ చేశారు.. ఈ పాన్‌ఇండియన్ మూవీ కోసం మేకర్స్ మోస్ట్ వాంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్‌ను ప్రాజెక్టులో పనిచేస్తున్నట్టు ప్రకటించారు.. రవి మ్యూజిక్ చిత్రాన్ని మరోస్థాయికి తీసుకెళ్తుందని, అతని మ్యూజిక్ సినిమా పోల్ అని ఎస్‌ఎన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో బాలసుందరం, సహనిర్మాత సుమన్ ప్రసార బాగే ఉన్నారు. ఈపాన్ ఇండియా మూవీ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది.

# సెన్సేషనల్ రికార్డు సొంతం



బాలీవుడ్ బాద్షా షారుఖ్‌ఖాన్ హీరోగా దీపికా పదుకొనే హీరోయిన్‌గా తెరకెక్కిన చిత్రం పఠాన్. .భారీ యాక్షన్ థ్రిల్లర్ మూవీగా తెరకెక్కింది.. ఈచిత్రంలో మరోబాలీవుడ్ నటుడు జాన్ అబ్రహం ఇందులో విలన్‌పాత్రలో నటించారు. యష్ రాజ్ ఫిలింస్ అత్యంత భారీస్థాయిలో నిర్మించింది.. సిద్ధార్థ ఆనంద్ ఈచిత్రానికి దర్శకత్వం వహించారు. అందరిలో మొదటి నుంచి భారీ అంచనాలు ఏర్పడిన ఈచిత్రం అత్యధికంగా 8వేల స్క్రీన్స్‌లో ప్రపంచ వ్యాప్తంగా సినీ అభిమానులకు చేరువైంది.. ఇక్కడ ఫస్ట్‌డే షో నుంచి సూపర్ డూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది.. ఈమూవీ ఈనెల 24 అర్ధరాత్రి 12.30కు స్పెషల్ షో అని కూడ అదనంగా ప్రదర్శించనున్నారు.. ఈ స్పెషల్ షోలను పఠాన్ బయ్యర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది..

# గణతంత్ర దినోత్సవ వేడుకలో మహిళలు



ఈ మట్టి మీద మమకారాన్ని చాటుకొనే అద్భుతమైన క్షణాలవి. దేశభక్తినిగుండెలనిండా నింపుకొని మువ్వన్నెల జెండాని గర్వంగా ఎగరేసే ఆ వేదికపై.. ఈ సారి నారీశక్తి తనని తాను సగర్వంగా చాటుకుంటోంది. ఈ దేశం కోసం మేమున్నాం అంటున్న మహిళాశక్తిలో మన తెలుగమ్మాయీ ఉంది.

**చిన్ననాటి స్ఫూర్తితో...** చిన్నతనంలో టీవీలో చూసిన గణతంత్ర దినోత్సవ వేడుక లనే స్ఫూర్తిగా తీసుకుని నేడు భారత వైమా నికి దళానికి సారథ్యం వహిస్తోంది తెలుగ మ్మాయి. స్క్వాడ్రన్ లీడర్ సింధురెడ్డి. 'అమ్మ సహోద్యోగి భారత వాయుసేనలో ఉండేవారు. అలా అమ్మతో కలిసి బెంగ ళూరులో వైమానికదళం నిర్వహించే ప్రదర్శ నలకు వెళ్లేదాన్ని ఆకాశంలో విమానాల విన్యాసాల చూసి నాకూ గాలిలో అలా విమానాలతో విన్యాసాలు చేయించాలనే ఆశ ఉండేది. ఆ కోరిక నేడిలా తీరుతోంది. వైమానికి దళంలో అడుగుపెట్టాక యుద్ధ హెలికాప్టర్లను నడపడం గర్వంగా ఉండేది. ఈ గణతంత్ర దినోత్సవంలో పాల్గొనే అర్హతను సాధించినప్పుడు చిన్నప్పట్నుంచీ నేను చూసిన గణతంత్ర దినోత్సవ వేడుకల వీడియోలు నా కళ్లముందు మెదిలాయి. 144 మంది ఉండే ఈ బృందంలో మరో ముగ్గురు మహిళా ఆఫీసర్లు కూడ ఉన్నారు. వీరందరినీ ముం దుండి నడిపించే అవకాశాన్ని అందుకోవడం ఓ మహిళగా గర్వంగా భావిస్తున్నా. ఢిల్లీలో ఒక డిగ్రీ ఉష్ణోగ్రతలో వేకువజామున 3 గంటలకు రిహార్సల్ చేయడం మామూలు విషయం కాదు. అయితే పరేడ్ని నడిపించే బాధ్యత ముందు అవేవీ గుర్తుకు రాలేదు. బెస్ట్ మార్చ్ కంటింజెంట్ ట్రోఫీ తీసుకోవాలనే లక్ష్యంతో కష్టపడ్డా. ఈ రంగంలోకి నేను అడుగు పెట్టేట ప్పటికీ, ఇప్పటికీ పరిస్థితి మారింది. అమ్మాయి లకూ అవకాశం చిక్కుతోంది. వైమానిక దళం లో లింగ వివక్షతకు చోటు లేదు. సమాన అవకాశాలున్నాయి ఏ రంగంలోనైనా స్థానాన్ని సంపాదించగల సత్తా మనలో ఉంది. స్పష్టంగా ఓ లక్ష్యం దిశగా అడుగు వేయ గలిగితే చాలు. అనుకున్నది సాధించగలం.

**శత్రు విమానాల భరతం పడుతూ..** వాయు క్షిపణి వ్యవస్థ గొప్పతనాన్ని చాటుతూ లెఫ్టినెంట్ చేతనాశర్మ నేతృత్వంలో జరగనున్న ప్రదర్శన మరోసారి మహిళాశక్తిని చాటనుంది. 'శత్రు విమానాలు, డ్రోన్లను పసిగడుతూ, గగనతల రక్షణలో కీలకమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నా. క్షిపణి దళాలకు నేతృత్వం వహించే అవకాశం అందుకోవడం నా అదృష్టం' అంటున్న శర్మది ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ ఎజిమెంట్ యూనిట్. భోపాల్ నిట్లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. చిన్నప్పటి నుంచి దేశరక్షణలో పాలుపంచుకోవాలను ఆశయాన్ని నెరవేర్చుకున్నారీమె.





**14 ఏళ్ల కల ....** 'నేను మహిళా లెఫ్టినెంట్ కమాండర్ను కాదు.. మగవారితో సమానంగా విధులు నిర్వహిస్తున్న లెఫ్టినెంట్ కమాండర్ను' అనే 29 ఏళ్ల దిశా అమృత్ ఈ గణతంత్ర దినోత్సవాల్లో 144 ముందున్న నౌకాదళ కవాతు బృందానికి నేతృత్వం నేతృత్వం వహిచ్చారు.. 'మాది మంగళూరు. సాయుధ దళాల్లో చేరి దేశసేవకు అంకితమవ్వాలన్నది నాన్న కల. అది తీరలేదు. కానీ ఆయన మాటలు వింటూ పెరిగిన నేను దేశసేవలో అడుగుపెట్టాలకున్నా. సాయుధ దళాల్లో చేరాలనే కలతో ఎన్సిసి క్యాడెట్గా చేరా. కర్ణాటకలో కంప్యూటర్ సైన్స్ పూర్తిచేశా. ఆ తర్వాత ప్రవేశ పరీక్ష రాసి నావికాదళంలో చేరి. అండమాన్ నికోబార్ నావిక, వైమానికి కార్యకలాపాల అధికారికా బాద్యతలు నిర్వరిస్తున్నా. 2008లో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ రిపబ్లిక్ టీంలో పాల్గొన్నా. అప్పట్నుంచీ నావికాదళానికి నాయకత్వం వహించాలన్నది నా కల. అదిలా 14 ఏళ్లకు నెరవేరుతోంది' అంటున్న దిశాతోపాటు ఈ ప్రదర్శనలో ప్లటూన్ కమాండర్స్‌గా మరో ఇద్దరు మహిళా లెఫ్టినెంట్‌లూ ఉన్నారు.



**గగుర్పొడిచే విన్యాసాలతో...** ఆయుధాలతో, ద్విచక్రవాహనాలపై విన్యాసాలు చేయడం తనకిష్టమంటారు టెఫ్టినెంట్ డింపుల్ భాటియా. 'డేర్ డెవిల్స్‌గా.. సాహసపూరితమైన ప్రదర్శ నలతో మహిళాశక్తిని చాటడమే మా ధ్యేయం. విన్యాసాలు ప్రదర్శించడంలో మా బృందానికి చక్కని అనుభవం ఉంది. ఈ ఏడాదీ అవకాశం దక్కడం మా అదృష్టం' అంటున్న డింపుల్ 2021 బ్యాచ్‌లో చెన్నై ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీ శిక్షణ ముగించుకు న్నారు. శిక్షణ సమయంలో చేసిన సాహసాలకు వెండిపతకాన్ని కూడా అందుకున్నారు.




**ఒంటెలపై కవాతు...** బిఎస్ఎఫ్‌కు చెందిన 12 మంది మహిళలు మొదటిసారి ఒంటెలపై కవాతు నిర్వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వీరంతా తమ రాష్ట్రాల సంస్కృతి, కళలు, ప్రతిబింబించేలా జర్దోసీ కళ అద్దిన ప్రత్యేకమైన యూనిఫాంని. మేవాడ్ రాజసం ఉట్టిపడేలా తలపాగాలు ధరిస్తారు. ఈ పెరేడ్ కోసం మూడునెలలు ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు వీరంతా. ❑

# గుండెను మారుస్తూనే ఉంటారు..



నా గుండె ఆగిపోతుందని అనుకున్నప్పుడల్లా గుండె మార్పిడి శస్త్రచికిత్స జరుగుతుంటుంది. మీరు చదివింది నిజమే. ఇప్పటికి రెండు సార్లు అలా మార్చారు. డైలేటెడ్ కార్డియోమయోపతీ అనే వ్యాధితో పుట్టిన నన్ను అమ్మానాన్న చాలా గారబంగా పెంచారు కండరాల్లో రక్తసరఫరాకు ఆటంకం కలిగి, గుండె పూర్తిగా ఆగిపోతుంది. అప్పుడు ఎవరైనా అవయవ దానం చేస్తే బతుకుతుంటా. ఈ రోజు నేనిలా మీ ముందుండటానికి కారణమైన అవయవ దానంపై అందరికీ అవగాహన కలిగించాలన్నదే నా లక్ష్యం. అలాగే దీనికయ్యే ఖర్చునూ పేదలు తట్టుకోలేరు. అటువంటివారికి తిరిగి జీవితాన్ని అందించడం కోసం 2011లో 'లైట్ ఏ లైఫ్' ఛారిటబుల్ ట్రస్టును స్థాపించా. దీని ద్వారా పేద రోగులకు అవయవ దానంతో పాటు ఆర్థికసాయమూ అందేలా కృషి చేస్తున్నా. చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఇష్టం. దీంతో గుండెమార్పిడి జరిగిన కొన్ని నెలల్లోనే వైద్య నిపుణుల సలహాతో బ్యాడ్మింటన్, సైక్లింగ్ వంటి క్రీడలను సాధన చేస్తుంటా. ఏటా అవయవ మార్పిడి జరిగేవారు పాల్గొనే వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్‌లోనూ ఉంటా. దేశ విదేశాల్లో పలుపోటీలు, మారథాన్‌లలోనూ పాల్గొని అవయవదానంపైనా.. గుండె మార్పిడి తర్వాత మంచి జీవనశైలితో ఆరోగ్యంగా ఉండొచ్చని అవగహన కలిగిస్తున్నా. మనకు దక్కిన విలువైన ఈ ఒకే ఒక్క జీవితాన్ని ఆపన్నులకు సాయం కోసమై ఉపయోగించాలన్నదే నా ఆశయం. చివరి శ్వాస వరకు పేద రోగులకు ఆర్థిక చేయూత నందించడానికి కృషి మాత్రం ఆపను. ❑

# మెడపై నెక్లెస్‌లా..



ఎక్కువగా ఫోన్ వాడేవాళ్లు.. మ్యూజిక్ ప్రియులు ఆలోచించేది రెండే రెండు. ఇయర్ ఫోన్ ఏది మంచిది ఏ హెడ్‌సెట్ వాడొచ్చు? అందుకే ఇవి.. బడ్జెట్‌లో మెడపై నెక్లెస్‌లా వాలిపోయి చెవుల్లో చక్కగా బదిగిపోతాయి. హెచ్‌డి క్వాలిటీతో.. ఫోన్ మాట్లాడటంతో పాటు హెచ్‌డి స్టీరియో క్వాలిటీతో మ్యూజిక్ వినొచ్చు. తక్కువ బరువుతో మెడకు చుట్టుకుని ట్రెండీగా కనిపిస్తుంది. వినసొంపైన బాస్, ట్రిబుల్ దీంట్లో ప్రత్యేకం. బిల్ట్‌ఇన్‌గా ఏర్పాటు చేసిన మైక్‌తో మీరు మాటలు అవతలి కాలర్‌కి స్పష్టంగా వినిపిస్తాయి. బ్లూటూత్‌తో ఫోన్‌కి కనెక్టుచేసి 30 అడుగులు పరిధిలో వాడుకో వచ్చు. ఒక్కసారి చార్జ్‌చేస్తే 10 గంటలు పనిచేస్తుంది. ఒకేసారి రెండు ఫోన్‌లకు ఇయర్‌ఫోన్‌ని అనుసంధానం చేయొచ్చు (డ్యుయల్ పెయిరింగ్). అవసరం లేనప్పుడు ఇయర్‌ఫోన్‌లు లోపల ఉన్న అయస్కాంతంతోరెండు అతుక్కుంటాయి. దీంతో మెడపై ఎలాంటి అసౌకర్యం కలగదు. ఒకే ఒక్క బటన్‌ని నొక్కితే చాలా. ఫోన్‌తో జతకట్టేస్తుంది. ❑

# గ్లిజరిన్‌తో చర్మసొగసు




చలిగాలుల ప్రభావానికి చర్మం సహజత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. గ్లిజరిన్‌తో ముఖాన్ని మెరిసేలా చేయొచ్చు అంటున్నారు నిపుణులు. చర్మాన్ని గ్లిజరిన్ పొడారకుండా సంరక్షించగలదు. ముందుగా మాఖాన్ని మురికి లేకుండా శుభ్రపరచాలి. ఆ తర్వాత గ్లిజరిన్‌లో ముంచిన దూది ఉండతో ముఖాన్ని మృదువుగా తుడవాలి. కన్ను, నోటి వద్ద కాకుండా మిగతా భాగాన్ని మాత్రం తుడిచి పూర్తిగా ఇంకే మరకు ఆరనిస్తే చాలు. ఇది మాయిశ్చ రూజర్‌గా పనిచేయ డమే కాకుండా చర్మరంధ్రాల నుంచి చలిగాలులకు నీరు ఆవిరవ్వకుండా కాపాడి తేమగా ఉంచుతుంది.

**క్లెన్సర్‌గా....** మూడు చెంచాల పాలకు చెంచా గ్లిజరిన్ కలిపి ముఖానికి రాసి ఆరనిచ్చి రాత్రంతా వదిలేయాలి. ఉదయం చల్లని నీటితో కడిగితే ముఖ చర్మ రంధ్రాల్లో మురికి దూరమవుతుంది. బయటికెల్లొచ్చిన తర్వాత ముఖంపై పేరుకొన్న దుమ్ము, ధూళిని దూరం చేయడానికి, అలాగే మేకప్‌ను శుభ్రపనరచ డానికీ ఇది ఉపయోగపడుతుంది. అరకప్పు నీటిలో చెంచాన్నర గ్లిజరిన్, మూడు చెంచాల మొక్కజొన్న పిండి కలిపి చిక్కగా అయ్యేవరకు ఉడికించి చల్లార్చాలి. ఈ పేస్టును ముఖానికి రాసి తడీ పొడిగా ఉన్నప్పుడు గోరువెచ్చని నీటితో కడిగితే చాలు. ముఖచర్మంపై మురికి పోయి అద్దంలా మెరుస్తుంది.

**టోనర్‌గా..** ముఖాన్ని శుభ్రపరచిన తర్వాత కప్పు నీటిలో రెండు చెంచాల గ్లిజరిన్ కలిపిన మిశ్రమంతో ముఖాన్ని కడిగితే చాలు. చర్మ రంధ్రాలను మూసుకొనేలా చేసి చర్మాని బిగుతుగా మారుస్తుంది. పావుకప్పు గ్లిజరిన్‌కు కప్పున్నర గులాబీ నీటిని కలిపి ముఖాన్ని కడిగినా చాలు. మంచి టోనర్‌గా మారుతుంది. అలాగే సమపాళ్లలో పెట్రోలియం జెల్లీ, గ్లిజరిన్, విటమిన్ ఈ ఆయిల్ కలిపి స్నానానికి ముందు ముఖానికి అప్లై చేసి పది నిమిషాలు ఆరనివ్వాలి. ఆ తర్వాత స్నానం చేస్తే ముఖచర్మం పొడారకుండా మృదువుగా మెరుపులీనుతుంది.

**యాంటీఏజింగ్‌గానూ....** ముఖంపై వచ్చే వృద్ధాప్య ఛాయలు, ముడతలు, గీతలను గ్లిజరిన్ తగ్గించు కోవచ్చు. ఒక గుడ్డు తెల్లసొనను గిన్నెలో వేసి చెంచా చొప్పున తేనె, గ్లిజరిన్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్ర మాన్ని మూఖానికి, మెడకు పుట్టించి 20 నిమిషాల తర్వాత చల్లని నీటితో కడిగితే చాలు. ఇలా వారానికి రెండు లేదా మూడుసార్లు చేస్తే ముఖంపై గీతలను దూరం చేయొచ్చు. అలాగే చెంచా ముల్తానీ మట్టికి నాలుగుచెంచాల బాదం పొడి, రెండు చెంచాల గ్లిజరిన్ కలిపిన మిశ్ర మాన్ని ముఖానికి రాసి ఆరనిచ్చి కడిగితే మొటిమల వల్ల వచ్చే మొండి మచ్చలను మాయం చేయొచ్చు. ❑

# బీట్‌రూట్ రైస్ బాల్స్



కావలసినవి : 1. బీట్‌రూట్ జ్యూస్-ముప్పావు కప్పు , రైస్ పౌడర్- అర కప్పు జొన్నపిండి-1 టేబుల్ స్పూన్, ఉప్పు-తగినంత

**తయారీ :** ముందుగా బీట్‌రూట్ జ్యూస్‌లో కొద్దిగా ఉప్పు వేసుకుని.. చిన్న మంట మీద మరిగించాలి. అనంతరం రైస్ పౌడర్ వేసి గరిటెతో తిప్పుతూ ఉండాలి. దగ్గర పడే సమయంలో మళ్లీ జొన్నపిండి వేసి తిప్పుతూ ఉండాలి. బాగా దగ్గర పడిన తర్వాత చల్లార్చి.. చేతులకు నూనె రాసుకుని.. చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. వాటిని ఆవిరిపై బాగా ఉడికిచుకుని.. కారంగా కావాలంటే పచ్చిమిర్చి, కొత్తిమీర పసుపు, జీలకర్ర , ఆవాలు, కారం, కొద్దిగా ఉప్పువేసుకుని తాలింపు పెట్టుకోవచ్చు. తీపిగా కావాలంటే కొబ్బరి కోరు, బెల్లంకోరు బాగా కలుపుకుని.. అందులో ఈ ఉండలను వేసుకుని సర్వ్ చేసుకోవచ్చు. ❑

# దీంతో మరకలు మాయం



వంటచేసే హడావుడిలో.. ఆహార పదార్థాలు చెల్లాచెదురు అవుతాయి. నూనె, పాలూ వంటి ద్రవ పదార్థాలు ఒలుకుతూ ఉంటాయి. ఇలాంటప్పుడు వాటిని క్లాత్‌తో తుడవడం, తిరిగి దాన్ని శుభ్రపరచడం వంటి పనులు ఎక్కువ సమయం తీసుకుంటాయి. పైగా ఓ పట్టాన వాటి తాలూకు వ్యర్థాలూ, జిడ్డూ వదలవు. అయితే ఇప్పుడా బాధ అక్కర్లేదు మైక్రోఫైబర్‌తో తయారు చేసిన కిచెన్ క్లాత్‌లు ఈ సమస్యని తీరుస్తున్నాయి. ఇవి నీటిని ఇట్టే పీల్చుకుంటాయి. జిడ్డుని గ్రహించవు. కాబట్టి వీటిని వినియోగిం చడం చాలా సులువు. ❑

# ఆదరణే ఔషధమని గుర్తించండి!

**ప్రశ్న:** మా అమ్మను చావు భయం వెంటాడుతున్నది. 55 ఏళ్ళ వయస్సుకే ఆమెలో చనిపోతానన్న భయం కలుగుతున్నది. దీంతో బాగా దిగులుపడి క్షీణించిపోతున్నది. రాత్రి పూట సరిగా నిద్రపట్టడం లేదు. పగలు ఎవరితోనైనా మాట్లాడుతున్నప్పుడు కొంత బాగుంటుంది. ఒంటరిగా వున్న సమయంలో చనిపోతానన్న ఆలోచనలు కలవరపరుస్తుంటాయి. రెండేళ్ళ క్రితం అమ్మ, నాన్న ఇద్దరికి కొవిడ్ వచ్చింది. నెల రోజులు చికిత్స చేసినా నాన్నను బ్రతికించుకోలేక పోయాం. అమ్మ అతి కష్టం మీద కోలుకున్నది. అన్నయ్య అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. కొవిడ్ నిబంధనల వల్ల నాన్న చనిపోయినపుడు అన్నయ్య రాలేకపోయారు. తరువాత ఒకసారి వచ్చి ఇక్కడే పదిరోజులు ఉండి అమ్మను ఓదార్చి అవసరానికి సరిపడా డబ్బు ఇచ్చి వెళ్ళారు. ఒంటరిగా ఉంటే మరింత దిగులు పడుతుందని చెప్పి మా ఇంటికి తీసుకొచ్చాం. నేను, నా భర్త ఉద్యోగాలు చేస్తున్నందును ఉదయం వెళ్ళి సాయత్రం వస్తాం. మా పదేళ్ల పాప కూడ ఉదయం స్కూలుకు వెళ్ళి సాయంత్రం వస్తుంది. మా ఇంట్లో అందరం ఉన్నా అమ్మ సాయంత్రం వరకు ఒంటరిగానే ఉంటుంది. మేము ఉన్నది పెద్ద అపార్ట్‌మెంట్ అయినా ఎవరి ఇంట్లో వారు ఉంటారు తప్ప, కలసి కబుర్లు చెప్పుకోవడం తక్కువ. దీంతో దాదాపుగా రోజంతా ఆమె ఒక్కతే ఇంట్లో ఉంటుంది. పల్లెలో ఉన్నా బాగుండేది, నలుగురు కలసి మాట్లాడుకునే వారం అంటూ బాధపడుతున్నది. ఆమె పుట్టింది పల్లెటూరే అయినా ఇప్పుడు అక్కడ మాకు ఎవరూ లేరు. మా అమ్మకు పెళ్లయిన తరువాత అమ్మమ్మ వాళ్ళు ఊరిలో ఉన్న పొలం, ఇల్లు అమ్మేసి పట్టణానికి వచ్చేశారు. ఆమె చనిపోతానన్న భయం వల్ల నీరసించి పోతున్నది. అప్పుడప్పుడు చనిపోతే ఈ మానసిక క్షోభ ఉండదు కదా అంటుంది. అలాగే ఆత్మహత్య చేసుకుంటే మంచిదంటుంది. ఆమె మాటలు విని ఒక్కోసారి మాపాపకూడ ఏడుస్తున్నది. ఇటీవల ఆమెకు నిద్రపట్టి, బాగా ఆకలి వేసేందుకు ఏదైనా మందులు ఇమ్మని డాక్టరు వద్దకు వెళ్ళాం. ఆయన అన్ని పరీక్షలు చేసి శారీరక లోపం ఏదీ లేదని ఆమె అనవసరంగా భయపడి డిప్రెషన్‌కు గురవుతున్నదని చెప్పారు. నాస్నేహితురాలు ఒకామె మాట్లాడుతూ సైకియాట్రిస్టు మందులు ఇస్తారని, సైకాలజిస్టు కౌన్సెలింగ్ ద్వారా తగ్గిస్తారని చెప్పారు. కౌన్సెలింగ్ అంటే మాటలు చెప్పడమే కదా? ఆ మాటలు మేము కూడా చెపుతున్నాం. అయినా ఆమెలో ఎలాంటి మార్పు రాలేదు. ఇప్పుడు ఆమెకు కౌన్సెలింగ్ చేయిస్తే చాలా? లేక చికిత్స తప్పని సరి అంటారా! తెలుపగలరు.

– రమణి, విజయవాడ

**జవాబు:** అమ్మా చాలా సందర్భాల్లో మాటే మంత్రంలా పని చేస్తుంది. ఆదరణ ఔషధంలా బాధల్ని తగ్గిస్తుంది. అయితే సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు హార్మోను లేదా రసాయనాల అసమతుల్యత ఏర్పడినపుడు చికిత్స చేయాల్సి ఉంటుంది. అంటే మాటలకు తగ్గని రుగ్మతలకు మందులు తప్పనిసరి. ఇక మీ అమ్మగారి విషయానికి వస్తే ఆమె సమస్యకు ఒంటరి తనమే ప్రధాన కారణంగా భావించాల్సి వస్తుంది. మీ నాన్న చనిపోవడం ఆమె తీవ్రస్థాయి కొవిడ్ సమస్యను ఎదుర్కోవడం వల్ల ఆమె ఆలోచనల్లో మార్పులు వచ్చాయి. ఒక విధంగా చెప్పాలంటే ఆమె ప్రతికూల ఆలోచనలతో సతమతమవు తున్నది. దీర్ఘకాలిక సమస్యలు, ఒత్తిళ్ళు సహజం గా మనిషిని కృంగదీస్తాయి. దీనినే డిప్రెషన్ అంటాం. డిప్రె షన్ వల్ల కొందరి లో చనిపోతా మన్న భయం, ఆత్మహత్య భావనకలుగు తుంది. సాధార ణంగా డిప్రెషన్‌కు గురైన వారు నిద్ర, ఆహారాలకు దూరమవుతుంటారు. ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత కోల్పోతుంటారు. వ్యాకులత, ఆందోళనకు గురవుతుంటారు. ఆసక్తి ఉత్సాహం కోల్పోయి, అలసట, నీరసం, నిస్సత్తువకు గురవు తుంటారు. జ్ఞాపక శక్తి కూడా క్షీణిస్తుంటుం టుంది. బరువు తగ్గడం లేదా పెరగడం జరుగుతుంది.



డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి, సైకాలజిస్టు



కొందరు అతిగా తినడం, కొందరు సరిగా తినకపోవడం జరుగుతుంటుంది. ఆత్మన్యూనత, అపరాధభావం వ్యక్తపరుస్తుంటారు. దీనికి ప్రతికూల భావాలు, పరిసరాలు కారణం కావచ్చు. అలాగే భౌతిక మార్పులు, రసాయనాల అసమతుల్యత లాంటివి మూలాలుగా మారవచ్చు. ఇలాంటి దశలో వారితో మాట్లాడి వారి బాధలు పంచుకుంటే ఉపశమనం పొందుతారు. మీ సమస్యను అర్థం చేసుకున్నాను అన్న మాట అన్నింటికంటే శక్తివంతంగా పని చేస్తుందని పరిశోధనల్లో తేలింది. వారి భావాలను పంచుకుంటే బాధలనుంచి ఉపశమనం పొందుతారు. అర్థం చేసుకోకుండా అనవసరమైన హితోపదేశాలు, సూచనలు చేస్తే వారిలో విసుగు పెరిగే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి మీరు చెప్పేమాటలకు సైకాజిస్టు చేసే కౌన్సెలింగ్‌కు చాల తేడా ఉంటుంది. కాబట్టి ముందు ఆమెకు కౌన్సెలింగ్ చేయించండి. అలాగే ఆమెకు మంచి వ్యాపకం, అభిరుచులను కల్పించండి. రోజు కొద్దిసేపు నలుగురి మధ్య గడిపే అవకాశం కల్పించండి. సమతుల ఆహారం సమకూర్చండి. కుటుంబ సభ్యులు అందరు కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేయండి. రోజు ఉదయం, సాయంత్రం కనీసం వాకింగ్ చేసేలా చూడండి. యోగ, ధ్యానం అలవరిస్తే మంచిది. వారంలో ఒక రోజైనా బయటికి తీసుకెళ్లండి. తప్పకుండా ఆమె డిప్రెషన్ నుంచి బయట పడుతుంది. ఇవేవీ పనిచేయకుంటే మాత్రం మందులు వాడండి. మీ అమ్మ విషయంలో ఆదరణే ఔషధం అని గుర్తించండి. ❑

వ్యధ

# విద్యాసిద్ధిదాయిని





మానవ జీవన చైతన్య దిశానిర్దేశం చదువు, సంస్కారజ్ఞానాన్ని ప్రసాదించు చదవుల తల్లి జ్ఞాన సరస్వతి దేవి.

'శ్రీ' అనే శబ్దం శక్తి స్వరూపాన్ని వివరిస్తుంది. 'విద్' ధాతువునుండి విద్యశబ్దం ఏర్పడుతోంది మరియు దీని ముఖ్యార్థం జ్ఞానముగా చెప్పుకోవచ్చును. జ్ఞానాన్ని పరబ్రహ్మ రూపంగా కూడా చెప్పుకోవచ్చును. శుభ కార్యక్రమానికి ముందుగా వాక్కునకు నమస్కరిస్తారు. ఉచ్చారణా దోషాలు కలుగకుండా ప్రార్థన చేస్తారు ఉద్చారణా దోషాలు లేని హక్కు అద్భుత ఫలితానిస్తుంది. జ్ఞాన సముపార్జనకు మానసిక ఏకాగ్రత ముఖ్యము మానసిక ఏకాగ్రతకు ధ్యానము ప్రధానము ధ్యానానికి విద్య మైలం. విద్య అంతర్ముఖ, బహిర్ముఖ ఉద్దీపన కలుగచేస్తుంది. సక కళలకు, విద్యకు అధిదేవత శ్రీ సరస్వతీదేవి. గాయత్రీ ఉపాసలో కూడా సరస్వతీదేవి ప్రస్తావన కనబడుతుంది. సరస్వతీదేవిని గాయత్రి మాతగా భావిస్తూ ప్రార్థన చేస్తారు. "సర్వవర్ణే మహాదేవి సన్యావిద్యే సరస్వతి', సరస్వతీ మాహయామి..' సరస్వత్యై నమ.. అంటూ నమస్కరిస్తారు. సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణి, విద్యారంభం కరాష్యామి..' అంటూ విద్యా భ్యాసము ప్రారంభిస్తారు. అగ్ని కార్యక్రమాలలో కూడా సరస్వతీ దేవి ప్రార్థన కనిపిస్తుంది. ఋగ్వేదంలో కూడా సరస్వతీదేవి ప్రస్తావన కలదు. ఈ విధంగా సరస్వతీదేవి ప్రస్తావన అన్ని జ్ఞాన సముప్జాన కార్య క్రమాలలో, పితృకార్యములలో, దేవతాపూజా విధానాలలో కనిపిస్తుంది. ఋగ్వేదంలో కూడా సరస్వతీదేవి ప్రస్తావన కలదు. ఈ విధంగా సరస్వతీదేవి ప్రస్తావన అన్ని జ్ఞాన సముపార్జన కార్యక్రమాలలో, పితృకార్యములలో, దేవతాపూజా విధానాలలో కనిపిస్తుంది. సరస్వతీ కటాక్షం లేకుండా ఎటు వంటి జ్ఞాన సముపార్జన జరుగదు. జ్ఞానసముపార్జన లేని జీవితం వ్యర్థమౌతుంది. సరస్వతీదేవి పరమ సాత్విక మూర్తి. ఆమె వీణ ధరించి, పుస్తకం చేబూని, హంస వాహనముపై ధవళవస్త్రాలం కరణలో, నిర్మలంగా, ప్రశాంతంగా దర్శనమి స్తుంది. 'హంస'ను పరబ్రహ్మంగా కీర్తిస్తారు. పద కవితా పితామహుడైన అన్నమాచార్యుడు శ్రీవేకంటేశ్వరుని హంసగా అభివర్ణిడు. హంసకు పాల నుండి నీటిని వేరుపరచే అద్భుతమైన శక్తివుంది. అంటే మంచిని గ్రహించి, చెడును విస్మరించ టం అని దీని అర్థం. 'సరస్వతి' అనే పదం తనను తాను తెలుసుకు శక్తి అని కూడా చెప్ప వచ్చును. ఈ శక్తి జ్ఞానులకు మాత్ర మే సాధ్యం. అటువంటి జ్ఞానానికి, సర్వ కళలకు అధిదేవతైన శ్రీసరస్వతీదేవి మాఘ శుద్ధ పంచమినాడు జన్మించి నట్లుగా చెబుతారు. మాఘమాసం శిశర ఋతువులో వచ్చినప్పటికి, వసంతృతువుకు స్వాగత సన్నాహాలు ప్రారంభ మవుతాయి. ఇదే రోజును శ్రీపంచమిగాను, మదన పంచమిగాను వసంతపంచమి గాను కూడా జరుపుకుం టారు. సరస్వతీదేవిని బ్రహ్మ తనకు తోడుగా ఉండటానికి సృజించాడని, విష్ణువు సృజిం చాడని విష్ణుపురాణంలోను, దుర్గా మాత సృజించినదని దేవీభాగవతంలోను కనబడుతుంది. సరస్వతీదేవికి శారదాదేవి, హంసవాహిని, బుద్ధిధాత్రి, వరదాయని, కౌమారి మొదలగు పేర్లు కలవు. సరస్వతీ పురాణంలో దక్షిణామూర్తి, బ్రహ్మ, విష్ణువు, పరమేశ్వ రుడు, శ్రీరాముడు, గణపతి, కుమారస్వామి, వాల్మీకి, వ్యాసుడు, ఇంద్రుడు, సూర్యుడు, శంకరాచార్యుడు మొదలైనవారు స్తుతించిన స్తోత్రాలు కనబడతాయి. సరస్వతీదేవి కరుణతో విశేషజ్ఞానము, వాక్సుద్ధి, మంత్ర సిద్ధి, జ్ఞానసిద్ధి, ధారణాసిద్ధి, మేధాసిద్ధి కలుగుతుంది.

– డా. దేవులపల్లి పద్మజ

ఆధ్యాత్మికం

# ఐసిసి టెస్ట్‌కెప్టెన్ ఆఫ్‌ది ఇయర్‌గా బెన్‌స్టోక్స్



**దుబాయి:** ఐసిసి టెస్ట్‌క్రికెటర్ ఆఫ్‌ది ఇయర్ 2022 అవార్డును ఇంగ్లండ్ టెస్ట్‌కెప్టెన్ బెన్‌స్టోక్స్ గెలిచాడు. 2022లో బెన్‌స్టోక్స్ టెస్టుల్లో ఆల్‌రౌండర్ ప్రదర్శనతో సత్తాచాటాడు. గత ఏడాది 15 టెస్టులు ఆడిన స్టోక్స్ 36.25 సగటుతో 870 పరుగులుచేసాడు. అందులోరెండు సెంచరీలు,నాలుగు అర్థసెంచరీలున్నాయి. బంతితోనను సత్తాచాటిన స్టోక్స్ 26 వికెట్లుతీసాడు. ఫీల్డర్‌గా పదిక్యాచ్‌లు పట్టాడు. గత ఏడాది ఏప్రిల్‌లోజోరూట్‌నుంచి ఇంగ్లండ్ టెస్టుకెప్టెన్ పగ్గాలు అందుకున్న స్టోక్స్ సుదీర్ఘఫార్మట్‌పట్ల ఆలోచన ధోరణినే మార్చేశాడు. ఇప్పటివరకూ స్టోక్స్ 10 టెస్టుల్లో ఇంగ్లండ్‌కు నాయకత్వం వహించగా తొమ్మిది మ్యాచ్‌ల్లో ఆజట్టు గెలుపొందింది. ఆతడి సారథ్యంలోనే ఇంగ్లండ్‌జట్టు తొలిసారిగా పాకిస్థాన్ గడ్డపై టెస్టుసిరీస్‌ను క్లీన్‌స్వీప్‌చేసింది. దీనితో ఐసిసి టెస్ట్‌టీమ్ ఆఫది ఇయర్‌కు సైతం ఆతడినే కెప్టెన్‌గా ఎంపికచేసారు. కెప్టెన్‌గా బెన్‌స్టోక్స్ నియామకానికిముందు ఇంగ్లండ్ చివరి 17 టెస్టుల్లోకేవలం ఒక్క టెస్ట్‌లోనే గెలిచింది. వరుసగా 4 టెస్ట్‌సిరీస్‌ల్లోను ఓటమి చవిచూసింది.



# ఓపెనర్లుగా మళ్లీ ఆ ఇద్దరే!

## నేటినుంచి కివీస్‌తో భారత్ టి20 సిరీస్

**ముంబయి:** కివీస్‌తో వన్డేసిరీస్‌ను క్లీన్‌స్వీప్‌చేసిన టీమిండియా ఇపుడు టి20 సిరీస్‌కు సిద్ధం అవుతోంది. హార్ధిక్ పాండ్యా నేతృత్వంలోని యంగ్ ఇండియా న్యూజిలాండ్‌కు సవాల్ విసురుతోంది. ఈ సిరీస్‌కు రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ, కెఎల్‌రాహుల్, షమీ, సిరాజ్ వంటి స్టార్లు అందుబాటులోలేరు. వారికి విశ్రాంతినిచ్చి యువకులను బిసిసిఐ ప్రోత్సహిస్తోంది. కివీస్‌తో టి20 సిరీస్‌కుముందు టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బతగిలింది. యువ ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ గాయంతో జట్టుకు దూరం అయ్యాడు. హైదరాబాద్, మహారాష్ట్ర జట్లమధ్య రంజీమ్యాచ్ సందర్భంగా ఆతని మణికట్టుకు గాయంతో వైదొలిగాడు. ఈ ఏడాది మొదట్లో లంకతో జరిగిన టి20 సిరీస్‌లో గిల్, ఇషాన్‌కిషన్‌లు ఇద్దరూ ఓపెనర్లుగా బరిలోకి వచ్చారు. మరోసారి ఈ ఇద్దరే టీమిండియా ఓపెనర్లుగా బరిలోకి వస్తారని అంచనా. వన్డేల్లో పరుగులవరద పారిస్తున్న గిల్‌ధనాధన్‌ఫార్మాట్‌లో మాత్రం తడబడుతున్నాడు. ఒకవేళ గిల్‌బదులు వేరే ప్రయత్నామ్నాయం వెదికితే పృథ్వీషా ఓపెనర్‌గా బరిలోకి వస్తాడు. లేందంటే బెంచ్‌కేపరిమితం అవుతాడు. మూడోస్థానంలో రాహుల్‌త్రిపాఠి ఆడనున్నాడు.

శ్రీలంకతో మూడో టి20లో త్రిపాఠి మెరుపులు మెరిపించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆతనికి మరో అవకాశం ఇవ్వనున్నారు. నాలుగోస్థానంలో టి20 నెంబర్‌వన్ బ్యాటర్‌సూర్య బరిలోకి దిగుతున్నాడు. వన్డేల్లో తుస్సుమనిపిస్తున్న సూర్యకు టి20ల్లో తిరుగులేదు. తనకు ఇష్టమైన ఫార్మాట్‌లోమరోసారి చెలరేగాలని భావిస్తున్నాడు. ఆల్‌రౌండర్లుగా హార్ధిక్ పాండ్యా, దీపక్ హుడా బరిలోకి వస్తారు. శ్రీలంకతో సిరీస్‌లో ఈ ఇద్దరూ లోయర్ ఆర్డర్‌లో అదరగొట్టారు. హార్ధిక్ సూపర్‌ఫామ్‌లో ఉన్నాడు. కెప్టెన్‌గా ఆతనడిపై అదనపు బాధ్యతలు ఉన్న నేపథ్యంలో ఆటు బంతి ఇటు బ్యాట్‌తోరాణించాలి. ఇక దీపక్‌హుడా సైతం బ్యాట్, బాల్‌రెండింటా రాణించాలి. పృథ్వీషా జట్టులోకివస్తే మరో ఆల్‌రౌండర్ వాషింగ్టన్‌సుందర్ బెంచ్‌కే పరిమితం.లేదంటే ఛాన్స్ వస్తుంది. బౌలింగ్ విభాగంలో కుర్రాళ్లకు మరోసారి పరీక్ష. బుమ్రా, సిరేజ్, షమీ, బువీ వంటిసీనియర్లు లేకపోవడంతో అర్షదీప్‌సింగ్, ఉమ్రాన్ మాలిక్, శివమ్ మావిలు పేస్‌బౌలింగ్ బాధ్యతలు మోస్తారు. ఈముగ్గురూ వికెట్లు తీస్తున్నా పరుగులు ఎక్కువ ఇస్తున్నారు. స్పెషలిస్టు స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ తుదిజట్టులో చోటు దక్కించుకుంటాడు.కివీస్‌తో వన్డేల్లోకుల్దీప్ అదరగొట్టాడు. టీమిండియా తుదిజట్టులో ఇషాన్ కిషన్, గిల్/పృథ్వీషా, రాహుల్‌త్రిపాఠి, సూర్యకుమార్‌యాదవ్, దీపక్‌హుడా, హార్ధిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, శివమ్‌మావి, కుల్దీప్‌యాదవ్, అర్షదీప్‌సింగ్; ఉమ్రాన్‌మాలిక్‌లుంటారని అంచనా.

# జడేజా కమింగ్ బ్యాక్!




**అహ్మదాబాద్:** మోకాలి గాయం కారణంగా ఆసియాకప్ మధ్యలోనే వైదొలిగిన భారత ఆల్‌రౌండర్ రవీంద్రజడేజా తిరిగిక్రికెట్‌లో ఆడుగుపెట్టాడు. రంజీట్రోఫీలో భాగంగాతమిళనాడుతో జరుగుతున్న మ్యాచ్‌లో సౌరాష్ట్ర తరపున బరిలోకి దిగిన జడేజా సత్తాచాటాడు. చెన్నైలోని ఎంఎ చిదంబరం స్టేడియంలోజరుగుతున్న మ్యాచ్‌లో 17.1 ఓవర్లలో 53 పరుగులిచ్చి ఏడువికెట్లుతీసాడు. దీనితో జడేజా ఈజ్‌బ్యాక్ అని అభిమానులు చెపుతున్నారు. సెప్టెంబరుతర్వాత తొలిసారి క్రికెట్‌లోకి వచ్చి, జడేజా తమిళనాడుతోజరుగుతున్న రంజీమ్యాచ్‌మొదటి ఇన్నింగ్స్‌లోపెద్ద ప్రభావం ఇవ్వలేదు. 24 ఓవర్లుబౌలింగ్‌చేసి 48 పరుగులిచ్చిన జడేజా ఒక్క వికెట్‌నే తీసాడు.

సౌరాష్ట్ర బౌలర్లలోయువరాజ్ సింహ్ దోదియా నాలుగువికెట్లు, ధర్మేంద్రసింహ్ జడేజా మూడు వికెట్లుతీస్తే చిరాగ్‌జానీ రెండు వికెట్లుతీసాడు. తమిళనాడు బ్యాటర్లలో ముగ్గురు అర్థసెంచరీలుచేయడంతో ఆజట్టు 324 పరుగులకు ఆలౌట్ అయింది. బదులుగా సౌరాష్ట్ర 192 పరుగులకే కుప్పకూలింది. చిరాగ్‌జానీ 49 పరుగులతో టాప్‌స్కోరర్‌గా నిలవగా నాలుగునెలల తర్వాత బ్యాట్‌పట్టిన జడేజా 15 పరుగులుమాత్రమేచేసి ఔట్ అయ్యాడు.

బౌలింగ్ బ్యాటింగ్‌లోను జడేజా విఫలం కావడంతో గవాస్కర్‌ట్రోఫీఆడటం కష్టమేనని అందరూ భావించారు. రెండో ఇన్నింగ్స్‌లో జడేజా దుమ్ముదులిపాడు. ధర్మేంద్రసింహ్ జడేజాతో కలిసి తమిళనాడును 133 పరుగులకే కుప్పలకూల్చాడు. దీనితో బిసిసిఐని జడేజా మెప్పించాడనే చెప్పాలి. 266 పరుగుల లక్ష్యఛేదనలో జడేజా చెలరేగి తన జట్టును గెలిపిస్తే సౌరాష్ట్ర ఫ్యాన్స్‌తోపాటు టీమిండియా అభిమానులుకూడా ఫుల్‌ఖుషీ అవుతారనడంలో సందేహంలేదు.

# మణికట్టునొప్పితో కివీస్ టి20కి రుతురాజ్ ఔట్



**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో టి20 సిరీస్‌కు ఎంపికైన రుతురాజ్ సిరీస్ ప్రారంభానికి ముందే దూరం అవుతున్నాడు. మణికట్టునొప్పితో రుతురాజ్ ఔట్ అయినట్లు తేలింది. వన్డే సిరీస్‌కుముందు శ్రేయస్ అయ్యర్ గాయపడగా తాజాగా ఈజాబితాలో రుతురాజ్‌గైక్వాడ్ నిలిచాడు. కివీస్‌తో టి20కి ఎంపికైన రుతురాజ్ నొప్పికారణంగా వైదొలిగాడు. ఈ విషయం బిసిసిఐ అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. శుక్రవారం రాంచీ వేదికగా న్యూజిలాండ్ భారత్‌మధ్య తొలి టి20 జరగనున్న సంగతి తెలిసిందే. మహారాష్ట్ర హైదరాబాద్ జట్లమధ్య జరిగిన రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ఆడిన తర్వాత తన మణికట్టు నొప్పిగా ఉన్న అంశాన్ని రుతురాజ్ బిసిసిఐ దృష్టికతెచ్చాడు. దీనితో ఆతడు బెంగళూరులోని నేషనల్‌క్రికెట్ అకాడమీలో రీహాబిలిటేషన్‌కు వెళ్లనున్నాడు. మణికట్టుసమస్య రుతురాజ్‌కు కొత్తేమీ కాదు. కుడిచేతి మణికట్టు సమస్యలతోనే గత ఏడాది శ్రీలంకతో టి20 సిరీస్‌కు దూరంగా ఉన్నాడు. రుతురాజ్‌ఫిట్‌నెస్ కాపాడులేకపోతున్నాడని బిసిసిఐ అసంతృప్తితో ఉంది. కివీస్‌తో జరిగిన వన్డేసిరీస్‌ను 3/0 తేడాతో క్లీన్‌స్వీప్‌చేసిన భారత్‌ఐసిసి వన్డేర్యాంకింగ్‌లో అగ్రస్థానానికి చేరింది. కానీ వన్డేసిరీస్‌ప్రారంభానికిముందే శ్రేయస్ వెన్నుగాయంతో సిరీస్‌నుంచి తప్పుకున్నాడు. గతసెప్టెంబరులో గాయపడిన ఆల్‌రౌండర్ రవీంద్రజడేజా ఇటీవలే కోలుకున్నాడు. రంజీట్రోఫీలో సౌరాష్ట్ర తరపున ఆడుతున్నాడు. ఫిబ్రవరి ఒకటిన జడేజా ఫిట్‌నెస్ రిపోర్టును ఎన్‌సిఎ బిసిసిఐకి నివేదిస్తుంది. వాటి ఆధారంగానే బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో ఆడించేవిషయమై బోర్డునిర్ణయిస్తుంది.

# ఐసిసి మెన్స్‌క్రికెటర్ ఆఫ్‌ది ఇయర్‌గా బాబర్‌ఆజమ్



**కరాచి:** పాక్ కెప్టెన్ బాబర్ ఆజమ్ జాక్‌పాట్‌కొట్టాడు. ఐసిసి వన్డేక్రికెటర్ ఆఫ్‌ది ఇయర్‌గా ఎంపికైన బాబర్ ఐసిసి మెన్స్ క్రికెటర్ ఆఫది ఇయర్‌గాకూడా వచ్చాడు. 2022కిగాను సర్‌గ్యారీఫీల్డ్‌సోబర్స్ ట్రోఫీని సొంతంచేసుకున్నాడు. గత ఏడాది 44 మ్యాచ్‌లు ఆడిన బాబర్ 54.12సగటుతో2598 పరుగులు చేసాడు. 2022లో బాబర్ ఎనిమిది సెంచరీలు 15 అర్థశతకాలు చేయడం విశేషం. బాబర్ ఆజమ్ వన్డేక్రికెటర్ ఆఫ్‌ది ఇయర్‌గా ఎంపికకావడం వరుసగా ఇదిరెండోసారి కావడం విశేషం. ఇంతకుముందు విరాట్‌కోహ్లీమాత్రమే వరుసగా రెండేళ్లపాటు వన్డేక్రికెటర్‌ఆఫ్‌ది ఇయర్‌గా వచ్చాడు. గత ఏడాది అన్ని ఫార్మాట్లలోను కలిపి రెండువేలకుపైగా పరుగులుచేసిన ఏకైక ఆటగాడు బాబర్. చ2022లో 9 వన్డేలు ఆడిన బాబర్ 84.87 స్ట్రైక్‌రేట్‌తో 679 పరుగులుచేసాడు.

2021 జులైనుంచి ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో బాబర్ అగ్రస్థానంలోకొనసాగుతున్నాడు. ఇటీవలే పురుషుల వన్డేజట్టు 2022ను ప్రకటించిన ఐసిసి బాబర్ ఆజమ్‌ను కెప్టెన్‌గా నియమించింది. టి20 ఫార్మాట్‌లో బాబర్ పాక్‌ను ఫైనల్స్‌కు చేర్చాడు. ఫైనల్‌లో ఇంగ్లండ్‌చేతిలో ఓడిన పాక్‌రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఆసియాకప్, టి20 వరల్డ్‌కప్‌ల్లోమాత్రం బాబర్ తన బ్యాట్‌సత్తా చూపించలేకపోయాడు.

# ఏప్రిల్ ఒకటిన ఐపిఎల్ షురూ!



**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2023 ప్రారంభించేందుకు బిసిసిఐ షెడ్యూలుకు తుదిమెరుగులుపెడుతోంది. ఏప్రిల్ ఒకటవ తేదీ లీగ్‌ప్రారంభం అవుతుందన్న అంచనాలున్నాయి. అలాగేమే 28వతేదీ ఆదివారం ఫైనల్‌జరిగే ఛాన్స్ ఉందని చెపుతున్నారు. జూన్ 8న ఓవల్ వేదికగా వరల్డ్ టెస్ట్‌ఛాంపియన్‌షిప్ ఫైనల్ ప్రారంభం కానుండటంతో ఐపిఎల్ ఫైనల్ తేదీని బిసిసిఐ ఓవారంముందుకు జరిపింది. ఐపిఎల్‌ను 74 రోజులపాటునిర్వహించాలని బోర్డుభావించింది. కానీ మెగా లీగ్‌ప్రారంభానికి ముందు మార్చి 22వరకూ ఆస్ట్రేలియాతో నాలుగుటెస్టులుమూడు వన్డేలసిరీస్‌లో భారత్ తలపడుతుంది. దీనితో చివరకు 58 రోజులపాటు ఐపిఎల్‌నిర్వహించాలని బిసిసిఐభావిస్తోంది. ఫిబ్రవరి తొలివారంలో ఐపిఎల్ షెడ్యూలును బిసిసిఐ అధికారికంగాప్రకటించనుంది. ఐపిఎల్ షెడ్యూలుతుది దశచర్చలు కొనసాగుతున్నాయి. వచ్చేనెలతొలివారంలో విడుదలవుతుందని అంచనా. మహిళల ఐపిఎల్ జట్లను ఫైనలైజ్‌చేసాక ఐపిఎల్ కార్యవర్గం భేటీ అవుతుంది. ఈ భేటీలో ఐపిఎల్ షెడ్యూలు ఖరారుచేస్తారు. జూన్‌రెండోవారంలో డబ్ల్యుటిసి ఫైనల్ ఉండటంతో మేనెలాఖరులో ఐపిఎల్‌ను ముగించాలనుకుంటున్నామని లీగ్‌ను ఏప్రిల్‌ఒకటిన ప్రారంభించే యోచనలో ఉన్నట్లు బిసిసిఐ సీనియర్ అధికారి తెలిపారు.

# పట్టణ ప్రజల్లోనే ఎక్కువ టర్మ్ పాలసీలు

**న్యూఢిల్లీ, జనవరి 26:** టర్మ్ ఇన్సూరెన్స్ విషయంలో మెట్రోలతో పోలిస్తే ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోని ప్రజలు వివేకాన్ని ప్రదర్శిస్తున్నారు. జైపూర్, పాట్నా, పుణె తదితర పట్టణాల్లో ఎక్కువ మంది ప్రజలు అచ్చమైన బీమా ఉత్పత్తిగా పరిగణించే టర్మ్ ప్లాన్లను తీసుకుంటున్నట్లు మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ నిర్వహించిన 'ఇండియా ప్రొటెక్షన్ క్వొటెంట్ సర్వే'లో తెలిసింది. ఇక్కడ ఏజెంట్ల ద్వారా టర్మ్ ప్లాన్లను ఎక్కువ మంది తీసుకుంటుంటే, అదే సమయంలో ఆన్‌లైన్ ఛానళ్లపైనా గణనీయమైన సంఖ్యలో కొనుగోలు చేస్తున్నట్లు ఈ సర్వే నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా 25 పట్టణాల్లో 3,500 మంది ప్రజల అభిప్రాయాలను ఈ సర్వే కోసం పరిగణనలోకి తీసుకున్నారు. జీవిత బీమా ఉత్పత్తుల పట్ల




విజ్ఞానం పట్టణ ప్రజల్లో 2019లో 39గా ఉంటే, అది తాజా సర్వేలో 57కు పెరిగింది. జీవిత బీమా ఉత్పత్తులను కలిగి ఉన్న వారిలోనూ 8 శాతం వృద్ధి కనిపించింది. 73 శాతానికి చేరింది. టర్మ్ ఇన్సూరెన్స్ విలువను అర్థం చేసుకోవడం మొదలైందని, మరింత మందికి దీన్ని చేరువ చేసేందుకు జీవిత బీమా పరిశ్రమ కష్టపడి పని చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

# నష్టాల కట్టడిపై రంగంలోకి అదానీ


**వాషింగ్టన్, జనవరి 26:** అమెరికా రీసెర్చ్ సంస్థ హిండెర్ బర్గ్ అదానీ గ్రూప్ కంపెనీలపై సంచలన రిపోర్ట్ విడుదల చేసిన విషయం విదితమే. ఇది భారత స్టాక్ మార్కెట్లో పెద్ద కుదుపుకు కారణమైంది. దీనివల్ల అదానీ గ్రూప్‌లోని 10కంపెనీలు దాదాపు 5.5 బిలియన్ డాలర్ల విలువను కోల్పోయాయి. తమను సంప్రదించి వాస్తవాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా అమెరికా సంస్థ రిపోర్టు విడుదల చేసిందని అదానీ గ్రూప్ వెల్లడించింది. ఎలాంటి ఆధారాలు లేని



తప్పుడు ఆరోపణలను వక్రీకరిస్తూ, దురుద్దేశంతో ఇచ్చిన రిపోర్టుగా కంపెనీదీనిని కొట్టిపాడేసింది. కంపెనీ తీసుకొస్తున్న రూ.20 వేల కోట్ల ఎఫ్‌పిఒను టార్గెట్ చేసి ఈ రిపోర్ట్ రిలీజ్ చేసినట్లు గ్రూప్ పేర్కొంది. అదానీ షేర్ల పతనం నుంచి హిండెన్‌బర్గ్ ప్రయోజనం పొందుతుందని అదానీ గ్రూప్ ఆరోపించింది. అందుకే ఈ రీసెర్చ్ సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ముందుకు సాగుతోంది. దేశీయ మార్కెట్లలో అస్థిరతను సృష్టించి షార్ట్ సెల్ చేయడం ద్వారా హిండెన్‌బర్గ్ లాభపడుతుందని అదానీ గ్రూప్ హెడ్-లీగల్ జతిన్ జలంధ్వాలా ఒకప్రకటనలో పేర్కొన్నారు. అందుకే దీనిపై చట్టపరమైన చర్యలను పరిశీలిస్తున్నట్లు గ్రూప్ పేర్కొంది. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తన గేమ్ స్టార్ట్ చేసినట్లు కనిపిస్తోంది. సీజన్డ్ షార్ట్ సెల్లర్ భారత వ్యాపార దిగ్గజాల్లో ఒకటైన అదానీ గ్రూప్ కంపెనీ షేర్లను టార్గెట్ చేసింది. దీనివల్ల మొదటిరోజు అంటే జనవరి 25న అదానీగ్రూప్ కంపెనీలు 1-8శాతం మధ్య నష్టపోయాయి. అమెరికా మార్కెట్లలో కూడా ఇలాంటివి చోటు చేసుకుంటూనే ఉంటాయి. ఫోరెన్సిక్ షార్ట్ సెల్లర్లు అన్ని వేళలా సరైనవారు కాదు. ఇంత భారీగా ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అదానీ గ్రూప్‌కు చెందిన అదానీ టోటల్ గ్యాస్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రూప్ ఎనర్జీ, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్, అదానీ పవర్, అదానీ విల్మార్ షేర్లు భారీగా నష్టపోయాయి. ఈ క్రమంలో మొత్తం గ్రూప్ కంపెనీలు దాదాపు రూ.97 వేల కోట్లు కోల్పోయాయి.

# ఎస్‌ఎపిలోనూ ఉద్యోగుల కోత

**వాషింగ్టన్, జనవరి 26:** భారీ లేఆఫ్‌లతో ప్రపంచ వ్యాప్తంగా ఐటి ఉద్యోగులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికే గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్ సహా ఎన్నో టెక్ దిగ్గజాలు భారీ సంఖ్యలో ఉద్యోగులను




తొలగించాయి. ఆర్థిక మాంద్యం ముందు కొస్తున్న తరుణంలో కఠిన నిర్ణయాలను అమలు చేస్తున్నాయి. తాజాగా ఈ జాబితాలో జర్మన్ సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఎస్‌ఎపి కూడా చేరింది. ఈ యేడాది 3వేల వరకు ఉద్యోగులను తొలగించనున్నామని గురువారం ఆ సంస్థ ప్రకటించింది. కోర్ బిజినెస్ ఏరియాను బలోపేతం చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పింది. ఎస్‌ఎపి తీసుకున్న ఈ నిర్ణయంతో కంపెనీలో పనిచేస్తున్న 2.5శాతం ఉద్యోగులపై ప్రభావం పడనుంది. ఎస్‌ఎపిలో ప్రపంచవ్యాప్తంగా 1,20,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

# ఒకినావా రూ.220 కోట్ల పెట్టుబడి

**న్యూఢిల్లీ, జనవరి 26:** ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీలో ఉన్న ఒకినావా ఆటోటెక్ కొత్త మోడళ్లు, పవర్‌ట్రైన్ అభివృద్ధికి 220 కోట్ల రూపాయల పెట్టుబడి చేయనున్నట్లు ప్రకటించింది. ఇటలీలో నెల కొల్పిన పరిశోధన, అభివృద్ధి కేంద్రంలో నూతన మోడళ్లను రూపకల్పన చేయనున్నట్లు ప్రకటించింది. జెవి భాగస్వామి అయిన టాసిటాతో కలిసి ఈ ఆర్అండ్‌డి ఫెసిలిటీని కంపెనీ ఏర్పాటు చేసింది. ఇటలీ కేంద్రం నుంచి రూపుదిద్దుకున్న తొలి ఎలక్ట్రిక్ క్రూజర్ మోటార్ సైకిల్ ఈ యేడాదే భారత్‌లో అడుగుపెట్టనుంది. అంతర్జాతీయంగా అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతను భారత్‌కు తీసుకువచ్చేందుకే ఆర్అండ్‌డి సెంటల్ స్థాపించినట్లు తెలిపింది. గడచిన అయిదేళ్లలో 500 కోట్ల రూపాయల పెట్టుబడి చేసినట్లు ఒకినావా ఎండి జితేందర్ శర్మ వెల్లడించారు. తదుపరితరం పవర్‌ట్రైన్‌ను ఇటలీ కేంద్రంలో అభివృద్ధి చేస్తామన్నారు.



# అంచనాలను మించిన టెస్లా లాభం

**డెట్రాయిట్, జనవరి 26:** కార్ల తయారీ సంస్థ టెస్లా డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రికార్డు స్థాయి ఆదాయాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంతో పోలిస్తే లాభాల్లో 59శాతం వృద్ధి నమోదైంది. ఇతర వాహన తయారీ కంపెనీలతో పోలిస్తే ఈ యేడాది టెస్లాకు సాఫ్ట్‌వేర్ సంబంధిత అదనపు ఆదాయాల కారణంగా భవిష్యత్తులో లాభాలు భారీగా ఉంటాయని అంచనా వేసింది. వార్షిక ప్రాతిపదికన డిసెంబరు త్రైమాసికంలో లాభాలు 59శాతం పెరిగి 3.69బిలియన్ డాలర్లకు చేరాయి. ఒక్కో షేరుపై 1.19 డాలర్ల లాభం వచ్చినట్లు కంపెనీ తెలిసింది. సమీక్షా త్రైమాసికంలో ఆదాయం 24.32 బిలియన్ డాలర్లకు చేరినట్లు కంపెనీ పేర్కొంది. త్రైమాసిక ఫలితాలు అంచనాలను మించాయని వెల్లడించింది. కంపెనీ ఆటోమేటివ్ విభాగం స్థూల లాభాలు మాత్రం 30.6శాతం నుంచి 25.9 శాతానికి తగ్గినట్లు టెస్లా వెల్లడించింది. ప్లాంట్ల మూసివేత, విడిభాగాల సరఫరాలో సమస్యల వంటి సవాళ్లు ఎదురైన త్రైమాసికానికి సంబంధించిన ఫలితాలను ప్రకటిస్తున్నట్లు టెస్లా అధినేత ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించారు. అతిపెద్ద మార్కెట్లయిన అమెరికా, చైనాలో టెస్లా కొన్ని మోడళ్ల ధరలను 20 శాతానికిపైగా తగ్గించింది. గిరాకీ తగ్గడం వల్లే ఈ నిర్ణయం తీసుకుందన్న అంచనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో త్రైమాసిక ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అంచనాలకు భిన్నంగా టెస్లా మెరుగైన




ఫలితాలను ప్రకటించడం ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చింది. గత త్రైమాసికంలో 4 లక్షల మంది వినియోగదారులకు పూర్తిస్థాయి సెల్ఫ్ డ్రైవింగ్ సాఫ్ట్‌వేర్‌ను అందించామని టెస్లా పేర్కొంది. ఫలితంగా డిసెంబరు త్రైమాసికంలో 324మిలియన్ డాలర్ల ఆదాయం వచ్చినట్లు తెలిపింది. ఈ యేడాది 18లక్షల వాహనాలను ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపింది. మరోవైపు ఆర్థిక అస్థిర పరిస్థితుల నేపథ్యంలో వ్యయ నియంత్రణ ప్రణాళికను మరింత వేగంగా అమలుచేసేందుకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించింది.

# వాణిజ్యం

## 4వేల ఐబిఎం ఉద్యోగులు ఇంటికి..

**వాషింగ్టన్, జనవరి 26:** పురాతన యుఎస్ టెక్ దిగ్గజం ఐబిఎం కంపెనీ వార్షిక నగదు లక్ష్యాలను చేరుకోవడంలో ఫెయిల్ అయింది. తాజాగా నాలుగో త్రైమాసికంలో కంపెనీ ఫలితాలు తారుమారు కావడంతో ఐబిఎం కార్పొరేషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైన కంపెనీ 3,900 తొలగింపులను ప్రకటించింది. క్లయింట్-ఫేసింగ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కోసం నియామకానికి కట్టుబడి ఉన్నట్లు కంపెనీ




చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జేమ్స్ కవనాగ్ వెల్లడించారు. కంపెనీ ప్రకటన తర్వాత స్టాక్ కూడా దాదాపు రెండు శాతం మేర నష్టపోయింది. తొలగింపుల వల్ల జనవరి-మార్చి త్రైమాసికంలో సుమారు 300 మిలియన్ డాలర్ల అదనపు ఖర్చులు వస్తాయని కంపెనీ భావిస్తోంది. వాట్సన్ హెల్త్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ కింద్రిల్ వ్యాపారాన్ని విక్రయిస్తున్నట్లు వెల్లడించింది. ఇన్వెస్టర్లు కూడా కంపెనీ ఖర్చులను భారీగా తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని ఆశిస్తున్నారని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. బిగ్ టెక్ నుంచి వాల్‌స్ట్రీట్ బ్యాంకింగ్ మేజర్ల వరకు అమెరికా కంపెనీల రథసారథులు మాంద్యంలో మెరుగ్గా ముందుకు సాగాలని చూస్తున్నారు. కరోనా తర్వాత ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ సేవలపై మరింత జాగ్రత్తగా ఖర్చు చేయడం కూడా పెరిగింది. ఇలాంటి కారణాలతో టెక్ దిగ్గజం ఐబిఎం సాఫ్ట్‌వేర్, కన్సల్టింగ్ వ్యాపారంలో వృద్ధి నాలుగో త్రైమాసికంలో మందగించింది. అయితే క్లౌడ్ సర్వీసెస్ సెగ్మెంట్‌లో ఐబిఎం గతేడాది కంటే రెండు రెట్లు ఎక్కువ బిజినెస్ చేస్తోంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.